# తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు



(వ్యాస సంపుటి)



డా॥ జక్కంపూడి మునిరత్నం

కల్పనా పబ్లికేషన్స్
తిరుపతి - 2006

Dr. V. Krishnaveni
Lecturer in Telugu
SPW D. College,

# తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు

(వ్యాస సంపుటి)

డా॥ జక్కంపూడి మునిరత్నం

కల్పనా పబ్లికేషన్స్
తిరుపతి - 2006

**TALLAPAKA KAVULA SAHITI KIRANALU**

*By :* **Dr. JAKKAMPUDI MUNIRATHNAM**

*Ist Edition :* August, 2006

© All rights reserved

*Price :* Rs. 90/-


*Copies :* 500

*For copies :*

**Smt. B. Kalpana**
18, Prakasam Nagar Quarters
S.V.U. Campus, TIRUPATI - 517 502
Ph : 0877 - 2248524

*Printed at :*

**Students Offset Printers**
553, Balaji Colony
TIRUPATI - 517 502.



# కీ॥శే॥ తమటం వరదా రెడ్డి గారు

ఉన్నదానితో సంతృప్తి పడిన ఉన్నత సంస్కారవంతులు
చిన్న రైల్వే ఉద్యోగంతోనే పెద్ద బ్రతుకు బ్రతికిన మాన్య మనస్వి
సంతానంపట్ల అంతులేని ఆత్మీయత ప్రదర్శించిన అమల వాత్సల్యమూర్తి
అవసరాల్లో ఆదుకొని అనేకులను అలరించిన అమృతహృదయులు
అణుమాత్ర వివక్షకూడా లేకుండా అందరినీ
అక్కున జేర్చుకొన్న ఆత్మీయతామూర్తి
చిత్తూరు జిల్లా పాకాల మండలం వల్లివేడు సమీపస్థ
వరదప్పనాయుడు పేటలో వసించి వాసిగాంచిన వందనీయులు,
కీర్తిశేషులు తమటం వరదారెడ్డి గారి స్మృత్యర్థం

# వదాన్యులు

ఈ పుస్తక ముద్రణకు హార్దికంగా ఆర్థిక సహాయం చేసిన వదాన్య వరిష్ఠులు మితభాషి. అమిత వాత్సల్యపరులు. క్రమశిక్షణకు మారుపేరు **శ్రీ తమటం రఘునాథరెడ్డి** గారు,

స్నేహశీలి, ఉపకారశీలి, ఉదార హృదయులు **శ్రీ తమటం రామచంద్రారెడ్డి** గారు,

వినయ సంపన్నులు, నయవర్తనులు **శ్రీ తమటం ప్రభాకర్ రెడ్డి**గారు,

అభిమానవతి, అనురాగవతి, శ్రమకు ప్రాధాన్యమిచ్చే సౌశీల్యవతి **శ్రీమతి మరమలం లీలావతి** గారు

ఈ తోబుట్టువులందరూ తమ తండ్రిగారి స్మృతికి నిత్య నీరాజన మిచ్చే నిండు మనసులతో ఈ పుస్తకం వెలుగు చూసేందుకు తోడ్పడ్డారు. వీరికి వీరికుటుంబాలకు సుఖశాంతులు లభించాలని, శుభాలు కలగాలని సర్వేశ్వరుణ్ణి సన్నుతిస్తున్నా.

**- జక్కంపూడి మునిరత్నం**

# అంకితం



**శ్రీమతి కామిశెట్టి రుక్మిణమ్మ** **శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు**

హృదయం మాట్లాడితే, మాట ఆలోచిస్తే, కలిగే కమ్మని మధురానుభూతి మా గురువుగారు కామిశెట్టివారు.

భుజం మీద చెయ్యివేసి విద్యార్థి దశనుంచి సారస్వతంలోకి, సమున్నత సమాజంలోకి, సహృదయతలోకి, సరిగమలు పలికించే ఆత్మీయతలోకి, సమ్యగవేక్షణం లోకి నన్ను నడిపించిన నడిపిస్తున్న నడయాడే అమృత హృదయం మా ఆచార్యులు.

నన్ను తనలో నాలో తనను చూడగలిగిన చూపు, అపురూపమైన ప్రాపు ఆత్మీయతామూర్తి మా గురువర్యులు **శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు** గారు.

చల్లని తల్లిగా, వాత్సల్య వల్లిగా, మా గురువుగారి వికాసానికి వెన్నుదన్నుగా నిలిచిన, వాడని అనురాగమల్లిగా, నాపట్ల ఎప్పుడూ పుత్రవాత్సల్యం కనబరచే కమ్మని అమ్మ **శ్రీమతి కామిశెట్టి రుక్మిణమ్మ** గారు,

నా జీవితానికి చలువ పందిరిగా నిలిచిన ఈ పవిత్ర దంపతులకు తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలను సమర్పించుకొంటున్నాను.

- **జక్కంపూడి మునిరత్నం**

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం వెలుగు చూసేందుకు ఆర్థిక, హార్ధిక కిరణాలను ప్రసరింప జేసిన ప్రియమిత్రులు **శ్రీ తమటం రామచంద్రారెడ్డి** గారికి, వారి తోబుట్టువులకు హార్ధిక ధన్యవాదాలు,

నా వ్యాసాలను వివిధ పత్రికల్లో ప్రచురించిన పత్రికా సంపాదకులకు కైమోడ్పులు,

బహు కార్యభారంతో సతమతమౌతున్నప్పటికీ నామీది వాత్సల్యంతో రచనకు విషయాన్ని అందించడమేగాక అడిగిన వెంటనే తమ 'పుష్ప కైంకర్యం'తో ఈ గ్రంథాన్ని పరిమళింపజేసిన ప్రియతమ గురువర్యులు **ఆచార్య కె.సర్వోత్తమ రావు**గారికి, తమ నివేదనతో ఈ గ్రంథానికి శోభ చేకూర్చిన సాహితీ సముద్రులు, పూజ్య గురువర్యులు **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారికి నా కృతజ్ఞతా నమస్సుమాంజలులు.

ఈ పుస్తక రచనలో నాకెంతగానో తోడ్పడిన ప్రియమిత్రులు, అమృత హృదయులు **శ్రీ ఎమ్. జానకిరామిరెడ్డి** గారికి, తమ అమూల్య కాలాన్ని వెచ్చించి విషయ సేకరణలోను, గ్రంథ రచనలోను తోడ్పడిన ప్రియమిత్రులు **డా॥ చిట్రాజు గోవిందరాజు**గారికి స్నేహపూర్వక కృతజ్ఞతలు.

విషయసేకరణలోను, రాయడంలోను తోడ్పడిన చిరంజీవులు **డా॥ డి.పార్వతీ దేవి, టి.రఘునాథ్, యు. విజయ భాస్కర్, బి. శుభ**కు, చక్కగా డి.టి.పి. చేసిచ్చిన శ్రీమతి ఎమ్. లలిత మొదలైన వారికి నా కృతజ్ఞతా పూర్వక ఆశీస్సులు.

విషయసేకరణలోను, రచనలోను, ప్రూఫులు దిద్దడంలోను మాత్రమేగాక ఈ గ్రంథం సర్వాంగ సుందరంగా మీ చేతులను అలంకరించేందుకు సర్వ విధాలా తన సహాయ సహకారాలందించిన నా అర్ధాంగి **శ్రీమతి బి. కల్పన**కు ప్రత్యేక శుభాకాంక్షలు.

ఈ పుస్తకాన్ని సకాలంలో చక్కగా ముద్రించి ఇచ్చిన స్టూడెంట్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి నా ధన్యవాదాలు.

**– జక్కంపూడి మునిరత్నం**

# విశ్వాసం

1967వ సంవత్సరం ఒకరోజు సాయంకాలం మా మిత్రుడు ఎస్.మునిరత్నం ఇంట్లో రేడియో వింటున్నాను. మద్రాసు బి.కేంద్రం నుంచి మల్లిక్ పాడిన పాటలు ప్రసారం చేశారు. వాటిలో అన్నమయ్య కీర్తన 'బ్రహ్మ కడిగిన పాదం' కూడా ఉంది. అప్పుడే మొదటిసారిగా నేను అన్నమయ్య పేరు విన్నాను.

నేను తిరుపతి ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలో బి.ఎ. చదువుతున్నప్పుడు మా గురువుగారు కామిశెట్టి శ్రీనివాసులు శెట్టిగారూ నేనూ తరచూ కలుసుకునే వాళ్ళం. సాహిత్య గోష్ఠి చేసుకునేవాళ్ళం. అప్పుడు మా గురువుగారు నాకు అన్నమయ్య గురించి చెప్పేవారు. అన్నమయ్య సాహిత్యంలో చోటు చేసుకున్న అందచందాలను గురించి విడమరచి చెప్పేవారు. అప్పటికే వారు అన్నమయ్య క్రియల మీద పరిశోధన చేసేందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నమోదు చేసుకున్నారు. నన్ను కూడా పిహెచ్.డి. చెయ్యమని ప్రోత్సహించారు. అన్నమయ్య సాహిత్యం మీదనే నేను కూడా పరిశోధన చెయ్యాలని సూచించారు.

నేను ఎం.ఏ. పూర్తి చేశాక పరిశోధనను గురించి చర్చించేందుకు, వివరాలు తెలుసుకొనేందుకు మా గురువర్యులు ఆచార్య జి.ఎన్.రెడ్డిగారిని కలిశాను. 'అన్నమయ్య, ఆళ్వార్లు – తులనాత్మక పరిశీలన' అనే అంశం మీద పిహెచ్.డి. చెయ్యవలసిందిగా నన్ను వారు ప్రోత్సహించారు. ఆచార్య జాస్తి సూర్యనారాయణ గారి పర్యవేక్షణలో దాదాపు ఆరు సం॥లు నా పరిశోధన సాగింది. తుదకు కృతకృత్యుడయ్యాను.

నాకు ఉద్యోగం వచ్చాక విశాఖపట్నం అభినవ ఆర్ట్స్ అకాడమీ వారు ప్రతి యేడూ వెలువరించే అన్నమయ్య జయంతి ఉత్సవ సంచికలో ప్రచురించేందుకు అన్నమయ్య మీద కొన్ని వ్యాసాలను మా గురువుగారు ఆచార్య కె. సర్వోత్తమరావు గారు నా చేత రాయించారు. అన్నమయ్య మీద జరిగిన పలు సెమినార్లలోనూ పాల్గొనే అవకాశం ఇటీవల నాకు కలిగింది. సెమినార్లో చదివిన పేపర్లను, పత్రికల్లో ప్రచురింపబడిన వ్యాసాలను కలిపి ఒక పుస్తకంగా

తీసుకు రావాలనిపించింది. ఇటీవల రాసిన మరికొన్ని వ్యాసాలను కూడా వాటితో చేర్చాను. అదే ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం.

ఈ పుస్తకంలో 12 వ్యాసాలున్నాయి. తాళ్ళపాక అన్నమాచార్యుని సాహిత్యం మీద వచ్చిన వ్యాసాలు కొన్ని, తాళ్ళపాక తిమ్మక్క రచించిన 'సుభద్రా కల్యాణం' మీద రచించిన వ్యాసం ఒకటి, తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు, తాళ్ళపాక చిన తిరుమలాచార్యుడు, తాళ్ళపాక చిన్నన్న వీళ్ళ రచనలకు సంబంధించి రాసిన వ్యాసాలు కొన్ని తాళ్ళపాక వారి సాహిత్యం కూలంకషంగా గాక అక్కడక్కడా కొంత మేరకు మాత్రమే ఈ పుస్తకంలో చర్చించబడటం వల్ల దీనికి "తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు" అని పేరు పెట్టడం జరిగింది.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో తాళ్ళపాక కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. అందరూ వాగ్గేయ కారులు, కవులు, భక్తులు. అందువల్ల వీరి సాహిత్యం బహుముఖంగా వెలువడింది. బహువిధాలుగా వ్యాపించింది. దీన్ని ఆధారం చేసుకొనే 'తాళ్ళపాక వారిది కొంత, తమది కొంత' అనే నానుడి ఆంధ్రదేశంలో బాగా ప్రచారంలోకి వచ్చింది.

తాళ్ళపాకవారి సాహిత్యంలో పదాలను తలపించే పద్యాలున్నాయి. పద్యాలను తలపించే పదాలున్నాయి. పదం, పద్యం, వచనం అనే వివక్ష లేకుండా రచనలంతటా కూడా కవిత్వపరిమళం గుభాళిస్తూనే ఉంటుంది. పాఠకుల గుండెల్ని పట్టి ఊపేస్తూనే ఉంటుంది.

తాళ్ళపాక వారి సాహిత్యాన్ని 'తూచే తక్కెడ' ఎక్కడా లేదని నా అభిప్రాయం. అయినప్పటికీ నేను రుచి చూచిన కొంత మీకు రుచి చూపించకుండా ఉండలేను. అందుకే ఈ పుస్తకాన్ని మీకు అందిస్తున్నాను. నన్ను మధురానుభూతికి గురిచేసిన తాళ్ళపాక వారి 'సాహితీ కిరణ స్పర్శ', మీకు అటువంటి అనుభూతి కలిగిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం.

**- జక్కంపూడి మునిరత్నం**

తిరుపతి

26-08-06

# నివేదన

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

విశ్రాంతాచార్యులు
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల
తిరుపతి.

ఆంధ్ర వాఙ్మయములో అన్నమాచార్యుల స్థానం అద్వితీయమైనది. ఇటీవల ఈ పద సాహిత్యం అనన్య సామాన్యమైన ప్రచారం పొందినది. సినిమాలు, నాటకాలు, హరికథలు, కావ్యాలు, గేయాలు - ఇలా వివిధ రూపాలలో అన్నమయ్య కీర్తి కీర్తింపబడుతున్నది.

ఇక పరిశోధనా రంగంలో అన్నమాచార్యుల పద సారస్వతం మీద వచ్చిన పరిశోధన గ్రంథరాశి మితి మించినదనుటకు సందేహం లేదు. అన్నమయ్య కవితను పలు దృష్టి కోణాలతో చూచి అందలి స్వారస్యాన్ని సహృదయులకు అందించే పరిశోధకాగ్రణులు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, సంయుక్తాచార్యులు, బహుగ్రంథ కర్త, సుప్రసిద్ధ విద్వత్కవి డా॥ జక్కంపూడి మునిరత్నం గారు 12 వ్యాసాలతో 'తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు' అనే ఈ వ్యాస సంపుటిని వెలువరించారు.

పరిశోధన భగవంతుని విశ్వరూపంలాగా నానా రూపాలు దాలుస్తుంది. అందులో ఒక రచయిత యొక్క రచన పూర్వుల రచనలతో, లేదా సమకాలికుల కృతులతో పోల్చి అందలి సౌందర్యమునో, లేక బాగోగులనో విశ్లేషించడం ఒక పద్ధతి.

ఆ కోవలో సాగిన ఈ పుస్తకంలో అన్నమయ్య కవితతో ఆండాళ్, నమ్మాళ్వార్, మున్నగు ప్రాచీనులు, తరువాతి వాడైన రామదాసు కవితలలో గల సామ్యం చర్చించబడింది.

అన్నమయ్య ఆత్మ విమర్శ పరామర్శింపబడింది. ఆయన దశావతార కీర్తనలలోని చమత్కారాలు స్పృశింపబడినవి. హనుమంతునిపై ఆయన పాడిన పదాల సొంపు చిత్రించబడింది.

ఆ తరువాత తిమ్మక్క, పెద్ద తిరుమలయ్య, చిన్న తిరుమలయ్యల కవితలలోని కమనీయత వివరింపబడింది.

ఇలా అనేక దృక్కోణాలతో ఆలోచించి రచించిన ఈ గ్రంథం అన్నమయ్య కుటుంబానికి చెందిన ప్రమాణ రచయితల రచనా పాటవాన్ని తేటతెల్లం కావిస్తున్నది. పాఠకులలోని భావనాశక్తిని స్పందింపజేసే ఇట్టి రచనలు ఈ కాలంలో ఎంతో అవసరమై ఉన్నాయి. అవి మెదడుకు పదునుబెట్టి భావనాపరిధిని విస్తరింప జేస్తాయి.

పరిశోధకుల పాలిటి దిక్సూచిగా అవతరించిన ఈ రచన విస్తృతంగా పఠన పాఠనాదులకు పాత్రం కాగలదని విశ్వసిస్తున్నాను.

# పుష్ప కైంకర్యం

**ఆచార్య కె. సర్వోత్తమరావు**
విశ్రాంతాచార్యులు
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి.

నేను పదవీ విరమణ చేశాక పుస్తకాలకు పరిచయాలు, పీఠికలు వ్రాయడం చాల వరకు తగ్గించేశాను. ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే ఆచార్యులు తమ శాఖలోని సమున్నతులచే పరిచయాలు, పీఠికలు వ్రాయించుకోవడం సత్సంప్రదాయమని నా అభిప్రాయం. అయినా డా॥ జె. మునిరత్నం పట్టువీడని విక్రమార్కునిలా నన్ను నిర్బంధిస్తుంటే వ్రాయక తప్పలేదు. ఇదొక వాత్సల్య బంధం. తప్పుతుందా మరి.

ఇటీవలి కాలంలో 'అన్నమయ్య'కు మార్కెట్ బాగానే ఉంది. నాలుగయిదు కీర్తనలు బాగా సాధన చేసి శ్రవణానందకరంగా పాడగలిగితే సభాస్థలి కరతాళ ధ్వనులతో దద్దరిల్లుతుంది. ఇక సాహిత్యరంగంలో కూడా 'అన్నమయ్య' రచనలపై 'క్రేజ్' పెరిగింది. పరిశోధకులలో కొందరు అన్నమయ్య సంకీర్తనల వాహినీ తీరాన నిలబడి తమ కరపంకజాలతో కాసంత నీళ్ళు తీసుకొని 'సంప్రోక్షణ' చేసుకొని పునీతులవుతున్నారు. ఇంకా కొందరు నదిలో నాలుగడుగులు వేసి తీరం చూశామని అంతు కనుక్కొన్నామని సంబర పడుతున్నారు. మరికొందరేమో ఆ వాహిని 'గలగలలకు', 'బిరబిరా' పరుగులకు తన్మయులవుతున్నారు. ఎవరి అనుభూతి వారిది. కాదనడానికి, వద్దనడానికి కొలబద్దలు లేవు. నాకు ఆ అధికారమూ లేదు, అవసరమూ లేదు.

ఈ రోజుల్లో పిహెచ్.డి. పట్టా పుచ్చుకొన్న వారు కొందరు ఆ తరువాత తమ రంగంలో సాగుతున్న కృషిని పట్టించుకోరు. కాని డా॥ జె. మునిరత్నం అన్నమయ్యను మరిచి పోలేదు. ఆళ్వారులను విస్మరించనూ లేదు. అందువల్లనే 'అన్నమయ్య – ఆండాళ్ : అన్నమయ్య – నమ్మాళ్వార్' తులనాత్మక పరిశీలన చేశారు. తాను అనేక శతకాలు వ్రాసినవారు కావడం వల్ల 'అన్నమయ్య వేంకటేశ్వర శతకం' పై వ్యాసం వ్రాశారు. కల్లా కపటం లేని భక్తులు కనుక అన్నమయ్య 'మధురభక్తి'ని అర్థం చేసుకొన్నారు. ధ్యానం, యోగం దినచర్యలో

భాగం కనుక చిన తిరుమలయ్య ఆధ్యాత్మిక వైభవం దర్శించగలిగారు. తన్ను తాను బేరీజు చేసుకొనే మనస్తత్వం కలవాడు కనుక 'అన్నమయ్య ఆత్మ విమర్శ' అర్థం చేసుకోగలిగారు. 'ఆడే కాలు పాడే నోరు' ఊరుకోదు కనుక రామదాసు సంకీర్తనలతో అన్నమయ్య పదాలను అనుసంధానించుకోగలిగారు. సాహిత్యంలోని 'తియ్యదనాన్ని' తాననుభవించడమే గాకుండా ఇతరులకు పంచాలనే తపన కలవాడు కనుక 'తిమ్మక్క వంట రుచిని' అమ్మలక్కలకు, అన్నాతమ్ముళ్ళకు తెలియచెప్పారు. డా॥ మునిరత్నం 'తన శక్తి తనకు తెలియని హనుమంతుని లాంటివాడు' కనుక అన్నమయ్య హనుమత్సంకీర్తనలను అర్థం చేసుకోగలిగారు.

ఇటీవలి కాలంలో అన్నమయ్యను సంఘ సంస్కరణవాదిగానే గుర్తించాలనే వాదం సభల్లో బలపడుతూ వుంది. అన్నమయ్య సామాజిక శ్రేయస్సు కోరే వాడనడంలో అభిప్రాయ భేదం లేదు కాని అతని 'పాదయుగ్మం', 'భక్తిభూమి' మీద ఉందనడం వాస్తవం. ఆ కారణం వల్లనే మునిరత్నం 'అన్నమయ్యను అలరించిన భక్తులు' వ్యాసం వ్రాయగలిగారు.

ఈరోజుల్లో 'మనుజావతారాలను' లెక్కపెట్టడం సాధ్యం కాదు. అయినా మునిరత్నంకు నచ్చింది. 'అన్నమయ్య దశావతారాలు' ఆ అవతారాలలో జీవుని వేదన ఉంది. సొగసులున్నాయి. వంపూ సొంపులున్నాయి. అవతారాల వర్ణనలలో లాస్య తాండవాలు కూడా ఉన్నాయి. అవతారాల అంతు కనుక్కోవడం అంత తేలిక కాదు.

ఏది ఏమయినా మునిరత్నం అన్నమయ్యకు సమర్పించింది 'వ్యాసమాలిక'. పుష్పకైంకర్యం చేసిన ఆళ్వారులలాగా, ఆచార్యులలాగా, సామాన్య భక్తునిలాగా వ్యాస పుష్పాలను కూర్చారు. ఈ మాలికను 'అన్నమయ్య' సంప్రీతితో స్వీకరిస్తాడు. గోద ముడిచి ఇచ్చిన మాలికలాగా తాను ధరించి మురిసిపోతాడు. వనమాలిని వేనోళ్ళ కొనియాడుతూ వైకుంఠవాసుని దగ్గర తచ్చాడుతాడు.

పుష్పకైంకర్యం చేసిన మునిరత్నం 'ధన్యుడు'. పైగా అన్నమాచార్యుల రచనలపై పరిశోధన చేస్తున్న వారిలో గణ్యుడు. ఈ వ్యాస సంపుటి 'తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు' ఎగిరెగిరి పడి మూల దాక్కొనే 'బంతి' లాంటిది కాదు. ఇదొక 'పూలబంతి'.

- కె. సర్వోత్తమరావు

# ఈ పుస్తకంలోని . . .


| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య - ఆండాళ్ | 1 |
| 2. | అన్నమయ్య - నమ్మాళ్వార్ | 13 |
| 3. | రామదాసు - అన్నమయ్య | 16 |
| 4. | అన్నమయ్య ఆత్మ విమర్శ | 32 |
| 5. | అన్నమయ్య దశావతార సంకీర్తనలు | 38 |
| 6. | అన్నమయ్య వేంకటేశ్వర శతకం - అందచందాలు | 46 |
| 7. | అన్నమయ్యను అలరించిన భక్తులు | 58 |
| 8. | అన్నమయ్య హనుమత్సంకీర్తనలు | 69 |
| 9. | తిమ్మక్క పంచిన తియ్యదనం | 82 |
| 10. | పెద్ద తిరుమలయ్య మధుర భక్తి | 106 |
| 11. | చిన తిరుమలయ్య ఆధ్యాత్మిక వైభవం | 117 |
| 12. | చిన్నన్న కవన సౌందర్యం | 128 |

# అన్నమయ్య - ఆండాళ్

భక్తులలో లింగవివక్షతగానీ, వయో వివక్షతగానీ, వర్ణ వివక్షతగానీ, ప్రాంతీయ వివక్షతగానీ కనిపించవు. వారికి ప్రధానం భక్తి మాత్రమే. ఉపాసనా విధానంలోనూ, ఆలోచనా విధానంలోనూ, స్తుతి విధానంలోనూ వారిలో సామ్యాలు గోచరిస్తాయి. ఈ సామ్యాలు ఏ ఇద్దరిలోగానీ, ఏ కొందరిలోగానీ గోచరించే అవకాశం ఉంది.

అటువంటి భక్తుల కోవకు చెందినవారే అన్నమయ్య, ఆండాళ్. అన్నమయ్య తాళ్ళపాకలో జన్మించి దక్షిణంగా ప్రయాణించి తిరుమలేశుని కైంకర్యంలో నిమగ్నుడయ్యాడు. ఆండాళ్ శ్రీవిల్లి పుత్తూరులో జన్మించి ఉత్తరంగా ప్రయాణించి శ్రీరంగంలో వెలసిన శ్రీరంగనాథునిలో ఐక్యమైంది. అన్నమయ్య తెలుగు కీర్తనా పుష్పాలతో వేంకటేశ్వరుని సేవించగా, ఆండాళ్ తమిళభక్తి పాశురాలతో పరమపదనాథుని పరవశింపజేసింది.

తొలి తెలుగు వాగ్గేయకారులు, పదకవితా పితామహులు, సంకీర్తనాచార్యులు, పంచమాగమ సార్వభౌములు అని అనేక పేర్లతో అన్నమయ్యను కొనియాడతారు. అలాగే ఆండాళ్ కూడా కోదై, సూడి కొడుత్త సుడర్ కొడి, సూడి కొడుత్త నాచ్చియార్, రంగనాయిక, గోదాదేవి అనేపేర్లతో ప్రసిద్ధి వహించింది.

అన్నమయ్య 15వ శతాబ్దానికి చెందినవాడు కాగా ఆండాళ్ 9వ శతాబ్దానికి చెందిన భక్తురాలు. మధురభక్తి భరితమైన కీర్తలనేకం రచించి అన్నమయ్య తన భగవద్విరహాన్ని ప్రకటించగా, ఆండాళ్ అనేక పాశురాల్లో తన భగవద్విరహాన్ని ప్రకటించింది. వీరిద్దరి రచనల్లోనూ అనేక సామ్యాలు గోచరిస్తున్నాయి.

అన్నమయ్య, ఆండాళ్ ఇద్దరూ కూడా విష్ణువునుద్దేశించి అనేక మేలు కొలుపులు రచించారు. అన్నమయ్య కీర్తన యావత్తూ మేలుకొలుపుకు వినియోగింపబడగా, ఆండాళ్ తన పాశుర భాగాలను కొన్నిటిని మాత్రం కృష్ణుడి మేలుకొలుపుకు వినియోగించింది.

అన్నమయ్య సంకీర్తనల్లో మేలుకొలుపులనేకం కనిపిస్తాయి. పెరియాళ్వార్ లాగా అన్నమయ్య కూడా తనను యశోదగా భావించుకొని పుత్రవాత్సల్యం ప్రకటిస్తూ కృష్ణుణ్ణి మేలుకొలిపాడు. తొండరడిప్పొడి ఆళ్వార్‌లాగా భక్తుడై భక్తి ప్రపత్తులతో భగవంతుని మేలు కొలిపాడు. కల్ల నిద్దుర చాలించి మేలుకోకపోతే ప్రకృతికి సహజ చైతన్యం రాదని పరోక్షంగా హెచ్చరించాడు. ప్రాతఃకాలంలో ప్రకృతి పొందే మార్పులను వర్ణిస్తూ ఆలస్యం చేయడం భావ్యంకాదని త్వరగా మేలుకొమ్మని శ్రీ వేంకటేశుణ్ణి ఒత్తిడి చేశాడు.

హరికృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరువాత నా మోము తప్పకిటు చూడు

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడినాడను
చాలునిక నిద్దురలు చద్ది కూళ్ళపొద్దు
వేళాయ నా తండ్రి వేగలేవె ॥హరి॥

కనుదెరవు నా తండ్రి కమలాప్తుడుదయించె
వనిత మొక మజ్జనము వడి దెచ్చెను
మొనసి మీ తండ్రి యిదె ముద్దాడ జెలగీని
దను జాంతకుండ యిక దగ మేలుకోవే ॥హరి॥

లేవె నాతండ్రి నీ లీలలటు వొగడేరు
శ్రీ వేంకటాద్రిపతి శ్రీ రమణుడా
దేవతలు మునులు జెందిన నారదాదులు
ఆవలను బాడేరు ఆకసము నందు ॥హరి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-543)

భోగి శయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే

కన్నులు దెరవక కమల బాంధవుడు
వెన్నెల రేణువు వెలయదిదే

అన్నువ మలసీ నరుణోదయమిదే
మిన్నక నీవిటు మేలుకొనవే ॥భోగి॥

తెల్లని కన్నులు దెరవక విరియగ
నొల్లక జలములున్న వివే
కల్ల నిద్దుర నిను గవియగ నియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే ॥భోగి॥

తెరవగు రెప్పల దెల్లవారవలె
తెరవక చీకటి దీరదిదే
తెరగు వేంకటాధిప నీ వెఱుగుదు
మెఱుగులు చల్లుచు మేలుకొనవే ॥భోగి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-139)

ఆండాళ్ మూడు మేలుకొలుపు పాశురాలను రచించింది. తిరుప్పావై 17వ పాశురంలో నందగోపుణ్ణి, యశోదాదేవిని, కృష్ణుణ్ణి, బలరాముణ్ణి 20వ పాశురంలో కృష్ణుణ్ణి, నప్పిన్నై (నీలాదేవి)ని నిదురలేపింది. 21వ పాశురంలో కృష్ణుణ్ణి మాత్రమే నిదురలేపింది. ఈమె కృష్ణుణ్ణి నిదుర లేపిన తీరు హృద్యంగా ఉంది.

ముప్పత్తు మూవర మరర్కు మున్ శెన్రు
కప్పం తవిర్కు కలియె తుయి లెళాయ్
శెప్ప ముడైయాయ్ తిరలుడైయాయ్ సెట్రార్కు
వెప్పం కొడుక్కుం విమలా తుయిలెళాయ్

(ఆండాళ్ తిరుప్పావై పద్యం 20)

ముప్పై మూడుకోట్ల దేవతలకు ఆపద వచ్చీరాకముందే వెళ్ళి వారి భయాన్ని పోగొట్టే మిడుకుగల స్వామీ! నిదురలే. ఆర్జవం కలవాడా! సామర్థ్యం కలవాడా! శత్రువులకు తీక్షణతను చూపే విమలా! నిదుర మేలుకో!

ఇక్కడ అన్నమయ్య, ఆండాళ్ ఇద్దరూ కూడా విష్ణువును మేల్కొలిపారు. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి మేలుకొలిపితే ఆండాళ్ కృష్ణుణ్ణి మేల్కొలిపింది.

అన్నమాచార్యుడు శ్రీనివాసునికి మంగళాశాసనం చేస్తూ అనేక సంకీర్తనలు రచించాడు. విష్ణువు, విష్ణు వక్షో వాసిని దంపతులు. దంపతులను ఒకే వ్యక్తిగా పరిగణించే ఆనవాయితీ మన హైందవ సమాజంలో ఉంది. ఈ అంశాన్ని మనసులో ఉంచుకొనో యేమో అన్నమయ్య లక్ష్మీనారాయణులిద్దరికీ ఒకేసారి మంగళాశాసనం చేశాడు.

మరలి మరలి జయ మంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము

కమలారమణికి గమలాక్షునకును
మమతల జయజయ మంగళము
అమర జననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము ॥మరలి॥

జలధి కన్యకును జలధిశాయికిని
మలయుచును శుభమంగళము
కలిమికాంత కాకలికి విభునికిని
సుళువుల యారతి శుభమంగళము ॥మరలి॥

చిత్తజుతల్లికి శ్రీ వేంకటపతికి
మత్తిల్లిన జయ మంగళము
యిత్తల నత్తల యిరువుర కాగిటి
జొత్తుల రతులకు శుభమంగళము ॥మరలి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-448)

ఆండాళ్ రెండు పాశురాల్లో మాత్రమే విష్ణువుకు మంగళాశాసనం చేసింది.

"అంద్రు ఇవ్వులగ మళందాయ డి పోట్రి
శెన్జంగు తెన్నిలంగై సెట్రాయ్ తిరల్ పోట్రి
పొన్జచ్చగడం ఉదైత్తాయ్ పుగల్ పోట్రి
కన్ను కుణిలాయ్ ఎరిందాయ్ కళల్ పోట్రి
కున్ను కుడయా ఎడుత్తాయ్ గుణం పోట్రి
వెన్జు పగై కెడుక్కుం నిన్ కైయిల్ వేల్ వేల్ పోట్రి" (తిరుప్పావై 24)

ఆనాడు ఈ ప్రపంచాన్ని కొలిచినవాడా! నీ పాదాలకు మంగళమగు గాక! దక్షిణలో ఉన్న లంకకు వెళ్ళి దానిని నాశనం చేసినవాడా! నీ సామర్థ్యానికి మంగళం అగుగాక! వత్సాసురుణ్ణి కర్రగా విసిరినవాడా నీ పాదాలకు మంగళం అగుగాక! పర్వతాన్ని గొడుగుగా పైకెత్తినవాడా నీ గుణాలకు మంగళం అగుగాక!

సాటిలేని శ్రీ వెంకటేశ్వరుడే దైవమని అతన్ని సేవిస్తూ బ్రతికేదే బ్రతుకని అన్నమయ్య ఎలుగెత్తి చాటాడు.

"ఎనలేని తిరువెంకటేశుడే దైవమని
వినగలిగినది గదా వినికి
అనయంబు నతని సేవానందపరులయి
మనగలిగినది గదా మనుజులకు మనికి" (1-181)

ఆండాళ్ తనను వేంకటేశ్వరునితో కూర్చుమని అనంగదేవుని అర్థించింది.

"వెయ్యదోర్ తళలుమిళ్ శక్కరక్కై
వేంగడ వర్కు ఎన్నై విదికిట్రియే" (నాచ్చియార్ తిరుమొళి. 1-1)

నిప్పు కక్కే ఉగ్ర చక్రహస్తుడైన వేంకటేశ్వరునికి నన్ను విధించు.

మహాత్ములు తాము ఎంతటి గొప్పవారైనా అణకువను ప్రదర్శిస్తూ ఉంటారు. అహంకారం పతన హేతువు కాగా, అణకువ ఉద్ధరణ హేతువు. అన్నమయ్య, ఆండాళ్ కూడా అణకువను ప్రదర్శించటం ద్వారా తమ ఔన్నత్యాన్ని ఆవిష్కరించారు.

అన్నమయ్య అన్ని దోషాలు తనవేనని, తనవంటి అధముడెక్కడా లేడని వాపోయాడు.

"నేను సేయని పాపమేడది నిఖిలలోకములందును
నేను చొరని నరకమేడది నెఱయ దుర్గతుల
నేను పొడమని యోను లేదవి నిఖిల జంతువులందును
పూని హరి నిను శరణు చొరగా బుణ్యుగా జేసితివి గాక
.............................................
............................................." (3-405)

ఆండాళ్ నాచ్చియార్ తిరుమొళిలోని మూడు పాశురాల్లో తన అణకువను ప్రదర్శించింది. ఈమె తనను నిందించుకోవడమేగాక ఈ బ్రహ్మాండ సృష్టిలో నరజాతి అల్పత్వాన్ని కూడా గుర్తు చేసింది.

"పావియేన్" పాపినైన నేను.

(నాచ్చియార్ తిరుమొళి పత్తాంతిరుమొళి పద్యం 3)

"శిరుమానిడవర్ నామ్" మనం క్షుద్ర మానవులము.

(నాచ్చియార్ తిరుమొళి పత్తాంతిరుమొళి పద్యం 10)

విష్ణుదేవుని లీలల్లో వటపత్ర శయనవృత్తాంతం ఒకటి. ఈ వృత్తాంతాన్ని ఎందరో భక్తులు కొనియాడారు. అన్నమయ్య అనేక సంకీర్తనల్లో వటపత్ర శాయిని వినుతించాడు.

"ఏకార్ణవమై ఉదకము లేచిన బ్రహ్మాండములో
బైకొని యుండగ నొక వటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొక శిశువై వడిదేలాగిన
శ్రీకాంతుడీతడే పో శ్రీ వేంకట విభుడు
..........................................
.........................................."

ఆండాళ్ నాలుగు పాశురాల్లో మహావిష్ణుదేవుని వటపత్ర శయన వృత్తాంతాన్ని స్పృశించింది.

"అన్ఱు బాలగనాగి ఆలిలై
మేళ్ తుయిన్ఱ్ర వెంమాదియాయ్"

(నాచ్చియార్ తిరుమొళి - ఇరండాం తిరుమొళి పద్యం 2)

ఆనాడు బాలకుడై వటపత్రం మీద నిద్రించిన మా ఆదిమూల పురుషుడవు.

పద కవితా పితామహుడు తన పద్మనాభేతర విముఖతను వెల్లడిస్తూ పలు రచనలు చేశాడు. హరిని కొలవకుండడం అన్యాయమన్నాడు. వేంకటేశ్వరునితో తప్ప పరదైవాలతో తనకు పని లేదన్నాడు.

"హరి పుట్టించిన దేహి హరినే కొలువక
నరుల గొలుచుట అన్యాయమయ్య"

"నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడి పనిమాకు లేదయ్యా"

గోదాదేవి గోవిందేతర విముఖతను తెలుపుతూ రెండు పాశురాలు రచించింది. ఆండాళ్ మనసారా విష్ణువును వరించింది. అతన్ని తప్ప అన్యులను కన్నెత్తి చూడకూడదనుకొంది. తన అవయవాలు కూడా నారాయణేతరులపట్ల విముఖతను ప్రదర్శిస్తున్నట్టు విస్పష్టం చేసింది.

"అంగైత్తలత్తిడై ఆళి కొండానవన్ ముగత్తన్ని విళియే నెన్ను
సెంగచ్చుకొండు కణ్ణాడైయార్తు చ్చిరుమానిడవరై కాణిల్ నానుం
కొంగైత్తల మివై నోక్కి క్కాణీర్ గోవిందనుక్కల్లాల్ వాయిల్ పోగా"
(నాచ్చియార్ తిరుమొళి పనిరెండాంతిరుమొళి. పద్యం 4)

చక్రహస్తునికంటె అన్యుల ముఖం చూడము అని కంటిగంతగా కచ్చుపట్ట ధరించి క్షుద్ర మానవులని చూడదానికి భయపడుతున్న నా యీ స్తనాలను చూడండి గోవిందేతరుల ద్వారాలకైనా వెళ్ళవు.

విష్ణుదేవుని దశావతారాలను కొనియాడడం విష్ణుభక్తులందరికీ పరిపాటి. కూర్మావతారాన్ని అన్నమయ్య, ఆండాళ్ ఇద్దరూ కూడా ప్రస్తావించారు. అన్నమయ్య కూర్మావతారాన్ని కొనియాడుతూ అనేక కీర్తనలు రచించాడు.

దేవతలు తాము పోగొట్టుకున్న సంపదలను మళ్ళీ పొందారు. అమృతాన్ని సేవించి మరణంలేని జీవనాన్ని కూడా పొందారు.

ఇంతటికీ కారణం పాలసముద్రాన్ని చిలకడంలో తోడ్పడిన సుధామధనుడే కూర్మావతారుడే. ఇక్కడ కూర్మావతారం పరోక్షంగా స్మరించబడింది. ఈ అన్నమయ్య సంకీర్తనాంశాన్ని గమనించండి.

"శ్రీమించు నమరుల జీవనమెల్ల
సుధామధనుని సంతత కరుణే"

గోదాదేవి కూర్మావతారాన్ని స్మరిస్తూ నాలుగు పాశురాలు రచించింది. ఈమె వేంకటేశ్వరునికి మేఘ సందేశాన్ని పంపింది. వేంకటాచలంలో విహరించే మేఘాలు వేంకటేశుని మేఘాలుగానే పరిగణించింది. కాబట్టి శంఖులతో కూడిన

సముద్రాన్ని మథించినవాని చల్లని మేఘములారా! అని వాటిని సంబోధించి సందేశాన్ని వినిపించింది.

"సంగమా కడల్ కడైన్ దాన్ తణ్ ముగిల్ కాళ్"

(నాచ్చియార్ తిరుమొళి పద్యం 7)

శంఖులతో కూడిన పెద్ద సముద్రాన్ని మథించినవాని చల్లని మేఘములారా!

ఇక్కడ కూడా కూర్మావతార ప్రసక్తి పరోక్షంగానే గోచరిస్తూ ఉంది.

అన్నమయ్య పలు కీర్తనల్లో వరాహ ప్రశంస చేశాడు. వరాహావతార ప్రయోజనాలైన హిరణ్యాక్ష వధ, మహీతల పునఃస్థాపనం వెల్లడిస్తూ రచించిన ఈ కీర్తనాంశం మధురభావ భరితం.

"చలమున హిరణ్య జక్కాడి యిటు భూ
వలయము నిలిపిన వరాహమా"

ఆండాళ్ వరాహస్వామిని స్మరిస్తూ ఒక పాశురం రచించింది. ఇందులో ఈమె వరాహదేహపు హేయతను స్మరించి లోకోద్ధరణ కోసం భగవంతుడు అలాంటి దేహాన్ని కూడా ధరిస్తాడని ధ్వని పూర్వకంగా ప్రకటించింది.

"పాశితూర్తు క్కిడైంద పార్ మగడ్కు పండొరునాళ్
మాశుడంబిల్ నీర్ మానమిల్లా ప్పంఱ్రియామ్
తేశుడైయ దేవర్" (నాచ్చియార్ తిరుమొళి 11-8)

పూర్వమొకనాడు పాచిపట్టి ప్రళయ జలంలో మునిగి పడిఉన్న భూమాతకోసం మురికితో కూడిన దేహం నుండి నీరు స్రవిస్తుండగా, మానంలేని వరాహమైన తేజస్వియైన దేవుడు.

మహావిష్ణువు లోకోద్ధరణ కోసం ఎటువంటి రూపాన్నైనా ధరిస్తాడని, ఎటువంటి ఇబ్బందినైనా సహిస్తాడని ఇది ఆదర్శ పరోపకారి లక్షణమని ఆండాళ్ ఇక్కడ తెలిజేసినట్టయింది.

అన్నమయ్య నరసింహుని వినుతిస్తూ హెచ్చు సంఖ్యలో కీర్తనలు రచించాడు. నరసింహావిర్భావ, హిరణ్య వధలను అద్భుతంగా చిత్రించడమేగాక నరసింహావతార సమయాన్ని కూడా చక్కగా తెలియజేస్తూ రచించాడు.

జగతి వైశాఖ శుద్ధ చతుర్దశి మందవార
మగణితముగ గూడెనదె స్వాతి యోగము

పక్కున నుక్కు గంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్య కశిపు దొడిగి పట్టి
చక్కగా గడప మీద సంధ్యాకాలమున
వక్కలు సేసె నురవడి నరసింహుడు

పిప్పిగాగ జప్పరించి పేగులు జందేలు వేసి
తొప్పదోగుచు నెత్తురు దోసిట జల్లె
రొప్పుచు గోపముతో గేరుచు బక పక నవ్వి
తప్పక చూచెవాని నుదగ్ర నరసింహుడు

యెదుట బ్రహ్లాదు జూచి యిందిర దొడపై నుంచె
అదన నందరికి నభయ మిచ్చె
కదసి శ్రీ వేంకటాద్రి గద్దెమీద గూచుండె
వెదచల్లె గృపయెల్ల వీర నరసింహుడు

(తాళ్ళపాక అన్నమాచార్యులు, అ.సం. 4-285)

అన్నమయ్య నరసింహావతారాన్ని విస్తృతంగా కొనియాడగ గోదాదేవి క్లుప్తంగా, ఉదాత్తంగా కొనియాడింది. హిరణ్యకశిపుని వధను చక్కగా చిత్రించింది.

"ఊన్ కొండ వళ్లు గిల్ ఇరణియనై ఉడల్ ఇడన్ దాన్"

(నాచ్చియార్ తిరుమొళీ 8-5)

పదునైన బలిష్టమైన గోళ్ళతో హిరణ్యకశిపుని శరీరాన్ని చీల్చినవాడు

అన్నమయ్య వామన అవతారాన్ని ఎన్నో కీర్తనల్లో కీర్తించాడు. వామనుడుగా బలి దగ్గరకు వెళ్ళి అతని మదము అణిగేవిధంగా త్రివిక్రమాకృతితో దీపించిన విషయాన్ని సముచితంగా కొనియాడాడు.

"అరుదుగ బలిమద మడపగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొక చరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముడీతడేపో పతి వేంకట విభుడు"

ఆండాళ్ 16 పాశురాల్లో వామనుని ఔన్నత్యాన్ని శ్లాఘించింది. వామనుడు సముచిత వేషంతో బలి యజ్ఞ వాటికకు వెళ్ళి దానం పరిగ్రహించి భూమ్యాకాశాన్ని ఆక్రమించిన విషయాన్ని ఒక పద్యంలోనే ఇమడ్చగలిగిన గోదాదేవి నేర్పు ఎంతైనా కొనియాడదగి ఉంది.

కొండకోల క్కురు ఉర వాయ్చ్చెంద్రు పండు మా వలితన్
అండముం నిలనుమ్ అడి ఒంపెరువేళ్ వియిల్నాల్ కొండవన్
(నాచ్చియార్ తిరుమొళి 4-9)

పూర్వం సముచిత వేషంతో వామనమూర్తిగా బలి చక్రవర్తి యజ్ఞానికి వెళ్ళి ఒక పాదంతో భూమ్యాకాశాలను కొలిచినవాడు.

అన్నమయ్య రాముణ్ణి అనేక కీర్తనల్లో అభినుతించాడు. పరశురామ గర్వభంగం, శూర్పణఖ అవయవ ఛేదనం మినహా రామాయణ సంఘటనలన్నీ చోటు చేసుకొన్న ఈ అన్నమయ్య కీర్తన రామావతారానికెత్తిన నిలువెత్తు నీరాజనం.

చెప్పితే నాశ్చర్యము సేసిన చేత లితడు
ముప్పిరి మనుజ వేషమున బుట్టె నీతడు
రాముడుదయించె దశరథునికి దమ్ములతో
గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞముగాచె హరునివిల్లు విరిచె
ప్రేమమున సీతాదేవి బెండ్లియాడెను ॥చెప్పితే॥

మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవుని బెంచె
జడధి బంధించెను సరుగ రావణు గొట్టె
బడినే విభీషణుని బట్టము గట్టెను ॥చెప్పితే॥

సీతాదేవితో నయోధ్య సింహాసనం బెక్కి
పోతరించి కుశలవ పుత్రుల గాంచె
శ్రీ తరుణితో గూడ శ్రీ వేంకటేశుడై నిల్చి
కౌతుకమున జగము కరుణ గాచెను ॥చెప్పితే॥
(తాళ్ళపాక అన్నమాచార్యులు, అ.సం.4-285)

గోదాదేవి 13 పద్యాల్లో కోదండరాముని కొనియాడింది. మాతలి తెచ్చిన రథాన్నధిరోహించి రాముడు రావణునితో యుద్ధం చేసిన విధానం కళ్ళకు కట్టినట్టుగా ఈమె వర్ణించింది.

"మాతలి తేర్ మున్బుకోల్ కొళ్ళమాయన్ రావణన్ మేల్ శరమారి
తాయ్‌తలై యఱ్ఱట్టు వీళత్తొడుత్త తలైవన్" (నాచ్చియార్ తిరుమొళి 5-3)

కఱ్ఱగైకొని మాతలి రథసారథ్యం వహింపగా పూర్వం రావణుని ప్రధానాంగాలైన తలలు తెగిపడేట్లుగా బాణవర్షం కురిపింప దొడగిన ప్రభువు.

శ్రీకృష్ణుడు తన బాల్య చేష్టల చేత, శృంగార (లీలలచేత) క్రీడలచేత మహామహిమాన్వితమైన లీలలచేత అందరినీ ఆకట్టుకున్నాడు. అన్నమయ్య ఆండాళ్ కూడా శ్రీకృష్ణుని వ్యక్తిత్వం చేత బాగా ఆకర్షింపబడ్డారు. అనేక విధాలుగా నందనందనుణ్ణి కొనియాడారు. అన్నమయ్య సంకీర్తనల్లో కృష్ణ సంబంధ సంకీర్తనల సంఖ్య ఎక్కువ. బాలకృష్ణుని చేష్టలను క్రమంగా వివరిస్తూ కృష్ణుని విశిష్టతను, మహిమను అన్నమయ్య కొనియాడిన తీరు అతి రమణీయం.

"ఎంతకత నడిపితివేమి జోలి బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా

కౌరవుల బాండవుల కలహము వెట్టనేల
నేరచి సారథ్యము నెఱపనేలా.....
కోరి భూభారమణచే కొరకైతే నీచే చక్ర

మూరకే వేసితే దుష్టులొక్క మాటే తెగరా" (2-315)

గోదాదేవి గోపీవల్లభుణ్ణి మనసులో నిలుపుకొని 75 పాశురాలు చెప్పింది. రుక్మిణిని పెళ్ళి చేసుకొనేందుకు సిద్ధంగా వచ్చిన శిశుపాలుడు తేజం కోల్పోయేటట్లు చేసిన కృష్ణుని పరాక్రమాన్ని ఈమె కొనియాడింది.

"కణ్ణాళం కొడిత్తు కన్నితన్నై క్కైప్పిడిప్పాన్
తిణ్ణార్నిరున్ద శిశుపాలన్ తేశళిన్దు
అన్దారిన్దు ఇరుక్క వేయాంగువళై క్కైపిడిత్త పెణ్ణాళన్" (11-9)

కన్యా పాణిగ్రహణానికి సిద్ధంగా ఉన్న శిశుపాలుడు నిస్తేజుడై పైకి చూస్తూ నిలబడిపోగా రుక్మిణీదేవిని చేపట్టిన నారీ మనోహరుడు.

స్త్రీలకు పరాక్రమం చూపే వాళ్ళంటే భలే ఇష్టం. అందువల్లనేమో ఆండాళ్‌తల్లి కృష్ణుని పరాక్రమాన్ని గుర్తు చేసుకున్నట్టుంది.

అన్నమయ్య దశావతారాలన్నిటినీ కొనియాడాడు. ఆయా అవతారాల విశిష్టతను ఆవిష్కరించాడు. ఆండాళ్ దశావతారాల్లో ఏడు అవతారాలను మాత్రమే ప్రస్తావించింది. ఆయా అవతారాల ఘనతను అభినుతించింది. మత్స్య, పరశురామ, బుద్ధ, కల్కి అవతారాలను మాత్రమెందుకో ఆమె ప్రస్తావించలేదు. విష్ణుదేవుని స్థితిపంచకంలోని అంతర్యామి, అర్చ వీరి ఉభయులకు స్తుతి పాత్రాలు అయ్యాయి. మధురభక్తిలోని అనేక అంశాలను నవవిధ భక్తులతో పాటు అధ్యాత్మ తత్వానికి సంబంధించిన చాలా విషయాలను వీరుభయులూ ప్రస్తావించారు.

అన్నమయ్య, ఆండాళ్ ఇద్దరూ విష్ణు భక్తులే. శ్రీ వేంకటేశ్వరానుగ్రహ పాత్రులే. జీవితాల్లోని కొన్ని అంశాల్లోను రచనల్లోని ఎన్నో అంశాల్లోను వీరుభయుల మధ్య సామ్యాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఒకటి, రెండు వైషమ్యాలు ఉన్నప్పటికీ మౌళికతలో మాత్రం అన్నమయ్యకు ఆండాళ్‌కు సామ్యాలు కనిపించడమే కాక బొమ్మ బొరుసులుగా వారిద్దరిని పాఠకులకు స్ఫురింపచేస్తాయి.

**ఆధార గ్రంథాలు**


1. అన్నమయ్య ఆళ్వారులు తులనాత్మక పరిశీలన - డా॥ జె. మునిరత్నం
2. అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటం 1,2,3,4)- తాళ్ళపాక అన్నమాచార్యులు
3. నాలాయిర దివ్య ప్రబంధం - మైలై మాధవ దాసన్ (సంపాదకుడు)
   మణలి లక్ష్మణ మొదలియార్
   స్పెసిఫిక్ ఎండోమెంట్ ప్రచురణ, 1962

# అన్నమయ్య - నమ్మాళ్వార్

వైష్ణవం వర్ధిల్లి విస్తరిల్లడానికి బాగా పరిశ్రమించిన వైష్ణవశక్తి ఆళ్వార్లు. అన్నమయ్య కూడా వీరి కోవకు చెందినవాడే. అటు వైష్ణవానికి, ఇటు హైందవ సంస్కృతికి వీరు చేసిన సేవ అపారం. భక్తి జ్ఞానాలను లోకులలో పెంపొందించి అలౌకిక ఆనందానుభూతిని అందించిన ఘనత వీరిది.

ఆళ్వార్లలో అగ్రగణ్యుడు నమ్మాళ్వారు ఆళ్వార్లతో అంతం కావలసిన నాలాయిర దివ్య ప్రబంధాన్ని ఆచార్య పరంపరకందించి దాని ఉనికికి, వ్యాప్తికి దోహదం చేసినవాడు. అందువల్లనే ఆళ్వార్లకు, ఆచార్యులకు కేంద్రప్రాయుడుగా నమ్మాళ్వారును వ్యవహరిస్తారు. ఆళ్వార్లలో నమ్మాళ్వారుకు విశిష్టస్థానమిచ్చి గౌరవించడం వైష్ణవులలో ఈనాటికీ కనిపిస్తుంది.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య. తేటతెనుగు మాటలతో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా అసంఖ్యాక సంకీర్తనలు రచించి అభినుతి కెక్కాడు. వైష్ణవాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చాడు. విష్ణుభక్తిని విస్తరింప జేయడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. ఆళ్వార్ల తర్వాత అంతటిస్థాన మీయదగినవాడుగా, తెలుగు వైష్ణవుల ఆరాధనకు, ఆదరణకు పాత్రుడయ్యాడు. వైష్ణవులలో పేరెన్నికగన్న నమ్మాళ్వారును అన్నమయ్యను తులనాత్మకంగా అధ్యయనం చేయడం ఒకరకంగా వైష్ణవాన్ని అధ్యయనం చేయడమే అని చెప్పవచ్చు.

అన్నమయ్య, నమ్మాళ్వార్ల వ్యక్తిత్వాలు మహోన్నతాలు, వారి రచనలు సముద్ర ప్రాయాలు. అందువల్ల వారిద్దరిని తులనాత్మకంగా కూలంకషంగా అధ్యయనం చేయడం సాధ్యపడదు. కాబట్టి రేఖామాత్రంగానే ఈ అధ్యయనాన్ని సాగించవలసి ఉంది.

అన్నమయ్య, నమ్మాళ్వారు వైశాఖమాసం విశాఖ నక్షత్రంలోనే జన్మించారు. విష్ణువు పంపగా విష్వక్సేనుడు వచ్చి నమ్మాళ్వారుకు పరతత్త్వాన్ని రహస్యంగా బోధించి వెళ్ళినట్లు ఐతిహ్యం. విష్ణుదేవుని ప్రేరణవల్లనే తిరుమలలో ఘన విష్ణువనే యతి అన్నమయ్యకు పంచ సంస్కారాలు చేసి వైష్ణవతత్త్వాన్ని బోధించాడని ప్రతీతి. 16వ ఏటనే వీళ్ళిద్దరికి విష్ణుసాక్షాత్కారం సిద్ధించింది. భగవత్సాక్షాత్కారా నంతరమే

నమ్మాళ్వార్ తమిళ చంధస్సృష్టికి ఉపక్రమించాడు. అలాగే అన్నమయ్య కూడా తన సంకీర్తన యజ్ఞాన్ని ప్రారంభించాడు. నమ్మాళ్వార్ తాను నాయికగా భగవంతుణ్ణి నాయకుడుగాను భావించి మధురభక్తి సంభరితమైన రచనలనేకం చేశాడు. అన్నమయ్య కూడా తనను నాయికగా భావించుకుని వేంకటేశ్వరుణ్ణి నాయకుడుగా భావించి ఎన్నో కీర్తనలు రచించాడు. వివిధ వైష్ణవ క్షేత్రాల్లోని విష్ణుదేవుని అర్చామూర్తులమీద నమ్మాళ్వార్ ఎన్నో పాశురాలు రచించాడు. అన్నమయ్య కూడా వివిధ ప్రదేశాల్లో వెలసిన అర్చామూర్తులను వేంకటేశ్వరుని పరంగా కీర్తించాడు.

వైకుంఠంలోని విష్ణుదేవుని వైభవాన్ని అంటే వైష్ణవులు కొనియాడే పరతత్త్వాన్ని అన్నమయ్య నమ్మాళ్వారులిద్దరు కూడా కీర్తించారు. వ్యూహ పేరుతో విలసిల్లిన క్షీరాబ్ధిశాయిని కూడా ఇద్దరూ వినుతించారు. విభవగా వ్యవహరింపబడే విష్ణుదేవుని దశావతారాలను ప్రశంసించారు. అంతర్యామిత్వాన్ని అభినందించారు. 'అర్చ'ను అర్చనాపూర్వకంగా ఆదరించారు. విష్ణుదేవుని సర్వమయత్వాన్ని, సర్వనియంతృత్వాన్ని ఇద్దరూ గుర్తించారు. స్వామి సహేతుక, నిర్హేతుక కారుణ్యాలు రెండింటిని స్వయంగా చవి చూడడమేకాక వాటికి పాత్రమైన వారిని కూడా ప్రశంసాపూర్వకంగా పేర్కొన్నారు. విష్ణుదేవుని దివ్యమంగళ విగ్రహాన్ని ఇద్దరూ భావించారు, కీర్తించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన దేవదేవుడే అందరికీ అన్నిటికీ రక్షణ అనే అంశాన్ని ఉభయులూ హృదయ పూర్వకంగా విశ్వసించారు.

మధురభక్తి క్రమపరిణామంలోని వివిధ విభాగాలలోను అన్నమయ్య, నమ్మాళ్వార్ రచనలు చేశారు. నమ్మాళ్వార్ నాయికా మోహం వ్యక్తమయ్యేలా ఒక చక్కని పాశురం చెప్పాడు. భగవంతునిపై (నాయకునిపై) మరులుగొన్న నాయిక అతనిని సమీపించి తన వ్యామోహం తీరేట్లు అతని నుండి ఒక సందేశాన్ని తీసుకురమ్మని లోకులను ప్రాధేయపడినట్లు ఈ ఆళ్వార్ చిత్రించాడు. అన్నమయ్య రచనల్లో గూడా నాయిక మోహం చోటు చేసుకుంది. ఒక నాయిక భగవంతుడయిన తన నాయకునితో ఏయే విధంగా క్రీడించాలని ఆశపడ్డదో తెలుపుతూ ఆ శుభముహూర్తం ఎప్పుడు వస్తుందని స్వామిని ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్న వెనుక దాగిఉన్న ఆశామోహాలు గమనింపదగ్గవి. ఒక నాయిక విరహావస్థను వర్ణించేందుకు ఉపక్రమించిన నమ్మాళ్వార్ దాన్ని ఆమె చేతనే చెప్పించడం విశేషం. ఒక నాయిక విరహతాపాన్ని అన్నమయ్య వర్ణించిన తీరు అద్భుతం. నాయిక నాయకుని దగ్గరకు

హంస దౌత్యము పంపడాన్ని నమ్మాళ్వార్ అన్నమయ్య ఇద్దరూ ప్రస్తావించారు. అన్నమయ్య, నమ్మాళ్వార్‌లిద్దరు కూడా నాయికల ప్రణయకోపాన్ని వర్ణించారు. నాయికల ప్రణయకోపానికి నాయకుల అన్యాంగనాసక్తే కారణమని ఇద్దరూ సూచించారు. నమ్మాళ్వార్ పాశురాల్లో సఖీవచనం చోటు చేసుకుంది. నాయిక విరహావస్థకు కారణం తెలియక కలవరపాటుతో ఎవరేది చెప్పినా చెయ్యడానికి సిద్ధమయ్యే నాయికల తల్లులకు కర్తవ్యాన్ని బోధించిన వైనం ఈయన రచనల్లో కనిపిస్తుంది. అన్నమయ్య రచనల్లో కనిపించే సఖీవచనం నమ్మాళ్వార్ రచనకంటే భిన్నంగా ఉంది. అన్నమయ్య నాయిక సఖి దూతికగా స్వామిని సందర్శించి చెలి చేరువకు రమ్మని ప్రాధేయ పడుతుంది. వీరుభయుల రచనలలోను నాయిక వచనం చోటు చేసుకుంది.

భాగవతంలో ప్రహ్లాదుడు ప్రతిపాదించిన నవవిధ భక్తుల్లో కీర్తన, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, ఆత్మనివేదనాభక్తుల్ని నమ్మాళ్వార్, అన్నమయ్య ఇద్దరూ కూడా ఆదరపూర్వకంగా పేర్కొన్నారు. వైరాగ్యాన్ని ప్రబోధించి, విశ్వవైముఖ్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. భగవదున్ముఖత బాగా పాదుకొనేందుకు దోహదం చేశారు.

అనవరతమూ స్వామిని ఎడబాయక ఆయన వక్షంలో నివసించే అలిమేలు మంగను అన్నమయ్య, నమ్మాళ్వార్ స్మరించారు. ఆమెపట్ల తమకు గల భక్తి ప్రపత్తులు ప్రకటించుకున్నారు. వేంకటేశ్వరస్వామిని భక్తితో కొనియాడారు. అణకువను ప్రదర్శించి, తద్వారా దానిని అవలంబించవలసిన ఆవశ్యకతను బోధపరిచారు. భగవంతుణ్ణి శరణుపొందడం ప్రతివారి కర్తవ్యం అని ప్రబోధించారు. విష్ణుదేవుని వటపత్ర శయనవృత్తాంతాన్ని ప్రస్తావిస్తూ విష్ణు మహిమకు ఆశ్చర్యపడ్డారు. మహావిష్ణు నామమహిమను గుర్తించి నామ సంకీర్తనను ప్రోత్సాహించారు. లోకులనుద్దేశించి నీతి ప్రబోధం చేశారు. నారాయణుడే సర్వస్వమని నమ్మిన నమ్మాళ్వార్, అన్నమయ్య తమకు గల నారాయణేతర విముఖతను తీవ్ర స్వరంలో తెలియజేశారు.

అన్నమయ్య, నమ్మాళ్వార్లకు సంబంధించి స్థాలీపులాకంగా తులనాత్మకంగా సాగిన అధ్యయనం వల్ల వారుభయులుకూడా అనేక సామ్యాలు కలిగి ఉన్నట్టు వెల్లడవుతుంది. వారి భావాల్లోనూ ఏకత్వం గోచరిస్తుంది. కొంత లోతుగా ఆలోచిస్తే ఒకే వ్యక్తియొక్క భిన్నకాలాల అభివ్యక్తులుగా అన్నమయ్య, నమ్మాళ్వార్ స్ఫురిస్తారు.

# రామదాసు - అన్నమయ్య

నదులు నాగరికతకు పుట్టిళ్ళు. భక్తికి పట్టుగొమ్మలు. జీవనదులు జీవనాదాలు. అందుకే భారతీయులు వాటికి మాతృత్వాన్ని ఆపాదించి మన్నిస్తారు. పూజ్యభావం ప్రదర్శించి పునీతులయ్యాం అనుకుంటారు. ఈ నదుల తీరాలలో ఎన్నో దివ్యక్షేత్రాలు వెలశాయి. మానవులను దివ్యులుగా మార్చే మహత్తర కార్యానికి పూనుకున్నాయి.

అటువంటి పావన నదులలో పేర్కోదగ్గవి గోదావరి, సువర్ణముఖి. గోదావరి గౌతమ మహర్షి తపః ఫలంగా లోకోపకారార్థం ఆవిర్భవించింది. సువర్ణముఖి అగస్త్యమహర్షి తపః పర్యవసానంగా భక్తజనోపకారార్థం ప్రాదుర్భవించింది. ఈ రెండు నదుల తీర ప్రదేశాల్లోనూ శైవక్షేత్రాలు, వైష్ణవక్షేత్రాలు వెలసి భక్తివాహినికి పట్టుగొమ్మలయ్యాయి. గోదావరీ తీరంలో వెలసిన భద్రాచలం రామభద్రుని నివాసం. స్వర్ణముఖితీరంలో వెలసిన వేంకటాచలం వేంకటేశ్వర నివాసం. భద్రాచల రాముడ్ని భక్తితో సేవించి గోపన్న రామదాసుగా చరితార్థుడయ్యాడు. అలాగే వేంకటాద్రి వేంకటేశ్వరుని వేనోళ్ళ కొనియాడిన అన్నమయ్య అన్నమాచార్యుడుగా అనుపమ విఖ్యాతినార్జించాడు. ఈ ఇద్దరు వాగ్గేయకారులను గురించి తులనాత్మకంగా ఆలోచించడం ఆనంద దాయకం. జాగ్రత్తగా పరిశీలిస్తే వీరి జీవిత విధానంలోనూ, ఆలోచనా విధానంలోనూ కొన్ని పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

రామదాసు, అన్నమయ్య ఇద్దరూ విష్ణు భక్తులే. వీరిద్దరూ కూడా ఋగ్వేదశాఖకు చెందిన బ్రాహ్మణులే. తండ్రి సుశిక్షణలో పెరిగిన రామదాసు తండ్రివల్ల రాముని గొప్పతనం వినిఉండవచ్చు. పైగా బాలరామాయణం చదివే అవకాశం బాల్యంలోనే అతనికి కలిగింది. రామాయణ పఠన ప్రభావం రామభక్తిగా అతని మనసంతా ఆక్రమించింది. అన్నమయ్య తండ్రి నారాయణసూరి వేంకటేశ్వర భక్తుడు. అన్నమయ్య పుట్టక పూర్వమే అన్నమయ్య తల్లిదండ్రులిద్దరూ తిరుమలకు వెళ్ళి వేంకటేశ్వరుని సేవించారు. అతని అనుగ్రహం పొందారు. అన్నమయ్యతల్లి లక్కమాంబ అతని శైశవంలోనే

వేంకటేశ్వరుని పేర జోలపాటలు పాడి వినిపించింది. ఈ అంశాలను బట్టి అన్నమయ్య కుటుంబంలో వేంకటేశ్వర భక్తి వెల్లివిరిసిందని చెప్పవచ్చు. ఈవిధంగా రామదాసుకు, అన్నమయ్యకు విష్ణుభక్తి ఏర్పడటానికి వారి కుటుంబ వాతావరణం దోహదం చేసింది.

కంచెర్ల గోపన్న రఘునాథ భట్టాచార్యులవారి దగ్గర మంత్రోపదేశం, వైష్ణవదీక్ష పొందాడు. కబీరు దగ్గర రామ మంత్రోపదేశం పొందినట్టు కూడా ప్రతీతి. అన్నమయ్య ఘన విష్ణువు దగ్గర మంత్రోపదేశం, విష్ణుతత్వోపదేశం పొందాడు. ఆదివన్ శఠగోపయతి దగ్గర వైష్ణవాగమాలన్నీ అభ్యసించాడు. వీరిద్దరికీ గురువులిద్దరూ ఉండడం గమనార్హం.

రామదాసు కమలాంబను వివాహమాడి కమనీయ వైవాహిక జీవితం గడిపాడు. అలాగే అన్నమయ్య కూడా తిమ్మక్క, అక్కలమ్మలను పరిణయమాడి పరిమళభరిత రసజీవితాన్ని గడిపాడు. వీరిద్దరూ గృహస్థులే. గార్హస్థ్య జీవితం భాగవత జీవితానికి ఏమాత్రం అడ్డుకాబోదని చక్కగా నిరూపించినవారే.

రామదాసు అన్నమయ్యల జీవితాల్లో కొన్ని మహిమలు వెల్లడికావడం గమనార్హం. రామదాసు గంజిగుంటలోపడి మరణించిన తన కుమారుడ్ని దైవప్రార్థనతో బ్రతికించుకున్నాడు. రామలక్ష్మణులు మారువేషంలో వచ్చి తానీషాకు డబ్బు చెల్లించి రామదాసుని విడిపించడం అతని భక్తి మహిమయే. సాళువ నరసింగరాయలు బంధించినప్పుడు సంకెళ్ళు త్రెంచుకోవడం, విగ్రహాలు కనిపించక పోయినప్పుడు "ఇందిరా రమణు తెచ్చిఇయ్యరో" అని కీర్తన పాడి తెప్పించుకోవడం, భగవంతునికి నైవేద్యంగా సమర్పించే జీడిమామిడి పండ్లను తియ్యమామిడిపండ్లుగా చేయడం, పేద బ్రాహ్మణునికి ధనం ఇప్పించడం వంటివి అన్నమయ్య ప్రదర్శించిన కొన్ని మహిమలు.

రామదాసు, అన్నమయ్య సంకీర్తనలతో బాటు శతకాలు కూడా రచించారు. రామదాసు "దాశరథీ శతకం" రచించాడు. అన్నమయ్య అలిమేలు మంగనుద్దేశించి "వేంకటేశ్వర శతకం" రచించాడు. "వేంకట శతకం" వంటి ఇతర శతకాలను కూడా రచించినట్టు ప్రతీతి. అయితే ఇప్పుడు అవి అలభ్యం. ఇద్దరు వాగ్గేయకారులూ కీర్తనలు రచించి భగవత్కీర్తిని గానం చేశారు. ఆర్తిని ఆవిష్కరించారు. భక్తిని ప్రదర్శించారు. నీతి వైరాగ్య ప్రబోధం చేశారు.

మనసును ఉద్బోధించడం తద్వారా లోకాన్ని ఉద్బోధించడం వాగ్గేయకారులకు పరిపాటి. రాముణ్ణి, రామ మంత్రాన్ని మరువకూడదని, ఇతర మార్గాలకు వెళ్ళకూడదని రామదాసు తన మనసును కోరాడు. ఇదే ఆయన ప్రజలకు చేసిన విజ్ఞప్తి అనిపిస్తుంది.

"మానసమా! నీవు మరువకు మీ పెన్ని
ధానము రామమంత్రాను సంధానము
సారంపు గురుభక్తి మీరకుమీ సం
సార ఘోరాటవిలో దూరకుమీ దరి
జేరని కోర్కెల కోరకుమీ అయి
దారింటి వెనువెంట బారకుమీ భ్రష్ట" (రామదాసు కీర్తనలు - 122)

అన్నమయ్య తన మనసును అనేక విధాలుగా ఉద్బోధించాడు. శరీర అల్పత్వాన్ని, అశాశ్వతత్వాన్ని ఆవిష్కరించాడు. భగవంతుని ఘనతను, అతడు ప్రాణుల పట్ల ప్రదర్శించే ఆత్మీయతను తెలియజేశాడు.

"మాయల బొరలగ నేటికి మనసా కలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతుడీతనిఁ దలచవుగా ॥
మన్ననఁబుట్టిన కాయము మన్నున నణగేటిదింతే
మిన్నుల మీదికిఁ బోవదుఁ మెరయుచు నెంతైనా
అన్నిట నీజీవునికిని అంతర్యామీ దేవుడు
యెన్నడుఁ బాయని బంధువుడీతని దలచవుగా ॥"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 3-404)

వాగ్గేయకారులు మనసునుద్దేశించి ప్రబోధించడమేకాక లోకులనుద్దేశించి కూడ నీతిని ప్రబోధించారు. రామదాసు తన కీర్తనలలో రామభక్తినేకాక నీతిని కూడ ఆవిష్కరించాడు. చేయవలసిన వాటిని సూచించాడు చేయకూడని వాటిని నిరసించాడు.

"రామరామయని నోట రవ్వంత సేపైన
నీమము తప్పక మంచినీతితో పల్కనివా
డున్మత్తుడు మూఢ చిత్తుడు

దేహమశాశ్వతమని తెలియక దుర్బుద్ధి చేత
సాహసమున సాధుజనుల సంకటబెట్టెడివాడు
పాతకి బ్రహ్మఘాతకి........" (రామదాసు కీర్తనలు - 115)

అన్నమయ్య కీర్తనలలో నీతి ఉంది. లోకరీతి ఉంది. దైవానుభూతి ఉంది. ఏది దేనికొరకో విశదం చేసే అన్నమయ్య పాట అందరికీ గమనార్హమే.

"తలచిన విన్నియు దనకొరకే వెలి
దెలియుట దనలో దెలియుట కొరకే
చదువుట మేలు విచారించు కొరకే
బ్రదుకుట పురుషార్థ పరుడౌట కొరకే"
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-70)

ప్రపంచ వస్తువులపట్ల వైముఖ్యాన్ని కలిగివుండటమే వైరాగ్యము. వాగ్గేయకారులు వైరాగ్యాన్ని కూడా బోధించి ప్రజల ప్రమత్తతను పోగొట్టే ప్రయత్నం చేశారు. మోహాన్ని నిర్మూలించాలని, ఈషణత్రయాన్ని పోగొట్టుకోవాలని రామదాసు సూచించాడు. సతీసుత మమకారాలను తాను రోసినట్లు చెపుతూ తక్కినవాళ్ళను కూడ అలాగే చెయ్యమని పరోక్షంగా హితవు చెప్పాడు.

"మోహపాశములనెల్ల మొదటనే ద్రుంచి
ఈషణ త్రయములెల్ల ఇలలోనేడించి సం
తోష సాగరంబునందే సంచరించుచును" (రామదాసు కీర్తనలు - 39)

"సతి సుతులపై ప్రేమరోసితి సం
తతము మీపై భారము వేసితి" (రామదాసు కీర్తనలు - 123)

వైరాగ్యాన్ని గూర్చి అన్నమయ్య ఇలా అభిప్రాయ పడ్డాడు. సిరులు, తరుణులు అశాశ్వతాలు వీటివల్ల ప్రయోజనము లేదు. చదువు సంశయ రాహిత్యానికి బదులు సంశయోత్పాదనకే దోహదం చేస్తుంది. కాబట్టి వీటిపట్ల అనాసక్తుడై వేంకటేశ్వరుని ఆశ్రయిస్తే భవము గలుగని స్థితి సంభవిస్తుందంటాడు.

"ఎందుజూచిన దనకు నిన్నియును నిట్లనే
కందులేని సుఖము కలనైన లేదు

సిరులు గలిగిన ఫలము చింత బొరలనె కాని
సొరిది సంతోష మించుకయైన లేదు
తరుణిగల ఫలము వేదనల బొరలుటె కాని
నెరసు లేని సుఖము నిమిషంబు లేదు"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.1-340)

రాజాశ్రయాన్ని వాగ్గేయకారులు నిరసించారు. తాము ఆరాధించే దేవతలే సర్వాధికులని సర్వదా ఆరాధనీయులని ప్రగాఢంగా విశ్వసించారు. రామదాసు భద్రాద్రి రాముని తప్ప పరులను ఆశ్రయించడం భావ్యం కాదని భావించాడు.

"అన్న వస్త్రము లిత్తుమనుచు దొర
లన్నారు మనిచెదమనుచు ఆయు
రన్నం ప్రయచ్ఛతి యనుచు నూర
కున్నాను నీవే మాకున్నావనుచు
.................................
.................................
దరిజేర్చుదని వేడితిని మీది
శరణాగత త్రాణ బిరుదు గనుక
పరుల గొలుచుట కన్న ఇల భద్ర
గిరి రాఘవుల వేడుకొనుట ఇహ
పరములకు దారియని వింటినే
దరహాసముఖ రామదాస పోష" (రామదాసు కీర్తనలు - 31)

వేంకటేశ్వరుని తప్ప అల్పులైన ఇతరులను కొల్చి జీవించడం హేయమనే భావం అన్నమయ్య కీర్తనలో ధ్వనిస్తుంది.

"బలిమి శ్రీ వేంకటపతి గొలిచినవారు
తెలియ కల్పుల గొల్చి తిరుగుటెట్లు"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-456)

తనను తాను విమర్శించుకొని తగినవిధంగా సంస్కరించుకోవడమే ఆత్మవిమర్శ. భక్తులలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వాగ్గేయకారులలోను చోటు

చేసుకొంది. వారి రచనల్లో ప్రతిబింబించి పాఠకుల దృష్టిని ఆకర్షించింది. రామదాసు తన దుస్థితిని గుర్తించి దురపిల్లాడు. మనసు పరభామాయత్తం కావడం, మనుగడకోసం అన్యులను ఆశ్రయించడం అతనికెంతో బాధ కలిగించాయి. అతని బాధ కీర్తనలో ప్రతిధ్వనించింది.

"వదలక యౌవనమున పరభామల
వలల తగులనాయెగా ఓ రామా!
ముదిమిని సంసారాంధ కూపములో జిక్కి
మునిగి తేలనాయెగా ఓరామా!

తనువస్థిరంబని తారక నామము
తలపోయలేనైతిగా ఓరామా!
దిన దినము పొట్ట కొరకై దీనుల వేడి వేడి
దీనత్వ మొందితిగా ఓరామా!

అనుదినమును గురు ఉపదేశ యోగము
అభ్యసించనైతిగా ఓరామా!
ఎనసి నిముషమైన మీ పాదములపైని
మనసు నిల్పనైతిగా ఓరామా!" (రామదాసు కీర్తనలు - 106)

అన్నమయ్య కూడ ఆత్మవిమర్శ చేసుకొన్నాడు. తన తప్పిదాన్ని గుర్తించాడు తరుణం దాటిపోయింది కదాయని తపించాడు. ఆ తపనను ఆవిష్కరించే పదం యిదిగో మీ దృష్టి పదంలో

"సంతలే చొచ్చితిగాని సరకు గాననైతి
యింతటి శ్రీహరి నీవే యిటు దయజూడవే ॥

కాంత చను గొండలు కడకు నెక్కితిగాని
యెంతైనా మోక్షపుమెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనే అడవి చొచ్చితిగాని
సంతత హరిభక్తనే సంజీవి గాననైతి ॥

తెగి సంసార జలధి దిరుగులాడితి గాని
అగడై వైరాగ్యరత్నమది దేనైతి
పొగరు జన్మాల రణభూములు చొచ్చితిగాని
పగటుఁ గామాదుల పగ సాధించనైతి ॥

తనువని యెడి కల్పతరువు యెక్కితిగాని
కొన విజ్ఞాన ఫలము గోయలేనైతి
....................................
.................................... ॥"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-27)

కాలం విలువ కట్టరానిది. గడచిన క్షణం తిరిగిరాదు కాబట్టి కాలం యొక్క అమూల్యతను గుర్తించి మహనీయులు మసలు కొన్నారు. ఇతరులు కూడ అలాగే మసలుకోవాలని ఆశించారు. రామదాసు తన కాలమంతా పాడైపోయినందుకు బాధపడ్డాడు. బాల్య యౌవన వృద్ధాప్యాలు తనకు ఉపయోగపడలేదని తన నిస్సహాయతను స్వామికి నివేదించాడు.

"....................................
మొదట నెరుగని తనమున సగమాయువు
నిదురపాలై పోయెగా ఓ రామా!
పదపడి తక్కిన పదేండ్లు బాల్యత్వమునను
పోయెగా ఓ రామా! ॥

వదలక యౌవనమున పరభామల
వలల తగుల నాయెగా ఓరామా!
ముదిమిని సంసారాంధ కూపములో జిక్కి
మునిగి తేలనాయెగా ఓరామా! ॥

....................................
ఎనసి నిముషమైన మీ పాదములపైని
మనసు నిల్పగనైతిగా ఓరామా!" (రామదాసు కీర్తనలు - 106)

అన్నమయ్య కూడ కాలం విలువ ముందే తెలుసుకోలేక పోయాడు. తెలుసుకొన్న తర్వాత "నాకెక్కడి జ్ఞానం? నాకెక్కడి తెలివి? కాలమంతా దైవాన్ని తెలుసుకోకనే గడచిపోయింది" అని వాపోయాడు.

ఏడ సుజ్ఞానమేడ తెలివి నాకు
బూడిదలో హోమమై పోయఁ గాలము ॥

ఇదె మేలయ్యెడి నాకదే మేలయ్యెడినని
కదిసిన యాసచేఁ గడవలేక
యెదురు చూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటు మృగమై పోయఁ గాలము

..................................

..................................

యిక్కడ సుఖము నాకక్కడ సుఖంబని
యెక్కడికైనా నూరకేగి యేగి
గక్కన శ్రీ తిరు వేంకటపతి గానక
పుక్కిటి పురాణములై పోయఁగాలము ॥"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-48)

భగవద్భక్తులు భగవన్నామానికెంతో ప్రాధాన్యమిస్తారు. నామోచ్చారణ మాత్రం చేతనే నరకాదులు నశిస్తాయని సద్గతులు సంప్రాప్తిస్తాయని విశ్వాసం. వైష్ణవులు విష్ణు నామంతోబాటు విష్ణు నామ మహిమను కూడా వేనోళ్ళ కొనియాడుతారు. వాగ్గేయకారుల రచనల్లో నామ విశిష్టతను కీర్తించే కీర్తనలనేకం కనిపిస్తాయి. రామదాసు రామనామ మహిమను కమ్మగా గానం చేశాడు. దాని రుచిని తలచి తలచి మురిసిపోయాడు.

"ఓరామ! నీనామ మేమి రుచిరా
శ్రీరామ! నానామ మేమి రుచిరా ॥

కరిరాజ ప్రహ్లాద ధరణి విభీషణుల
గాచిన నీ నామమేమి రుచిరా ॥

కదళీ కర్జూరాది ఫలముల కధికమౌ
కమ్మన నీ నామ మేమి రుచిరా ॥

నవరసముల కన్న నవనీతముల కంటె
అధికమౌ నీనామ మేమి రుచిరా ॥

..................................

..................................” (రామదాసు కీర్తనలు - 110)

అన్నమయ్య అనంతసేనుని నామం అనంత ఫలదమని అభిప్రాయ పడ్డాడు. అన్యనామాలు అశక్తాలని వ్యక్తపరచాడు.

హరినామ మొకటనే అణగెఁ బాపములు
వొరసి యన్ని నామము లూరకున్నవి
సిరులిచ్చెఁ గలవెల్లా శ్రీపతి నామమొకటే
పెర నామము లెల్లా పెట్టెలలో నున్నవి ॥

గోవింద నామమొకటే కూడవోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా
శ్రీ విష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావైయున్న నామములు తమకించీ నీవికి ॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-297)

భక్తజన సంస్మరణ భాగవత సంప్రదాయం. వాగ్గేయకారులు కూడా పూర్వభక్తులను స్మరించారు. వారిలాగే తమను కూడా రక్షించుమని భగవంతునితో మొరపెట్టుకున్నారు. గజేంద్రుని, గజగమనను రక్షించిన రామభద్రుడు తనను కూడా రక్షించాలని రామదాసు విష్ణువును ఆర్తితో అర్థించాడు.

“నీట చిక్కి కరి మాటికి వేసరి
నాటకధర ఈ పాటలు బాపగ
మేటి మకరి తలమీటి కాచుదయ
యేటికి నాపై నేటికి రాదో ॥

మున్ను సభను నాపన్నుత వేడుచు
నిన్ను కృష్ణయని ఎన్నగ ద్రౌపది
కెన్నో వలువలిడి మన్నన బ్రోచిన
వెన్నుడ నా మొర వింటివా లేదో ॥" (రామదాసు కీర్తనలు - 60)

అన్నమయ్య పూర్వభక్తులనేకులను స్మరించాడు. వారిని స్వామి కరుణించిన వైనం గుర్తు చేశాడు.

"కుమ్మర దాసుడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ॥

అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక దిరుమల నంబి తోడుత
నిచ్చ నిచ్చ మాటలాడి నచ్చినవాడు

కంచిలోన నుండఁ దిరుకచ్చి నంబిమీద, గరు
ణించి తన యెడకు రప్పించిన వాడు
..........................................
.........................................."

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-151)

భగవంతుడ్ని శరణుజొచ్చి భవవిముక్తులు కావడం భక్తులకు పరిపాటి వాగ్గేయకారుల్లో ఈ శరణాగతి ఎక్కువగా కనిపిస్తుంది. రామదాసు రాముడ్ని శరణుజొచ్చాడు. పాలముంచినా, నీటముంచినా నీ పాల బడితినన్నాడు.

"పాల ముంచినను నీటముంచినను నీ
పాల బడితినిక జాలము చేయకు"

వేంకటేశ్వరుని శరణు వేడమని తన మనసును, జీవుని అన్నమయ్య ఉద్బోధించాడు. తద్వారా లోకుల్ని ఉద్బోధించాడు. తాను స్వయంగా వేంకటేశ్వరుని శరణుజొచ్చి కృతార్థుడయ్యాడు.

"మాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా! ॥

చాలునంటే ఇంచుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్లఁ జాలదు
వీలిన యీ యాసా వెట్టివాని చేతిరాయి
చాలునింక హరినిట్టె శరణను జీవుడా! ॥"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-157)

భగవంతుని కథలను, లీలలను, మహిమలను వినడం పట్ల ఆసక్తి ప్రదర్శించడమే శ్రవణ భక్తి. భక్తులు, వాగ్గేయకారులు దీనిని ఎంతగానో ఆదరించారు. శ్రవణభక్తి ప్రయోజనాలను రామదాసు చెప్పాడు. తద్వారా భగవన్మహిమలను వినవలసిందిగా ప్రోత్సహించాడు.

"కామితార్థములిచ్చు నీ మహత్వము విన్న" (రామదాసు కీర్తనలు-62)

"నీ మహత్త్వమ్ము విన మనమందు ప్రేమ వేమరున్ బుట్టు"

(రామదాసు కీర్తనలు - 62)

ఎప్పుడూ విష్ణుకథలే వింటుండమని అన్నమయ్య తన వీనులను అర్థించాడు. విష్ణు కథను వినడం సౌభాగ్య సంధాయకమని విశ్వసించాడు.

"వీనులాలా యేపొద్దు విష్ణు కథలే వినరో"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 10-14)

"వినరో భాగ్యము విష్ణుకథ"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 9-66)

భగవత్కీర్తిని గానం చేయడం కీర్తనా భక్తిగా పరిగణింపబడుతుంది. రామదాసు రాముని కీర్తిని పాడాడు. ఆర్తితో అతన్ని వేడుకున్నాడు. అందరినీ అలా చేయవలసిందిగా పరోక్షంగా సూచించాడు.

పాడుదును మిమ్ము కొనియాడుదును మోదమున
వేడుచున్నాను కాపాడు రామప్రభో! ॥

శ్రీమన్ మహాగుణస్తోమాభి రామ
నామ కీర్తనది వర్ణింతు రామప్రభో! ॥ (రామదాసు కీర్తనలు - 62)

రామదాసు రాముని కీర్తించగా అన్నమయ్య తత్కీర్తనా విశిష్టతను ఆవిష్కరించాడు. అన్నిటికన్నా ఎక్కువ విష్ణువును కీర్తించడమేనని అభివ్యక్తం చేశాడు.

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం ॥

సంతోషకరమైన సంకీర్తనం
సంతాప మణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలచుడీ సంకీర్తనం ॥"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.స.ం. 1-343)

నిరంతరమూ భగవంతుని మనసారా స్మరించడమే స్మరణభక్తి. తదేకంగా దేవుని ఆకార చేష్టలను స్మరించడమే దీని లక్షణం. భక్తులైన వాగ్గేయకారులు పదే పదే భగవంతుని స్మరించారు. తాపత్రయాలను భరించారు. భవసాగరం తరించారు. రామదాసు స్మరణభక్తిని అవలంబించినట్లు స్వయంగా చెప్పుకొన్నాడు. దానిపట్ల తనకున్న ఆసక్తిని కూడా వెల్లడించాడు.

"శ్రీరామ నామమే వేళ స్మరియింతు
స్వామి దయచేయు సంపాదను రామప్రభో!
శ్రీరామ నీనామ చింతనామృత పాన
సారమే నాదు మదిగోరు రామప్రభో!" (రామదాసు కీర్తనలు-62)

స్మరణభక్తి విశిష్టతను అన్నమయ్య అభివ్యక్తం చేశాడు. స్మరించి తరించవలసిందిగా జనులకు ప్రబోధించాడు.

"కొంచమును ఘనముగను గొననేల హరిదలచు
పంచమహాపాతకుడే బ్రాహ్మణోత్తముడు"
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-329)

దైవ శిఖామణి తలచరో బుధులు(తాళ్ళపాక అన్నమాచార్యులు-అ.సం. 10-216)

భగవంతుని పాదాలు సేవించి తరించడం పారంపర్యంగా వస్తున్న విధానం. ఈ విధానానికి వాగ్గేయకారులు మినహాయింపు కాదు. భగవంతుని పరివరి విధాలుగా కొలిచారు. భగవంతుని పాదాలను సేవించి తరించవలసిందిగా తరుణోపాయం చూపించారు. భగవత్పాదసేవ పాపహరమని రామదాసు భావన. అతడు తన సేవాసక్తిని కూడా వెల్లడి చేశాడు.

"నీ పాద సేవ జేసిన సజ్జనులకు ఏ
పాపములంటవుగా రామ!" (రామదాసు కీర్తనలు - 61)

"చేరి మీ పాద పద్మారాధనము చేయ
కోరినానయ్య శ్రీరామచంద్ర ప్రభో!" (రామదాసు కీర్తనలు - 62)

అన్నమయ్య పాదసేవనా భక్తి విశిష్టతను తెలియజేయడమే గాక తన సేవానిరతిని కూడా వెల్లడించాడు.

"హరిగొలిచిన వారికమరునన్ని సుఖాలు
గరిమతో వారల భాగ్యమే భాగ్యము"
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-119)

"వారుల గొలువము నేమొగి నీ పాదాలే నమ్మి
నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముగాతువు"
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-128)

షోడశోపచారాలతో భగవంతుని పూజించడం భక్తకోటికి పరిపాటి. షోడశోపచార పూజావిధానాన్ని రామదాసు అన్నమయ్య ఆదరించారు. తమ గేయాల్లో దానికి స్థానం కల్పించారు. షోడశోపచారాలతో రాముని అర్చించుమని రామదాసు తన మనసును ఉద్బోధించాడు. తద్వారా షోడశోపచార పూజా విధానాన్ని ఆదరించాడు.

సలలితముగ రఘువరునకు సింహా
సన మియ్యగ రాదా మనసా!
నళిన భవాభవ పరివేష్ఠితు ధ్యా
నము సేయగ రాదా మనసా !

................................

................................ (రామదాసు కీర్తనలు - 65)

అన్నమయ్య అర్చనా వైశిష్ట్యాన్ని అభివ్యక్తం చేశాడు. షోడశోపచార పూజావిధానాన్ని ఆదరించాడు. తాను కూడా స్వామికి షోడశోపచార పూజ సమర్పిస్తున్నట్టుగా ఎలుగెత్తి చాటాడు.

"పొందుగ నచ్యుతు బూజించు పూజలు
కిందట గొన కెక్కెడి నిచ్చెనలు"
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 9-275)

"షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥

.........................................

........................................."
(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-134)

మునులు భగవంతునికి నమస్కరించడం చేతనే ఘనులయ్యారని రామదాసు భావించాడు. రామునికి నమస్కరించి తన వందనాభక్తిని ప్రదర్శించాడు. భగవంతునికి నమస్కరించవలసిందిగా భక్తులను పరోక్షంగా ప్రోత్సహించాడు.

"వందనము చేసి మునులందరు ఘనులైరి
విందవైనట్టి గోవిందరామ ప్రభో!" (రామదాసు కీర్తనలు - 62)

"వందనము రఘునాయకా! ఆనందము శ్రీరఘు నాయకా!"
(రామదాసు కీర్తనలు-67)

వేంకటేశ్వరునికి నమస్కరించడమే విధి అని, అది ఆనంద సందాయకమని అన్నమయ్య భావించాడు.

"ఏపున శ్రీ వేంకటేశుడే సర్వము
దాపై యితని వందనమే విధి"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-488)

"నలుగడ దేహానందము బుధులకు
బలు నీపాద ప్రణామములు"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-369)

భగవంతుడ్ని యజమానిగా భావించి తామతని దాసులుగా భావించుకొని ఆరాధించడం భక్తులకు ఆనవాయితి. దీన్నే దాస్యభక్తి అని పెద్దలు వ్యవహరిస్తారు. రామదాసు, అన్నమయ్య కూడా దేవుని దాసులకు దాసులు కావడమే ధన్యజీవనమని తలపోశారు. రామదాసుగా ప్రసిద్ధికెక్కిన గోపన్న ముమ్మాటికి తాను రామునికి దాసుడని తెలియజేశాడు. తద్వారా దాస్యభక్తిని ఆదరించాడు.

"బాగుగ నన్నేలు భద్రాచల రామ
దాసుడ దాసుడ దాసుడ" (రామదాసు కీర్తనలు - 155)

అన్నమయ్య వేంకటేశ్వర దాసుల దాస్యాన్ని అభిలషించాడు. తద్వారా దాస్యభక్తికి పట్టం కట్టాడు. వేంకటేశ్వరుని దాసుల దాస్యాన్ని అన్నమయ్య కోరాడు. హరిదాసుల ఘనతను కొనియాడాడు.

"కందువ శ్రీవేంకటేశ! కడు నీ బంటు బంటను
సందడి బంటనవుటే చాలదా! నాకు"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-23)

"బంతుల పాత్రా పాత్రము వెదకిన
అంతట హరిదాస్యమే పో ఘనము"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 9-245)

గోదావరీ తీరం రామభక్తిని పండిస్తే, సువర్ణముఖీ తీరం వేంకటేశ్వర భక్తిని విరగ పండించింది. రామదాసు తెలంగాణాకు జ్ఞానదీపమెత్తితే, అన్నమయ్య

సుజ్ఞాన దీపమెత్తి రాయలసీమకంతా దాని కాంతిని పంచాడు. ఇద్దరు వాగ్గేయ కారులూ రాజులవల్ల ఇబ్బందులు పడ్డారు. తమ భక్తిచేత భగవత్కటాక్షం చేత వాటిని అధిగమించారు. తెలుగు జాతికేకాక మానవజాతికంతటికీ భక్తిని పంచి భగవద్జ్ఞానం పెంచారు. ఇద్దరూ తెలుగు తేజోలక్ష్మికి వెలుగు సమకూర్చారు. తెలుగు గుండెల్లో జ్యోతులై నాదరీతులై కలకాలం నిలిచిపోయారు.

ఘనుడు కంచెర్ల గోపన్న వినుత యశుడు
తాళ్ళపాకన్న మాఖ్యుడు ధన్యజీవి
ఈ మహాత్ముల గన్నట్టి భూమితల్లి
ఎంత ధన్య చరితయో తానెంచి చూడ! (స్వీయం)

**సంప్రదించవలసిన పుస్తకాలు**


1. అధ్యాత్మ సంకీర్తనలు : 1,2,8,9,10,11 సంపుటాలు
2. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము : బాలాంత్రపు రజనీకాంతరావు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ విజయవాడ, 1975
3. ఆంధ్రవాగ్గేయకారుల రచనలపై తాళ్ళపాక అన్నమయ్య సాహిత్య ప్రభావము : డా॥ డబ్ల్యు. ఎం. సీతాలక్ష్మి
4. తెలుగులో పదకవిత : డా॥ ఎస్. గంగప్ప ప్రథమ ముద్రణ, ఆగష్టు, 1983
5. రామదాసు కీర్తనలు : సం॥ మంచాళ జగన్నాధరావు ఆంధ్ర ప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ప్రచురణ, నవంబరు, 1975.

# అన్నమయ్య ఆత్మ విమర్శ

ప్రతివారిలోనూ ప్రగతిని సాధించాలన్న ప్రగాఢ వాంఛ ఉంది. ప్రయత్నమూ ఉంది. అయితే అందరూ విజయం సాధించడం లేదు. ప్రాపంచిక పారమార్థిక రంగాలు రెంటిలోనూ ఈ పరిస్థితి సమానంగానే కొనసాగడం గోచరిస్తూ ఉంది. కారణం ఏమిటి? అందరూ ఈ ప్రశ్నవేసుకొని నిర్మాణాత్మకంగా ఆలోచిస్తే తామెందుకు ప్రగతిని సాధించలేక పోతున్నారో తెలిసిపోతుంది. ఆ పైన తమ లోపాలను సరిదిద్దుకొని బంగారు భవిష్యత్తును రూపొందించుకోవచ్చు.

ఇక్కడ నిర్మాణాత్మకమైన ఆలోచన అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు సముచిత సంబంధిత ప్రశ్నలు వేసుకొని సమాధానాలు పొందడమే అని చెప్పుకోవచ్చు. తాము సాధించాల్సింది ఏమిటి? దానికి చేయవలసిందేమిటి? ఇప్పుడు చేస్తున్నదేమిటి? తమ లక్ష్యసాధనకు తాము ఉండవలసిన తీరు ఏమిటి? ఇప్పుడు తామున్న వైనం ఏమిటి? ఉండవలసిన తీరుకు, ఉన్న తీరుకు మధ్య ఉన్న అంతరం ఎంతటిది? ఇలాంటి ప్రశ్నలు వేసుకొని తమలోంచే సమాధానం రాబట్టుకోవాలి. ఇలా తమను గురించి విమర్శించుకోవడాన్నే 'ఆత్మ విమర్శ' అంటారు.

దురదృష్టవశాత్తు నేడు ఆత్మవిమర్శకు ప్రాధాన్యం తగ్గిపోతూ ఉంది. ప్రతివారు తమకంటే మించిన గొప్పవారు లేరనే భ్రాంతిలో ఉన్నారు. ఈ భ్రాంతి వల్ల తాము పొందే నష్టపరిమాణాన్ని గూడా గుర్తించలేని స్థితిలో ఉన్నారు. అందువల్లనే ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఆశించని దుష్ఫలితాలు వస్తూ ఉన్నాయి. ఈ తీరు మారాలంటే ఆత్మవిమర్శను ఆశ్రయించడం తప్ప అన్యథా శరణం లేదు.

మహనీయులుగా మాన్యత పొందిన మన పూర్వులెందరో ఆశించిన ఫలితాలను అవలీలగా సాధించుకొన్నారు. సామాన్య మానవ స్థితి నుంచి మహోన్నత స్థితికి తమను పెంచుకొన్నారు. దీనికంతటికీ కారణం వారంతా తమ స్థితిని ఎప్పటికప్పుడు గుర్తించడమే. తమ లక్ష్యానికనుగుణంగా తమను

మార్చుకొని పురోగమించడమే. ఇలా ఆత్మ విమర్శ చేసుకున్న వారు భక్తి సాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తారు. శైవభక్తులైన నాయన్మార్లు, వైష్ణవ భక్తులైన ఆళ్వార్లు, కన్నడ హరిదాసులు భక్తిసుధను తెలుగునేల నాలుగు చెరగులాపారించి, మధురానుభూతిని పండించిన ఆంధ్ర వాగ్గేయకారులూ ఈ కోవకు చెందినవారే.

తిరుమంగై ఆళ్వార్ తననొక అజ్ఞానిగా, ఇంద్రియ వశవర్తిగా, శునక ప్రాయుడుగా ఆత్మనింద చేసుకున్నాడు. కళల నభ్యసించలేదు. పంచేంద్రియాల ఇచ్ఛానుసారంగా విషయాల మీదికి బుద్ధి పోనిచ్చాను. అందువల్ల అవివేకినైన నేను క్షేమం పొందలేకపోయాను. విశాల విశ్వంలోని ప్రాణులందరికి కీడునే కోరి చరిస్తున్నాను. (పెరియ తిరుమొళి 1-1-8).

నమ్మాళ్వార్ తనని విమర్శించుకొని ఆవేదన వెలిబుచ్చాడు. 'యాచకులకు భిక్షపెట్టి ఎరగను. దాహము తీర్చి ఎరగను. పంచేంద్రియాల్ని జయించలేదు. నియతుణ్ణై కాలోచితంగా పుష్పార్చన చేసి స్తుతించి ఎరగను. మౌర్ఖ్య కాఠిన్యాలతో కూడిన మనసులో, ఆశ ఎక్కువ కాగా అవివేకముతో పాపినైన నేను చక్రపాణిని సందర్శించేందుకు వెదుకుతున్నాను'. (తిరివాయ్‌మొళి 4-7-9).

తొలి తెలుగు వాగ్గేయకారులైన అన్నమయ్య వేంకటేశ్వరునుద్దేశించి చెప్పిన తన కీర్తనలలో తన కీర్తిని గురించి చెప్పుకోలేదు. ఆర్తిని గురించి చెప్పుకొన్నాడు. తన లోపాలను తెలియజేశాడు. తన దుస్థితిని స్వామికి నివేదించాడు. ఇలాంటి దీన, హీనస్థితిలో ఉన్న తనను ఆదుకొని అండ జేర్చుకొమ్మని అర్థించాడు.

ఎన్ని చదువులు చదువుకున్నా, ఎన్ని విషయాలు తెలుసుకున్నా, వాటిని అనుభవంలోకి తెచ్చుకోలేక పోతున్నాం. ఆచరణలో పెట్టలేక పోతున్నాం. తన విషయంలో కూడా ఆ మాటే అంటున్నాడు అన్నమయ్య.

'విడిచితినా పాపము సేయక వేవేలు చదివిన యంతనే' (2-210)

ఉన్నత కులస్థులు ఉత్తమ జ్ఞానులని, నిమ్న కులస్థులు అజ్ఞానులని భావించబడే రోజులవి. తన కులంచేత మాత్రమే తాను తత్త్వ రహస్యం తెలుసు కోలేదని చెబుతూ, కులాలు వట్టి ఆడంబరాలని, అడ్డుగోడలని ధ్వనింపజేశాడు.

'తెలిసితినా తత్త్వ రహస్యం తిరముగ కులజుడనయినంతనే' (2-210)

సుగుణవంతులైన చుట్టాలు ఎందరున్నా వారినుంచి సుగుణాలు గ్రహించడం అటుంచి దుర్గుణాలైనా వదులుకోలేని దుర్బలుడు మానవుడు. ఈ అంశాన్ని అన్నమయ్య తన మీదనే ఆరోపించుకొన్నాడు.

'వదలితినా నా దుర్గుణములు వరుసతో జుట్టాలు గలిగినంతనే'

(2-210)

మనుష్యుల ఆశల్లో ముఖ్యమైనవి మూడు. భూమి మీద ఆశ, భామ మీద ఆశ, ధనాశ. ఇవి మనసునంతా ఆక్రమించి, మరే ఆలోచనకు తావివ్వవు. ఇవి ప్రగతికి పెద్ద ప్రతిబంధకాలు. వీటిని తగ్గించుకొంటేనే విజయంవైపు తేరిపార చూసేందుకైనా వీలౌతుంది. వీటివల్ల తాను పడ్డ అవస్థలను సంకీర్తనాచార్యుడు అద్భుతంగా ఆవిష్కరించాడు.

"అంగనల పసఁ జిక్కి అలయికలే కంటి
బంగారు వెంటఁ దగిలి భ్రమ గంటిని
ముంగిటి క్షేత్రాలంటి ముంచి వెట్టిసేయఁ గంటి" (2-256)

మదాన్ని కలిగించే ఎనిమిదింటిలో వయసు కూడా ఒకటి. మదము చుట్టూరా ఉన్నవారినేకాక అది పట్టిన వారిని కూడా ఇబ్బంది పెడుతుంది. ఈసడించుకొనేట్టు చేస్తుంది. ప్రతివారికి వచ్చే మదం తన్ను కూడా విడువలేదని అన్నమయ్య ఆవేదనపడడం అత్యంత సహజంగా ఉంది.

"మట్టులేని వయసుతో మదముగంటి" (2-256)

చదువుల వల్ల జ్ఞానమూ, విశాల దృక్పథమూ రావాలి. అయితే వాటివల్ల కుయుక్తి, సంకుచితత్త్వము ఏర్పడి విభేదాలకు దోహదం చేస్తున్నాయి. ఈ విషయాన్నే పదకవితా పితామహుడు స్పష్టం చేశాడు.

"వింత చదువుల వల్ల వేవేలు మతాలు గంటి" (2-256)

అనేక రకాల కర్మలకూ అలవాటుపడిన మనిషి అలమటించవలసిందే. అందుకే అన్నమయ్య ఇలా తెలియజేశాడు.

"సంత కర్మముల వల్ల సాము గంటిని" (2-256)

తన దోషాలు గురించి, హీన స్థితిని గురించి అన్నమయ్య స్వామికిలా నివేదించాడు.

'అనంతా పరాధి నేను అటుగాన శరణంటిని

.............................................

యెగ్గులెంచితే నా వల్ల నెన్ని లేవయ్యా

.............................................

పాదుగా విచారించితే బలుమూఢుఁడనయ్యా' (2-323)

ఎక్కడ ఏది జరిగినా అది తన ప్రతాపమే అనుకోవడం మానవ నైజం. అది సరికాదని తెలిసినా అలా అనుకుంటూనే ఉంటాడు. అహంకరిస్తూనే ఉంటాడు. ఇటువంటి దుష్ప్రవృత్తి తనలోనూ ఉందని ఎంతో బాధతో దానికద్దం పట్టాడు అన్నమయ్య.

"ఇట్టి నా వెట్టితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁ జూడవే

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడ నేరుతునంటా మరి నేనహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండగాను
గాటాన దొరనంటా గర్వింతు నేను

నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించగాను
కమ్మి నేనే బిడ్డల గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటినివి నేనంటా నెంతు

మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నా తపో మహిమ యిది యనుచును" (2-304)

అన్నమయ్య ఆత్మ విమర్శ ప్రభావం - అనంతర వాగ్గేయకారులలో కూడా గోచరిస్తూ ఉంది. ఆత్మవిమర్శ వారి ఔన్నత్యానికి అద్దం పడుతూ ఉంది.

రామదాసు మానవ సహజమైన తన దుస్థితికి దురపిల్లాడు. దాన్ని అధిగమించలేక పోయాను కదా! అనే ఆవేదనను అభివ్యక్తం చేశాడు.

"వదలక యౌవనమున పరభామల
వలల తగులనాయెగా ఓ రామా
ముదిమిని సంసారాంధకూపములో జిక్కి
మునిగి తేలనాయెగా ఓ రామా

తను వస్థిరంబని తారక నామము
తలపోయలేనైతిగా ఓరామా
దిన దినము పొట్ట కొరకై దీనుల వేడి వేడి
దీనత్వ మొందితిగా ఓ రామా

అనుదినమును గురు ఉపదేశ యోగము
అభ్యసించనైతిగా ఓ రామా
ఎనసి నిముషమైన మీ పాదములపైని
మనసు నిల్పగనైతిగా ఓరామా" (రామదాసు కీర్తనలు - 106)

సారంగపాణి తన దుష్కృత్యాలకు వగచాడు. వగలేని తన వగపును స్వామికి నివేదించాడు.

"పుట్టినది మొదలుగ భూ-పాలకుల గొలిచి-
పట్టెడన్నానికై - పరుగులెత్తి
పొట్ట నించున మతిలో - పొంగుచుంటిని గానీ-
పట్టుగనొకనాడు - ప్రద్యుమ్న యననైతి

నరక హేతువులైన - దురితకృత్యములకు
మరిగి కండ్ల - కావరమునను
పరకాంతుల మోము - లరసి భ్రమసితిగాని-
పురుషోత్తమ నీపై - బుద్ధి నిలుపనైతి
పరమ భాగవతుల - ప్రల్లదములు బల్కి -
గురువుల నిందించి - కుటిలుడనై
అరయక తలిదండ్రు - లాజ్ఞ మీరితి గాని -
స్థిర చిత్తమున హరిని - స్మరణ సేయనైతి

అపకారములకునే - నగ్రగణ్యుడనై -
యుపకృతి మాటంటె - నుగ్రుడనగుచు
అపకీర్తులకునే - నర్హుడైతిగానీ -
కపట వామన నీదు - కథ చెవుల విననైతి

యతుల దూషణ జేసి - యెదటి మేలోర్వక -
కృతులు మానవుల - కర్పితము జేసి
గత వాసరములీ - గతి దాటించితిగానీ -
పతిత పావన స - ద్గతీ జూపు మననైతి"

(సారంగపాణి పదాలు - 185)

**త్యాగయ్య :** అపాత్రుడైన తనను కాపాడడం రాముడికైనా సాధ్యమేనా అనే సంశయం త్యాగరాజుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తన వ్యర్థ కార్యకలాపాలను రాముని దృష్టికి తెచ్చాడు.

"ఎటుల బ్రోతువో తెలియ? ఏకాంత రామయ్య!
కట కట! నాచరితము - కర్ణ కఠోరమయ్య
పట్టి గొడ్డు రీతి భక్షించి తిరిగితి,

పుట్టు లోభులను పొట్టకై పొగడితి,
దుష్టులతో గూడి దుష్కృత్యము సల్పి,
రట్టు జేసిన త్యాగరాజుని దయతో" (2-9)

తనను, తన ద్వారా ఇతరులను ఇబ్బందిపెట్టే మానవుని అవగుణాలను అన్నమయ్య - తదితర వాగ్గేయకారులు అందంగా ఆవిష్కరించారు. ఇవి ఉంటే నిష్కృతి ఎక్కడిదని ఆవేదనపడ్డారు. వీటిని పోగొట్టుకోవాలని ఆరాటపడ్డారు. విష్ణుదేవుని కృపకు పాత్రులైన వీరే ఇంకా ఆరాటపడ్తుంటే, సామాన్యులైన మన సంగతి ఏమిటి?

ప్రతివారు ఆత్మవిమర్శ చేసుకొని, తమలో ఉండే లోపాలను దిద్దుకొని, ఉన్నత స్థితికి చేరుకోవద్దా! పురోగమించి పులకిత గాత్రులు కావద్దా!

# అన్నమయ్య దశావతార సంకీర్తనలు

తాళ్ళపాక అన్నమాచార్యుడు వేంకటేశ్వర భక్తుడు. విష్ణువే వేంకటేశ్వరుడుగా ఆనంద నిలయంలో భక్తులను అనుగ్రహిస్తున్నాడని అన్నమయ్య ప్రగాఢంగా విశ్వసించాడు. అందువల్ల వేంకటేశ్వరస్వామిని విష్ణువుగా, కృష్ణుడుగా, రాముడుగా నోరారా కీర్తించాడు. విష్ణుదేవుని దశావతారాలను కొనియాడాడు. ఆయా అవతారాల్లో స్వామి ప్రదర్శించిన మహిమలను, లీలలను ప్రస్తుతించాడు. ఆ స్వామిమీద ప్రజలకు ప్రగాఢమైన భక్తిని ఏర్పరచే ప్రయత్నం చేశాడు.

అన్నమయ్య రచించిన దశావతార సంకీర్తనలు ఎంతో ఆనందం కలిగిస్తాయి. మచ్చుకు వాటిలో కొన్నిటిని గమనించండి.

విష్ణుదేవుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ అనే ఐదు స్థితుల్లోనూ ఉంటాడని వైష్ణవుల విశ్వాసం. ఈ ఐదు స్థితుల్లోనూ భక్తులను అనుగ్రహిస్తూనే ఉంటాడు. విష్ణువు వైకుంఠంలో ఉన్న స్థితిని పర అనీ, పాలసముద్రంలో శయనించే స్థితిని వ్యూహఅనీ, అవతారస్థితిని విభవ అనీ, యోగుల హృదయంలో ఉండే స్థితిని అంతర్యామి అనీ, ఆలయాల్లో ఉంటూ అర్చలందుకొనే స్థితిని అర్చ అనీ వ్యవహరిస్తారు.

విష్ణువు దుష్టశిక్షణ శిష్ట రక్షణ చేసేందుకు అవతరించడం ఆదినుంచీ ఆనవాయితీయే. అవతరించడమంటే దిగిరావడం. భగవంతుడు తన స్థితి నుంచి సామాన్యుల మధ్యకు వచ్చి వారి సుఖదుఃఖాల్లో పాలుపంచుకొని వారిని ఉద్ధరించే చర్యనే అవతారమని స్థూలంగా చెప్పుకోవచ్చు.

విష్ణువు ఎన్నో అవతారాలు ధరించాడు. వాటిలో 21 ప్రసిద్ధం. 10 మరీ సుప్రసిద్ధం. అన్నమయ్య కూడా తన సంకీర్తనల్లో దశావతారాల్నే ప్రస్తావించాడు.

"ఇట్టె మమ్ము రక్షించుట యేమి దొడ్డ నీకు నేడు
బట్ట బాయిటనే నీవు పది రూపులైతివి"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2 - 503)

అన్నమయ్య గశావతారాల్లోవే అయిన రామకృష్ణాద్యవతారాల మీద విడివిడిగా వేలకొలది సంకీర్తనలు రచించాడు. ఇవేగాక 10 అవతారాల జాబితాను పలు కీర్తనల్లో పలు రకాలుగా ఆవిష్కరించాడు. వాటిలో పది రకాల కీర్తనలను మాత్రమే మనం ఇక్కడ తీసుకొంటున్నాం. వీటిలో చోటు చేసుకొనే వైవిధ్యాన్ని, శబ్ద సౌందర్యాన్ని, అర్థ గాంభీర్యాన్ని కిత కితలు పెట్టే కవితా ప్రతిభను గమనించవలసి ఉంది.

అన్నమయ్య దశావతారాలను అనేకవిధాలుగా కొనియాడాడు. అన్నమయ్య దశావతారాలను కొనియాడిన తీరులో ప్రత్యేకత ఉంది. కవిత్వపు సౌరు ఉంది. సౌరభం ఉంది. దశావతారాలను వాచ్యం చెయ్యకుండా గుండెను తాకేట్టు చెప్పే నేర్పు ఉంది.

**కర్మ సిద్ధాంత ప్రతిపాదన :** కర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ దశావతారాలను ప్రస్తావించిన తీరు రమణీయంగా ఉంది. మిట్టిపడడం చేప స్వభావం. వీపు బట్ట కట్టేట్టు మోపు మోయడం కూర్మ స్వభావం. తవ్వడం వరాహ స్వభావం. నోరు తెరవడం సింహాన్ని సూచిస్తుంది. నరసింహావతారాన్నీ ధ్వనింపజేస్తుంది. ఇలాగే తక్కిన అవతారాలన్నీ కూడా.

ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చి నంతేకాని లేదు
తాము సేసినంత వట్టు తమకు బోరాదు
ఇట్టు నట్టు మిట్టిపడ్డ యించుకంతా లేదు, వీపు
బట్టగట్ట మోపుమోచి పాటువడ్డా లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొనినా లేదు
తెట్ట దెరువున నోరుదెరచినా లేదు ॥ఏమి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.1-55)

**పొడుపు కథలు :** జానపద సాహిత్యంలో పొడుపు కథలకు సముచిత స్థానం ఉంది. కథలు వేసుకోవడం, విప్పడం జానపదులకెంతో సరదా. ఈ సరదా పద్యాలకు కూడా పాకింది.

ఒడలినిండ కన్నులుండు నింద్రుడు కాడు
కంఠమందు నలుపు కాడు శివుడు
ఫణులబట్టి చంపు పక్షీంద్రుడును కాడు
దీని భావమేమొ తెలిసికొనుడు

ఇలాంటి పొడుపు కథలకు కూడా అన్నమయ్య తన సంకీర్తనల్లో స్థానం కల్పించాడు. దశావతారాల్లో సైతం పొడుపు కథల ద్వారా కొనియాడిన అన్నమయ్య నేర్పు బహుదా ప్రశంసనీయం.

ఎవ్వడో కాని యెరగరాదు కడు
దవ్వులనే వుండు తలపులోనుండు

ఎడయవు తన రెక్కలెగసి పోలేడు
కడుదాగు గాని దొంగయు కాడు
వడుగిందు పడును సేవకుడును గాడు
వెడగు గోళ్ళు వెంచు విటుడును గాడు ॥ఎవ్వడో॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-74)

రెక్కలున్నప్పటికీ అవి ఎగరడానికి ఉపయోగపడవు. ఇది మత్స్యావతార ప్రస్తావన. దాగి ఉంటాడు కాని దొంగకాడు అనడంలో కూర్మావతార సూచన కనిపిస్తుంది. క్రిందపడతాడు కాని సేవకుడు కాడు అనడంలో వరాహావతార స్పృహ ఉంది. గోళ్ళు పెంచుతాడు కాని విటుడు కాడు అనడంలో నరసింహధ్వని ఉంది. ఇలాగే తక్కిన అవతారాలను కూడా ఈ కీర్తన హృద్యంగా కీర్తించింది.

**భూత వర్ణన :** స్వామిని భూతంగా వర్ణించడం అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తుంది. భూతమంటే సంభవించింది లేదా ఏర్పడింది అని అభిప్రాయం.

పృథివ్యప్తేజోవాయురాకాశాలు పంచభూతాలని మనకు తెలుసు. దయ్యాన్ని, పిశాచాన్ని కూడా భూతమని పిలవడం మనకు తెలుసు. అన్నమయ్య విష్ణుదేవుని భూతమని పిలిచి భూతశబ్దాన్ని తన చమత్కారానికి వాడుకున్నాడు. దశావతారాలను భూతాలుగా అభివర్ణించాడు.

పుడమి నిందరి బట్టె భూతము కడు
బొడవైన నల్లని భూతము
కినిసి వోడమింగెడి భూతము
పునుక వీపు పెద్ద భూతము
కనలి కవియు చీకటి భూతము
పొనుగు సోమపు మోము భూతము

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-109)

కినిసి వోడమింగెడి భూతమనడంలో మత్స్యావతారాన్ని, పునుక వీపు పెద్ద భూతమనడంలో కూర్మావతారాన్ని, చీకటి భూతమనడంలో వరాహాన్ని ధ్వనింపజేస్తుంది. సోమపు మోము అనడం ద్వారా నరసింహముఖం సూచితమైంది.

**చేతి చలువ :** అన్నమయ్యకు తిరుమలయ్య వరదాభయ దానహస్తాలు మనో దృగ్గోచరమయ్యాయి. దేవతలెందరికో అభయ ప్రదానం చేసిన ఆ చేయి దశావతారాల్లో నిర్వహించిన పాత్ర ఆయన స్మృతిపదంలో మెదిలింది. ఇంకేముంది ఆ చేతి కీర్తిని కీర్తించే కీర్తన సంసిద్ధం.

ఇందరికి నభయంబులిచ్చు జేయి
కందువగు మంచి బంగారు చేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలికిందఁ జేర్చు చేయి
కలికియగు భూకాంతగాఁ గౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాడి చేయి ॥ఇందరికి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ. సం. 1-334)

మత్స్యావతారంలో వేదాలు తీసుకురావడాన్ని, కూర్మావతారంలో సముద్రాన్ని చిలికే పర్వతాన్ని అడుగుభాగంలో పట్టుకోవడాన్ని, వరాహావతారంలో భూదేవిని కౌగిలించడాన్ని, నరసింహావతారంలో వాడిగోళ్ళు కలిగి ఉండడాన్ని అన్నమయ్య ఇక్కడ ప్రస్తావించాడు.

**బోయనాయడు :** తిరుమలయ్యను భూతంగా వర్ణించిన అన్నమయ్యే బోయనాయడుగా కూడా అభివర్ణించాడు. ఒకప్పుడు తిరుమల అడవి ప్రాంతం. అడవిలో బోయవాళ్ళు ఎక్కువగా నివసించే వాళ్ళేమో. అందువల్ల శేషాద్రి నాయకుణ్ణి కూడా అన్నమయ్య బోయనాయడుగా భావించి ఉంటాడు. ఆయన ధరించిన దశావతార ప్రస్తావనలో కూడా బోయనాయడు శబ్దం ఆవృత్తి అయ్యేట్టు చూశాడు.

పొడవైన శేషగిరి బోయనాయడు
విడువకిందరి గాచు వెడబోయనాయడు

పొలసి మీసాల పెద్ద బోయనాయడు
మలిగి వీపున గట్టే మంకు బోయనాయడు
పొలము రాజై తిరిగే బోయనాయడు
వెలయ మోటున నుండే వేట బోయనాయడు ॥పొడ॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-460)

పొలుసు మీసాల పెద్ద బోయనాయడు అనే శబ్దంలో మత్స్యావతారాన్ని, మలిగి వీపునగట్టే మంకు బోయనాయడు అనే శబ్దంలో కూర్మావతారాన్ని, పొలమురాజై తిరిగే బోయనాయడు శబ్దంలో వరాహావతారాన్ని, వేలుబోయ నాయడు అనే శబ్దంలో నరసింహావతారాన్ని అన్నమయ్య ప్రస్తావించాడు.

**పురుషోత్తముడు :** అన్నమయ్య విష్ణువుని పురుషోత్తముడని సంభావించడమే కాక సంబోధించాడు. ఒక కీర్తనలో దశావతారాల స్తుతి చేస్తూ పురుషోత్తమా శబ్దం మళ్ళీ మళ్ళీ ఆవృత్తం అయ్యేటట్లు రచించాడు. ఈ గేయం కమనీయం. రమణీయం.

పురుషులకు పురుషుడవు పురుషోత్తమా
పురుడు లేదిక నీకుఁ బురుషోత్తమా

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బులిసిలోగఁగ నేల పురుషోత్తమా
పొలము రాజవు నీవు పురుషోత్తమా నీ
పొలకు వదే కంబమునఁ బురుషోత్తమా ॥పురు॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ. సం. 2-283)

పొలసులాడడం మత్స్యాన్ని, లోగడం కూర్మాన్ని, పొలము రాజవు నీవు అనడం వరాహాన్ని, స్తంభ ప్రస్తావన నరసింహుణ్ణి సూచిస్తున్నాయి.

**డోలోత్సవంలో :** తిరుమలేశునికి జరిగే ఉత్సవాలలో డోలోత్సవం కూడా ఒకటి. డోలలో స్వామిని ఉంచి ఊచుతూ పాటలు పాడడం డోలోత్సవ ప్రధానాంశం. అన్నమయ్య ఈ డోలోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా సంకీర్తనలు రచించాడు. విష్ణుదేవుని దశావతారాలను ప్రస్తావిస్తూ సంస్కృతంలో ఈ డోలోత్సవ కీర్తన సాగింది. ఇందులో దశావతారాలను స్పష్టంగా వాచ్యం చేయడం కనిపిస్తుంది.

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం
మీన కూర్మ వరాహ మృగపతి అవతారా

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 2-374)

**అన్వేషిస్తే :** విష్ణువు సర్వాంతర్యామి. సర్వలోకమయుడు. ఎక్కడ అన్వేషిస్తే అక్కడ ఏదో ఒక రూపుతో తారస పడతాడు. పది రూపులతోను కనిపించి పరవశింపజేస్తాడు. ఈ ఆలోచన అన్నమయ్య అంతర్లోచనాన్ని తెరిసింది. దశావతారాలు దర్శనమిచ్చాయి. అన్నమయ్య పొందిన మధురానుభూతి పాటగా పల్లవించింది.

ఇతనికంటే మరి దైవము గానము యెక్కడ వెదకిన నితడే
అతిశయమగు, మహిమలతో వెలసెను అన్నిటి కాధారము దానె

మది జలధుల నొక దైవము వెదకిన మత్స్యావతారంబితడు
అదివో పాతాళమందు వెదకితే నాది కూర్మమీ విష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదఱక కొండల గుహలవెదకితే శ్రీ నరసింహంబున్నాడు ॥ఇతని॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-370)

**దొంగ :** స్వామిని భూతంగాను, బోయనాయడుగాను సంబోధించిన అన్నమయ్య చివరికి దొంగగా కూడా సంభావించి దర్శించాడు. ఔను; ఆ స్వామి వేడిపాలను, వెన్నలనేగాక గోపికా స్త్రీల హృదయాలను, తాపసుల అంతరంగాలను కూడా దొంగిలించాడు. ఈ తలపే అన్నమయ్యలో ప్రవేశించి స్వామిని దొంగగా దర్శింపజేసి ఉంటుంది. ఈ పాటలో దశావతారాల ప్రస్తావన కూడా రమణీయంగా చోటు చేసుకోవడం గమనార్హం.

వీడివో యిదె వింత దొంగ
వేడిపాలు వెన్న వెరఁజిన దొంగ

వెలయ నీటఁ జొప్పు వేసేటి దొంగ
తలగాననీక దాగు దొంగ
తలకక నేల దవ్వేటి దొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి దొంగ

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 1-322)

నీట జొప్పు వేయడం మత్స్యావతారాన్ని, నీట దాగడం కూర్మావతారాన్ని, నేల తవ్వడం వరాహావతారాన్ని, సందెకాడ తిరగడం నరసింహావతారాన్ని సూచిస్తున్నాయి.

**మేలు :** అన్నమయ్య ప్రజలకు ఏది మేలో తెలియజేశాడు. అలా తెలియజేస్తూనే దశావతారాలను ప్రస్తావించడం ప్రశంసార్హం. ఇందులో అన్నమయ్య రచనా నైపుణ్యం రవళించిన తీరు అద్భుతం.

సంసారమే మేలు సకల జనులకును
కంసాంతకుని భక్తి గలిగితే మేలు

వినయపు మాటల విద్య సాధించితే మేలు
తనిసి యప్పులలోన దాగకుంటే మేలు
మునుపనే భూమి దన్ను మోచి దించకుంటే మేలు
వెనుకొన్న కోపము విడిచితే మేలు ॥సంసారమే॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం. 3-447)

వినయపుమాటల విద్య అనడం ద్వారా వేదాన్ని తద్వారా మత్స్యావతారాన్ని గుర్తు చేసినట్టు అయ్యింది. అప్పులలో దాగకుంటే అనడం కూర్మావతారాన్ని గోచరింపజేస్తుంది. ఇక్కడ సంస్కృత అప్పే ప్రయోగింపబడినా తెలుగు అప్పును కూడా అన్వయించుకోవచ్చు. అలాచేస్తే జీవనగమనం సుగమం అవుతుంది. ఇలాగే భూమి దన్ను మోచి దించకుంటే అనడం వరాహావతారాన్ని, వెనుకొన్న కోపము విడిచితే మేలు అనడం నరసింహావతారాన్ని సూచిస్తున్నాయి.

ఇలాగే అవతారాలను ప్రస్తావిస్తూ నీతి చెప్పడం లోకరీతి సుసంపన్నం అయ్యేట్టు చూడడం గమనార్హం.

ఈ మేలుతో ఇప్పటికి ఆపడం మేలు. అన్నమయ్య సంకీర్తనల్లో దశావతార సంకీర్తనలెన్నో వైవిధ్య భరితంగా చోటు చేసుకున్నాయి. వీటిలో కవిత ఉంది. నిత్య నవత ఉంది. భగవంతునిపట్ల ప్రగాఢ మమత ఉంది. వీటన్నింటినీ గూడా చదివి, అనుభవించి ఆనందించవలసి ఉంది.

# అన్నమయ్య వేంకటేశ్వర శతకం - అందచందాలు

ఆంధ్ర సారస్వత చరిత్రను మలుపు తిప్పిన మహామనీషి తాళ్ళపాక అన్నమాచార్యుడు. అంతకు ముందు ఏ ఒకరో ఇద్దరో మినహాయిస్తే కవులంతా అనువాద సాహిత్యానికే ప్రాధాన్యం ఇచ్చారు. మార్గ సాహిత్యానికే పెద్దపీట వేశారు. అన్నమయ్య మనసు దేశిసాహిత్యం వైపు మొగ్గు చూపింది. స్వతంత్ర రచనను ఆదరించింది. మొదటినుండి పండితాదరణకు నోచుకోక జానపదులకే పరిమితమై అప్పుడప్పుడే తల బయటపెడుతున్న పదసాహిత్యాన్ని అన్నమయ్య మనసారా ఆదరించాడు. అందలమెక్కించాడు. అందరిచేతా బ్రహ్మరథం పట్టించాడు. జానపదుల భాషను, సంస్కృతిని అక్షరీకరించి అక్షరం చేశాడు. సంకీర్తనలు రచించడమేగాక సంకీర్తనా లక్షణాలను క్రోడీకరించి 'సంకీర్తన లక్షణం' అనే సంస్కృత గ్రంథాన్ని కూడా వెలయించాడు.

అన్నమయ్య 32వేల సంకీర్తనలు రచించడమేగాక 12 శతకాలు కూడా రచించాడు. ద్విపద రామాయణాన్ని, నానా భాషల్లో పలు ప్రబంధాలను రచించినట్లు ప్రతీతి. మంజరీ ద్విపదలో 'శృంగార మంజరి'ని రచించాడు. దాదాపు 12వేల సంకీర్తనలు, శృంగారమంజరి, వేంకటేశ్వర శతకం మాత్రం ఇప్పుడు లభిస్తున్నాయి. తక్కినవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రస్తుతం అన్నమయ్య రచించిన వేంకటేశ్వర శతకంలోని అందచందాలను దిఙ్మాత్రంగా ఆవిష్కరించడమే ఈ వ్యాస పరమావధి.

అన్నమయ్య ఎనిమిది సంవత్సరాల ప్రాయంలో తిరుమల కొండనెక్కాడు, మోకాటి ముడుపు దగ్గర బాగా అలసిపోయాడు. ప్రక్కనే ఉన్న వెదురుపొదలో విశ్రమించాడు. అలిమేలు మంగమ్మ పెద్ద ముత్తయిదువు రూపంలో అన్నమయ్య దగ్గరకు వచ్చింది. అన్న ప్రాసాదాలు తినిపించి సేదదీర్చింది. మంచి మాటలతో ఉత్సాహపరిచింది. అదృశ్యమైంది. ఆమె కనుమరుగయ్యాక అన్నమయ్యకు అలిమేలు మంగమ్మ తనపట్ల కనబరచిన అపారకృప అంతరంగంలో మెదిలింది. అనుభూతి ఆవేశంగా పరిణమించింది. కట్టలు తెంచుకొని కవిత్వరూపంలో

బహిర్గతమైంది. అదే జగన్మాత స్పృహతో జగదేక జనకుని పేర వెలువడిన వేంకటేశ్వర శతకం.

మరికొందరు అన్నమాచార్యుడు ఆ ప్రాయంలో ఈ శతకం రాసి ఉండడన్నారు. లేప్రాయంలోనే కామశాస్త్ర రహస్యాలను తెలుసుకునే అవకాశం లేదని భావించారు. శతకమంతా అలిమేలుమంగ, వేంకటేశ్వరుల ప్రణయాన్ని గురించే చర్చించడం వల్ల అంత బాల్యంలో అన్నమయ్య ఈ రచనచేసి ఉండడని నిండు యౌవనంలోనో, వ్యతిక్రాంత యౌవనంలోనో ఈ రచన చేసి ఉండవచ్చని వారు భావించారు. ఏది ఏమైనా అన్నమయ్య వేంకటేశ్వర శతకం రచించాడనడం నిర్వివాదం. ఆ శతకాన్ని వేంకటేశ్వరునికి అంకితమివ్వడం కూడా వాస్తవం. అన్నమయ్య రచించిన ఈ పద్యమే దీనికి ప్రబల సాక్ష్యం.

"అమ్మకు దాళ్ళపాక ఘనుడన్నడు పద్య శతంబు జెప్పె గో
కొమ్మని వాక్ప్రసూనముల గూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మ కల్పముల్
సమ్మదమంది వర్థిలను జవ్వన లీలల వేంకటేశ్వరా!
(అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకము, పద్యం-100)

అలిమేలుమంగా వేంకటేశ్వరులు అనేక యుగాలు బ్రహ్మకల్పాలు వర్థిల్లాలి. యౌవన లీలలతో సంతోషంగా వర్థిల్లాలి. ఇది అన్నమయ్య ఆకాంక్ష. ఎన్ని కల్పాలు వెళ్ళినా శ్రీవారికి యౌవనం పోదు. ముదిమి రాదు. ఇది అన్నమయ్య అచంచల విశ్వాసం. అందుకే ఆ దివ్య దంపతులకే ఈ శతకాన్ని రచించి సమర్పించుకొన్నాడు.

ఈ శతకం సాధారణ శతకం కాదు. దీని నడక సామాన్యంగా సాగలేదు. అలిమేలుమంగా వేంకటేశ్వరుల ఇద్దరి ప్రస్తావన దీనిలో ఉంది. అన్నమయ్య ప్రతి పద్యంలోను మొదట అలిమేలుమంగ ప్రస్తావన, పిదప స్వామివారి ప్రస్తావన తప్పనిసరిగా ఉండవలసిందే. అమ్మవారు అనపాయిని. కాబట్టి అన్నమయ్య ఇద్దరికీ కలిపి ఒకే శతకం చెప్పాడు. ఇటువంటి రచనా విధానం మరి ఎక్కడా కనిపించదంటే అతిశయోక్తి కాదు.

**అణకువ :** బాగా ఎదిగి పండిన పైరుగాని, పండ్లతో ఉండే చెట్టుగాని వంగి ఉంటుంది. అదేవిధంగానే గొప్ప సంస్కారవంతుడు, గొప్ప విద్యావంతుడు అణకువతో ఒంగే ఉంటాడు. వినయంలేని విద్య పరిమళంలేని పుష్పమని పెద్దల నానుడి. కాబట్టి గొప్పవారందరు తమను తాము తక్కువ చేసి మాట్లాడుకోవడం కనిపిస్తుంది. అన్నమయ్య దైవదర్శనం చేసుకొన్నవాడు. ధర్మాన్ని గ్రహించినవాడు. మంచి పాండిత్యం గడించినవాడు. అటువంటి మహనీయుడు తన గురించి ఏమి చెప్పుకొన్నాడో గమనిస్తే ఆశ్చర్యం కలుగక మానదు.

"యోగ్యతలేని కష్టుడన యోగ్యుడ నన్నిట జూడ గర్భని
ర్భాగ్యుడ నీ కృపామతికి బ్రాప్తుఁడనో యలమేలు మంగ నా
భాగ్యము నీ కృపాకరుణ బ్రాప్యము కావుమటంచు సారెనీ
భాగ్యవతీ శిరోమణిని బ్రస్తుతి సేసెద వేంకటేశ్వరా!

(అన్నమయ్య-వేంకటేశ్వర శతకం-పద్యం-90)

**అలమేలు మంగ ప్రశంస :** అన్నమయ్య తిరుమలకు వెళ్ళినప్పుడు స్వామికంటే ముందు అలమేలుమంగే ఆయనకు దర్శనమిచ్చింది. అపార పుత్రవాత్సల్యాన్ని ప్రదర్శించి తన మాతృహృదయాన్ని ఆవిష్కరించింది. అందువల్లనే అన్నమయ్య ఆమెపట్ల ఎంతో భక్తి ప్రదర్శించాడు. ఎన్నో కీర్తనల్లో ఆమె ఘనతను కొనియాడాడు. స్వామివారి కల్యాణోత్సవంలో కూడా అలిమేలు మంగను పుత్రికగా భావించి కన్యాదాతగా వ్యవహరించాడు. ఈ శతకంలో ఎక్కువ భాగం అలమేలుమంగ ప్రశంసతో నింపాడు. సమస్త వైభవాభరణంగా, దేవదేవుని కృపామతిగా ఆమెను అభివర్ణించాడు. ఆమె కారుణ్యంతోనే అఖిలమూ వర్ధిల్లుతుందని దేవతలు, మునులు అలమేలు మంగను వినుతిస్తున్నట్టు తెలియజేశాడు. ఆమే ఆదిలక్ష్మియని, అంబరవీధి నుంచి తత్వమహత్వ రహస్యవేత్తలు కొనియాడుతున్నట్టు చెప్పాడు. అలమేలు మంగ సొలపుల చూపులే వేంకటేశ్వరుని చూపులకు విందులని ప్రశంసించాడు.

అన్నమయ్య కాలంవారు ఇప్పటి వారికంటే కూడా గొప్ప రసికులే. మైపూతలు వాడేవారు. తమ అలంకరణతో మైమరిపించేవారు. అన్నమయ్య కాలంవారి అలంకరణనే అలమేలు మంగమ్మకు కూడా ఆపాదించాడు.

"కస్తురి పచ్చ కప్పురము గమ్మని పుప్పొడి ధూళ్ళు హత్తి శ్రీ
హస్తమునందు దట్టపును గందుచు శ్రీయలమేలు మంగభా
..............................................................
..............................................................."

(అన్నమయ్య - వేంకటేశ్వర శతకం - పద్యం - 22)

సంపదకు అధిదేవత అలమేలుమంగ. ఆమె చెలువంపు సంపద అపారం. అందరికీ సంస్తుతి పాత్రం. అందువల్లనే అన్నమయ్య ఆ విషయాన్ని తిరుమలయ్య దృష్టికి తీసుకువచ్చాడు.

ఏ చతురత్వమే మహిమ మేమి విలాసమదేమి విభ్రమం
బీ చెలు వంపు సంపదయు నిందు ముఖుల్ జగదేక మోహినుల్
చూచి తలంట వేడ్క పడిచూతురు నీ యలమేలు మంగ లీ
లా చికురంపు గ్రొమ్ముడి కెలంకుల నిగ్గులు వేంకటేశ్వరా!

(అన్నమయ్య - వేంకటేశ్వర శతకం, పద్యం-30)

రూపేచ లక్ష్మీ అని శాస్త్రోక్తి. అలమేలు మంగే ఆదిలక్ష్మి అని అన్నమయ్య, ఆళ్వారులందరు భావించారు. అందువల్ల ఆమెను అందాలరాశిగా అభివర్ణించారు. అన్నమయ్యాది భక్తులే కాదు, అంబరంలో సంబరంగా విహరించే ఆదితేయులు కూడా. ఇది అన్నమయ్య భావన. ఈ పద్యంలో అలమేలుమంగ సౌందర్యమేగాక అన్నమయ్య కవితా సౌందర్యం కూడా అలరారుతూ ఉంది.

తిరమగు మంచి కుందనపు దీగపయిన్ ఘన చక్రవాకముల్
పరగిన రీతి జన్ను గవ భావముతో నలమేలుమంగ నీ
యురము పయింబెలగ గనియోగి జనంబులు నీలమేమ వి
స్ఫురణము తోడిమిం చనుచు జూచి నుతింతురు వేంకటేశ్వరా!

(అన్నమయ్య - వేంకటేశ్వర శతకం, పద్యం-32)

అలమేలు మంగ హరి అంతరంగ. అనురాగగంగ. హరి ఉరంలో నివసించే అన్నువ. సమస్త దేవతలకు సంస్తవనీయ. అటువంటి జగన్మాతను కూడా అన్నమయ్య సామాన్య మానవ స్త్రీగా మార్చివేశాడు. అన్నమయ్య అంతరంగం నుంచి వెలువడిన అలమేలు మంగ హరి విరహానికి గురైంది.

దుర్భర వేదనతో తనకు తెలియకుండానే అనేక చేష్టలు చేసింది. అన్నమయ్య ఆమె వేదనను అక్షరీకరించాడు.

తలచు గరంగు మై మఱచు దన్మయమందును జిత్తజాగ్ని ని
న్నలయుచు దూరునుస్సురను నర్మిలితో నలమేలు మంగ నీ
వలిగిన నంతనే కడు బ్రియంబికనేమని చెప్ప నేడువో
కలిగిన ప్రేమ మింతయు బ్రకాశము తోచెడు వేంకటేశ్వరా!

(అన్నమయ్య - వేంకటేశ్వర శతకం, పద్యం-15)

అన్నమయ్య అంతరంగంలో అలరారే అలమేలుమంగ అనేక ఆభరణాలు ధరించింది. అందునా 15వ శతాబ్దపు ఆభరణాలే ధరించింది. పచ్చల సంది దండలు, బాహుపురులు, మగినూపురాలు, పసిడి మట్టెలు కాంచనరత్న నూత్న కటకాలు, మేఖలావళులు వాటిలో కొన్ని. అన్ని ఆభరణాలను ధరించి అలమేలు మంగమ్మ స్వామి ముందుకు వచ్చింది. అతనిని అలరించింది. ఆకట్టుకొంది. ఆభరణాలు ధరించిన అలమేలు మంగ రూపాన్ని వల్లభుని చెంతకు వచ్చిన వయ్యారాన్ని అన్నమయ్య చక్కగా వర్ణించాడు.

లలితపు గంకణాంగద కలధ్వలి ఘల్లని మ్రోయ నుంగరం
బులు మణి నీల కాంతుల ప్రభుత్వముతో నలమేలు మంగ గు
బ్బల పెను వ్రేగుతో దుఱుము భారముతో నిను చేరవచ్చు నం
దెలు మొలనూలు ఘంటలు, బ్రతిధ్వను లీనగ వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 20)

అన్నమయ్య తిరుమలయ్యకు పిండివంటలు పెట్టాడు. తాను స్వయంగా పెట్టలేదు. అలమేలు మంగ ద్వారా పెట్టించాడు. ఆ ఇల్లాలు ఆనాడు రాయలసీమ ప్రాంతంలో వాడుకలో ఉన్న పిండి వంటల్నే ఆ స్వామికి వడ్డించింది.

అరిసెలు నూనె బూరియలు కాగులు జక్కెర మండిగల్ వడల్
బురు డలు పాల మండిగ లపూపము లయ్యల మేలుమంగ నీ
కరుదుగా విందు వెట్టు పరమాన్న చయంబులు సూపకోటియన్
నిరతి వి నిర్మలాన్నములు నేతులు సోనలు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 50)

వేంకటేశ్వరుడికి అలమేలు మంగ భోజనం వడ్డిస్తుంది. ఆ నిర్మలాన్నముతో పాటు తాళించిన కూరలు, నేయి, తేనె, పంచదార కూడా కలిపి వడ్డిస్తుంది. స్వామి సరసోక్తులు విసురుతూ స్వాంతం సంతోషంతో వింతశోభలు విరజిమ్ముతూ ఉండగా ఆరగిస్తాడు. అదీ దాంపత్య అన్యోన్యమంటే. ఆ ఇల్లాలికి, ఆ గేస్తుడికి ఎంత వొద్దికో.

నించిన పంచదారలును నేతులు దేనెలు గమ్మగాగ దా
లించిన కూరలున్ బరిమళించగ నయ్యలమేలు మంగ వ
డ్డించిన నిర్మలాన్నములు డెంద మెలర్పగ నారగింతు నీ
మించినదేయు చేతులను మేలములాడుచు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 16)

నిరంతరానందం పొందేందుకు, జీవితంలో మంచిని సాధించేందుకు మానవుడు ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు. ఆ ప్రయత్నాలేవీ సక్రమంగా ఫలించనప్పుడు భగవంతుణ్ణి ఆశ్రయిస్తాడు. ఆయననే శరణువేడుతాడు.

'నీవే దప్ప నితఃపరం బెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్' అని ప్రాధేయపడతాడు. భగవంతుడు కూడా శరణువేడిన వారిని రక్షించడమే వ్రతంగా పెట్టుకున్నట్టు విభీషణ శరణాగతి సందర్భంగా రామాయణంలో తెలియజేశాడు.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ"

(వాల్మీకి శ్రీమద్రామయణం, యుద్ధకాండ 18వ సర్గ, 33వ శ్లోకం)

శ్రీమద్భగవద్గీతలో కూడా శ్రీకృష్ణ భగవానుడు శరణుజొచ్చిన వారికి సర్వ పాపాల నుంచి విముక్తి కలిగిస్తానని అభయమిచ్చాడు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్ష ఇష్యామి మాశుచః

(శ్రీమద్భగవద్గీత, 18-66)

ఇంత విశిష్టత ఉండబట్టే శరణాగతికి వైష్ణవులెంతో ప్రాధాన్యమిచ్చారు. అన్నమయ్య కూడా తన సంకీర్తనల్లో వేంకటేశ్వరుణ్ణి శరణు వేడడమేగాక శరణాగతిని గురించి పలుచోట్ల ప్రస్తావించాడు.

"సర్వేశ్వరుడే పొందెటి వస్తువు
శరణాగతియే ఉపాయము"

(తాళ్ళపాక అన్నమాచార్యులు, అ.సం - 10-90)

అని ఎలుగెత్తి చాటాడు. తాను రచించిన వేంకటేశ్వర శతకంలో కూడా వేంకటేశ్వరానుగ్రహం కోసం జగన్మాత అలమేలుమంగను శరణుజొచ్చినట్లు తెలియజేశాడు.

చొచ్చితి దల్లి నీ మఱుగు సొంపుగ నీ కరుణా కటాక్ష మె
ట్లిచ్చెదొ నాకు నేడు పరమేశ్వరి! యోయలమేలు మంగ నీ
మచ్చికనంచు నీతరుణి మన్నన నేనిను గంటి నీకు నా
బచ్చెన మాట లేమిటికి బ్రాతిదె చూడగ వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 55)

భగవంతుడు నామరూప గుణరహితుడని కొందరు భావిస్తారు. ఆయనకు నామరూపాలు కల్పించుకొని అర్చనాదులతో తరించేందుకు మరికొందరు ప్రయత్నిస్తారు. భక్తులిచ్చే పత్ర, పుష్ప, ఫల, తోయాలను తానే స్వయంగా స్వీకరిస్తున్నట్టు భగవంతుడైన శ్రీకృష్ణుడు భగవద్గీతలో సెలవిచ్చాడు.

పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః ॥

(శ్రీమద్భగవద్గీత, 9-26)

ఈ అర్చనా విధానం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొని అనాది నుంచి ఆచరణలో ఉంది. పూర్వం భక్తులెందరో భగవంతుణ్ణి అర్చించి ఆయన అనుగ్రహానికి పాత్రులయ్యారు. వేంకటేశ్వర భక్తుడైన అన్నమయ్య కూడా అర్చనాభక్తిని గురించి తన కీర్తనల్లో అనేకసార్లు ప్రస్తావించాడు. శతకంలో వాక్ప్రసూనాలతో అమ్మవారిని అర్చించిన వైనాన్ని ఆవిష్కరించాడు.

ఏచిన పాతకంబులకు నిన్నిటికి న్నిరవైన వాడనే
గాచిన కష్టవృత్తి కరిగాప్రనె యోయలమేలు మంగ నీ
చూచు కృపా నిరీక్షణమె చూచెద నంచును నీ ప్రియాంగనన్
బూచిన వాక్ప్రసూనముల బూజలు చేసెద వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 89)

**వేంకటేశ్వర ప్రశంస :** అన్నమయ్యకు అన్నీ వేంకటేశ్వరుడే. ప్రొద్దస్తమానమూ ఆయన తోడిదే లోకం. సాటిలేని మేటి దైవమని అన్నమయ్య తిరుమలేశుణ్ణి అనేకచోట్ల కీర్తించాడు. నిత్యమూ అతని సేవలోనే గడుపుతూ అనిర్వచనీయానందం పొందవలసిందిగా మానవ లోకాన్ని మరీ మరీ కోరాడు. అలమేలుమంగా వేంకటేశ్వరుల శృంగారవైభవాన్ని వర్ణించే వేంకటేశ్వర శతకంలో కూడా వేంకటేశ్వర ఘనతను వేనోళ్ళ కొనియాడాడు. వేంకటేశ్వరుడు మాటలకు చిక్కని మహా జాణకాడని అభివర్ణించాడు. అంతరంగాన్ని గెల్చిన అలమేలు మంగతో అప్పుడప్పుడు అలుక వహించిన ప్రణయకోపి. అటువంటి మహానుభావుని చిత్తాన్ని అనునయించే వారెవరూ? ఇది అన్నమయ్య ఆలోచన. ఇది శతకపద్యంలో పరిమళించిన తీరు మనోహరం.

నీవును దాను గూడె దరుణీమణి శ్రీయలమేలు మంగ నా
నా విధ వైభవంబుల ననారత ముంజెలు వొందు నేడు నీ
వావలి మోము చేసితని యప్పటి నుండియు బల్క విట్టురా
దేవర చిత్త మెవ్వరికి దేర్పగ శక్యమె వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 4)

వేంకటేశ్వరుడు సామాన్య దేవతకాదు. ఘటనా ఘటన సమర్థుడు. సృష్టిని పాలించే శక్తి గలవాడు. ఈ బ్రహ్మాండమంతా అతనికొక బొమ్మరిల్లై. సూర్యుడు దీపం. చంద్రుడు గుజ్జనగూళ్ళు. సమస్త దేవతలూ అతని సేవకులె. సృష్టి అంతా భగవత్క్రీడా విలాసం. ఏలినవాడి ఘనతనుచాటే ఈ పద్యం ఎంతో హృద్యం.

నెఱినలమేలు మంగకును నీకును పద్మభవాండ భాండమే
మెఱసిన బొమ్మరిల్లు తగు మేడలు మీదట లోకముల్ ప్రభల్
తెఱలగ మించు నయ్యినుడె దీపము గుజ్జన గూడు చంద్రుడే
తొఱలిన దేవ సంఘములె తొత్తులు బంట్లును వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం, పద్యం - 66)

అలమేలుమంగా విభుడు తన మనసును నిరంతరము కలశాబ్ధికన్యకకు కానుకబెట్టిన పరమరసికుడు. ప్రాజ్ఞుడు. వైభవోన్నతుడు. నందక శార్ఙ్గధరుడు అని స్త్రీలందరూ వేంకటేశ్వరుని కొనియాడుతారు.

వేంకటేశ్వరుడు జగదేక భర్త. సర్వశక్తిమంతుడు. సంకల్పమాత్ర సాఫల్యకారుడు. ఎక్కడగాని అతనికెదురు లేనేలేదు. అయినప్పటికీ అతనికి కూడా ప్రాధేయపడక తప్పలేదు. అతనిని ప్రాధేయపడేట్లు చేసిన వ్యక్తి ఆయన అర్ధాంగి అలమేలుమంగ. ఆయన అర్థింపు దైన్యం కాదు. అది ఒక శృంగార విలాసం. ఈ ఏకాంత సంఘటనను కూడా అన్నమయ్య పసిగట్టాడు. బయట పెట్టాడు. లోకాంతరంగుని అంతరంగాన్ని కూడా ఆవిష్కరించే ఉద్దేశమే ఈ పద్య రచనకు ప్రేరణ.

దుగ్ధ పయోధి కన్య జలధుల్ జగముల్ దన కుక్షినున్న సు
స్నిగ్ధ కృశోదరాంగి తులసిం బ్రియు రాలలమేలు మంగ యీ
...................... నుచు నిన్ను మునీంద్ర కన్యకల్
దిగ్ధరణీ ధరంబుల నుతింతురు నవ్వుచు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 25)

వేంకటేశ్వరుడు దేవ దేవుడైనప్పటికీ అన్నమయ్య దృష్టిలో సామాన్య మానవుడె. చిలిపివాడె. వెలదిని వేళాకోలం పట్టించె వేడుక కాడె. అలమేలు మంగ తనకు పూలుకోసి ఇమ్మని వేంకటేశ్వరుణ్ణి కోరింది. అవి నాకు కూడా అందవని అతడామెను పైకెత్తి పట్టుకొన్నాడు. ఆ పూబోణి పువ్వులు కోసుకుంది. అన్నమయ్య అందించిన ఈ భావచిత్రం ప్రశంసాపాత్రం.

అందవు కోసి యిమ్ము విరులంచును జేరలమేలుమంగ ని
న్నుం దగ గోర జెక్కులటు నొక్కిన నాకును నందవంచు న
య్యిందు ముఖి బ్రియంబలర నెత్తుచు బువ్వులు కోయజేయని
ష్యంద మరంద ఘర్మరస సంగతులబ్బెను వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 23)

**దాంపత్య మాధుర్యం :** కమల కమలనాభుడికి తగిన ఇల్లాలు. వనజ నాభుడా వనజాక్షికి తగిన వల్లభుడు. వారిది అన్యోన్య దాంపత్యం. కొరతలేకపోగా సర్వదా కుతూహలాన్ని కలిగించే వలపు పంట. ఇద్దరూ ఒకరిని విడిచి మరొకరు ఉండలేని వైనం. ఇటువంటి అన్యోన్య దాంపత్యాన్ని అన్నమయ్య అభివర్ణించిన తీరు అభినందనీయం.

తగునలమేలు మంగకును దన్మయ మందెడు నీకు మేనిలో
బగటులు బచ్చి మాటలును బచ్చెన యెచ్చరికల్ వితంకముల్
మొగముల లేతనవ్వులును మోపుల నాటులు తమ్మి తూటులున్
జగడపు బొందులున్ రతుల సంపద విందులు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 71)

వేంకటేశ్వరుడు గరుడవాహనారూఢుడై అలమేలు మంగా సమేతంగా తిరుమల వీధుల్లో ఊరేగే దృశ్యం ఊహకందేది కాదు. ఆ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు. అయినా అన్నమయ్య వర్ణించాడు. అద్భుతంగా వర్ణించాడు. ఆ ఊరేగింపు దృశ్యాన్ని పాఠకుల మనోఫలకం మీద చెరగని విధంగా ముద్రించాడు.

ఒక్కొకనాటి రాత్రి సకలోన్నతుడైన ఖగేంద్ర మూర్తిపై
నెక్కి వినోదలీల జరియించుచు నయ్యలమేలు మంగమో
మక్కున జేర్చుచున్ బహువిహారములన్ వనవీధులం బ్రియం
బెక్కువగా జెలంగు విధమేమని చెప్పుదు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 24)

దేవతలుగాని, నూతన వధూవరులుగాని గ్రామవీధుల్లో ఊరేగేటప్పుడు వారికి హారతులు పట్టడం వాడుక. అలమేలు మంగా వేంకటేశ్వరులు నిత్య నూతన పుణ్యదంపతులేగాక నిర్జరకోటికి కూడా ఆరాధింప దగిన దేవతలు. అందువల్ల వారు తిరుమల వీధుల్లో ఊరేగేటప్పుడు ప్రతి ఇంటి దగ్గర వారికి హారతి పట్టడం పరిపాటి. అన్నమయ్య ఇటువంటి హారతి పాటలు అనేకం రాశాడు. ఈ పాటల్లో 'చాంగుబళా' అనే శబ్దాన్ని పునరావృతంగా పలు పర్యాయాలు ప్రయోగించాడు. చాంగుబళా అనేది అభినందనా సూచక శబ్దం. తిరుమలేశ్వరునికి, అతని దేవేరి అలమేలు మంగకు కలిపే అభినందనా పూర్వకంగా ఇలాంటి గేయాలు అనేకం రాశాడు. శ్రీవేంకటేశ్వర శతకంలో కూడా చాంగుబళా శబ్దాన్ని ప్రయోగించి చక్కని పద్యం రాశాడు.

చాఁగుభళా జగత్పతికి ఁజాగుభళా జగదేక మాతకున్
చాఁగుభళా రమేశునకు జాగుభళా యలమేలు మంగకున్

జాగుభళా యటంచు గడు జక్కని కాంతను వీధి వీధి మీ
రేగగ నిత్తు రారతులనేక విధంబుల వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 54)

**కవితా సౌందర్యం :** అన్నమయ్య ఏది చెప్పినా ఎలా చెప్పినా ఇంపుగా సొంపుగా పెంపును తలపించే విధంగా ఉంటుంది. కవిత్వం గుభాళించి గుండెల్ని కితకితలు పెట్టే విధంగా ఉంటుంది. ఆయన సంకీర్తనల్లోనేగాక శతక పద్యాల్లో కూడా ఈ కవిత్వం పాలు అధికంగా కనిపిస్తుంది. ఉదాహరణకు 'తెప్పల నవ్వుతో' (అన్నమయ్య, శ్రీ వేంకటేశ్వర శతకం, పద్యం-46), 'చూపు కన్నులన్ గులుకుచునుండ', 'వెన్నెల నునుదీగ', 'కళలు నించిన పుత్తడి బొమ్మ' (పద్యం-33), 'శ్రీయలమేలు మంగ నీవెడ నగు మోముఁ జూచి సగి వెన్నెల చల్లిన వేంకటేశ్వరా!' (పద్యం-34) ఇలాంటి కవితాత్మక ప్రయోగాలు అన్నమయ్య పద్యాల్లో హృద్యంగా కనిపిస్తాయి. శ్రద్ధగా గమనిస్తే ఈ పద్యమంతా గుభాళించే కవిత్వం హృదయనాశికను పరవశింపజేస్తుంది.

తొలకెడు కొప్పులో నెరులొ తుమ్మెద దాటులొ చూపు వంపులొ
గులుకులొ మించి వెన్నెలలగుంపులొ శ్రీయలమేలు మంగకున్
బలుకులు పచ్చకప్పురపు బల్కులు తావులె దివ్య గంధముల్
పలుచని నవ్వులే విరుల పాన్పులు నీకును వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 62)

జ్ఞానులకైనా, అజ్ఞానులకైనా శబ్దసౌందర్యం నుంచి లభించే ఆనందం మరెక్కడ నుంచీ లభించదు. అందువల్ల కవులు, వాగ్గేయకారులు, వచనకర్తలూ కూడా అనుప్రాసకెంతో ప్రాధాన్యమిచ్చారు. అన్నమయ్య పద్యం రాసినా, పాటరాసినా హృదయాన్ని మీటేవిధంగానే ఉంటాయి. ఈ పద్యంలోని ద్విత్వ లకారానుప్రాస ఇచ్చే ఆనందాన్ని చవిచూడడం సముచితం.

చక్కని తల్లికిన్ నవరసంబుల వెల్లికి బుష్పవల్లికిం
జక్కని మోవి ముత్తియపు జల్లికి శ్రీయలమేలు మంగకున్
జెక్కులు మించుటద్దములు చేతులు క్రొత్త మెఱుంగుఁదీగలా
క్రిక్కిరి గుబ్బలే పసిడి కిన్నర కాయలు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 49)

మంగళశబ్దం హితసూచిగా మానవుల మస్తిష్కంలో నిరంతరంగా నిలిచిపోయింది. భక్తులకు, సాధు పుంగవులకు, భగవంతుడికి మంగళం చెప్పడం రివాజు. భగవంతుడికి మంగళం చెబితే భగవంతుడికి, ఆయన ఉదరంలో ఉన్న అన్ని లోకాలకు మంచి జరుగుతుందనే విశ్వాసం. మంచి జరగాలని ఆకాంక్ష. దీన్ని దృష్టిలో పెట్టుకొనే భగవంతుడికి మంగళాశాసనం చేసే ఆచారం అమలులోకి వచ్చింది. ఆళ్వార్లు, అన్నమయ్య కూడా ఈ సంప్రదాయాన్ని పాటించారు. అన్నమయ్య విశ్వమయుడైన విష్ణువుకు ఆయన వక్షంలో అధివసించే అంబుజపాణికి కలిపి ఒకేసారి మంగళం పలికాడు. ఆయన రచనల్లో పలుచోట్ల ఈ మంగళం కనిపిస్తుంది. వేంకటేశ్వర శతకంలో కూడా అలమేలు మంగా శ్రీనివాసులనుద్దేశించి అన్నమయ్య మంగళా శాసనం చేశాడు.

మంగళ మమ్మకున్ సకల మంగళ మంజుల నేత్రికిన్ జయా
మంగళమిందిరా సతికి మంగళ మీ యలమేలు మంగకున్
మంగళమందు మందు మతి మంగళమందును దేవలోక ది
వ్యాంగన లెల్లనీ సతికి నారతులిత్తురు వేంకటేశ్వరా!

(అన్నమయ్య, వేంకటేశ్వర శతకం - పద్యం - 28)

అన్నమయ్య వేంకటేశ్వర శతకంలో అడుగడుగునా కవితా సౌందర్యం మనోదృగ్గోచరమౌతుంది. శబ్ద మాధుర్యానికి కొదువలేదు. మధురభక్తి భరితమైన మనోజ్ఞ మంజుల కావ్యంగా ఈ శతకమందరినీ ఆకట్టుకొంటుంది. సామాన్యుడికి అందుబాటులో ఉండే పదాలు, సామాన్య పాఠకుడి భావనేత్రాన్ని కూడా తనవైపు మళ్ళించుకొని అతికించుకునే పద్యాల సొంపు భావకులను పరవశింపజేస్తాయి. శతకాన్ని ఆద్యంతమూ హృదయంతో చదివితే ఉపయోగపడే ఎన్నో అంశాలు తారసిల్లడం తథ్యం.

# అన్నమయ్యను అలరించిన భక్తులు

15వ శతాబ్దంలో జీవించిన భక్తశిఖామణి తాళ్ళపాక అన్నమాచార్యుడు. తాళ్ళపాకలో జన్మించి తిరుమలేశుని సేవించి ఆయన కృపకు పాత్రుడైన అమృత హృదయుడు అన్నమయ్య. వేంకటేశ్వర భక్తే ఊపిరిగా వివిధ వైష్ణవ క్షేత్రాల్లోనూ పర్యటించి అక్కడి వేల్పులను కూడా వేంకటేశ్వర పరంగానే వినుతించి వినుతికెక్కిన విభుదాగ్రణి తాళ్ళపాక అన్నమయ్య.

తొలి తెలుగు వాగ్గేయకారుడుగా విలసిల్లి భక్తి వెలుగులను నేల నాలుగు చెరగులకు పంచిన పరమ పూజ్యుడు పద కవితా పితామహుడు. ఒక వ్యక్తి ఎవరిని గురించి భావిస్తే భావించబడేవారి వ్యక్తిత్వ ప్రభావం భావించేవారిమీద పడుతుంది. అందుకే జ్ఞానుల చరిత్రలను నేర్చుకొమ్మని యయాతి మహారాజు తన కుమారుడైన పూరుడికి హితవు చెప్పాడు.

కం॥ ఎరుక గలవారి చరితల
గరచుచు సజ్జనుల గోష్ఠి కదలక ధర్మం
బెరుగుచు నెరిగిన దానిని
మరువకనుష్ఠించునది సమంజస బుద్ధిన్

(శ్రీమదాంధ్ర మహాభారతం 1-3-203)

ఆకాశం నుండి క్రిందపడే నీటికి రంగు, రుచి, వాసన ఉండవు. ఆ నీరు ఏ మట్టిమీద పడుతుందో ఆ మట్టిరంగు, రుచి, వాసన ఆ నీటికి సంక్రమిస్తాయి. అందువల్లనే ఉత్తమజన సంపర్కం అందరికీ అవసరమని ఆర్యోక్తి. కాబట్టి భక్తులను గూర్చి భావిస్తే వారి వ్యక్తిత్వ ప్రభావం భావించేవారిమీద తప్పక పడి తీరుతుంది. అందుచేతనే పూర్వభక్తులను స్మరించే సంప్రదాయం భాగవత ధర్మంలో భాగమైంది. అన్నమయ్యకు పూర్వభక్తులెందరో తమ పూర్వ భక్తులను స్మరించారు. ఆళ్వారుల పాశురాల్లోనూ భక్తజన సంస్మరణ గోచరిస్తుంది. అణువణువునా భక్తితో పులకరించే అన్నమయ్య మాత్రం పూర్వభక్తులను స్మరించ కుండా ఎలా వుండగలడు? స్మరించాడు తన్మయం చెందాడు. అన్నమయ్యను

అలరించి ఆయన కీర్తనల్లో స్థానం సంపాదించిన భక్తులను గురించి మనం కూడా ఒకసారి స్మరిద్దాం. తద్వారా మన మనసుల్ని కొంత సేపయినా పవిత్రంగా ఉండేట్టు చూసుకుందాం.

వైష్ణవాచారపరులంటే అన్నమయ్యకు అపార ప్రేమ. అందుకే వారితోటి సహవాసం సంధ్యవార్చడం వల్ల కలిగే సత్ఫలితాన్నిస్తుందంటాడు. రామానుజుల మతం వారితో పొత్తు కూడా సంధ్యవార్చడం వంటిదే. పరమ భాగవత పదసేవనమే తమకు సంధ్య అని అన్నమయ్య చెప్పడం భాగవతులపట్ల అతనికి గల ఎక్కువ మక్కువను ఆవిష్కరిస్తుంది. అన్నమయ్య ఈ ఆలోచనలను ఆయన పదపాదాల్లో పరికించవచ్చు.

సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమె మాసంధ్య

మతిరామానుజ మతమే మాకును
చతురత మెఱసిన సంధ్య
పరమ భాగవత పద సేవనమే
సరవినెన్న మాసంధ్య (1-10)

విష్ణు దాసులే మిక్కిలి పుణ్యాత్ములని తక్కిన వారందరూ విష్ణు కృపకు పాత్రులు కాజాలరని అన్నమయ్య విశ్వాసం. తన ఈ ప్రగాఢ విశ్వాసాన్ని వేంకటేశునికి నివేదించిన విధం స్మరణీయం.

మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి
తక్కిన వారు మీ కృప దప్పిన వారు హరి (1-411)

హరి సంకీర్తనాపరులే తమ దైవాలని అన్నమయ్య శ్లాఘించాడు. ఎందుకు వారు దైవాలంటే వారి చెవులెప్పుడూ విష్ణు కథలనే వింటుంటాయి. వారి చూపులెప్పుడూ హరినే చూస్తుంటాయి. వారెప్పుడూ విష్ణువును గురించే మాట్లాడుతూ ఉంటారు. వారి ఆలోచనలన్నీ ఆ ధరణీధరుని చుట్టే పరిభ్రమిస్తూ ఉంటాయి. చేతులనెప్పుడూ విష్ణు కైంకర్యానికే వినియోగిస్తూ ఉంటారు. వేంకటేశ్వరుని మతంపట్ల విపరీతమైన విశ్వాసం వీరికి. వీరెవరో కాదు

శ్రీవైష్ణవులు. వీరు తమ ఇంద్రియాలను ఉపేంద్రునికే అర్పించుకున్నారు. అతడు తప్ప అన్యులెవ్వరూ వీరికి కాబట్టరు. అందుకే వారు దైవ స్వరూపులు. అన్నమయ్యకే కాదు మనకందరికీ కూడా. ఇటువంటి భక్తి తత్పరులు కాబట్టే వీరు అన్నమయ్యను అలరించారు. ఈ విషయాలను తెలియజేసే అన్నమయ్య పదాన్ని భక్తజనుల దివ్యపథాన్ని అవధరించండి.

మరిగి వీరెపో మా దైవంబులు
కెరలిన హరి సంకీర్తన పరులు

వినియెడి వీనులు విష్ణుకథలకే
పనిగొందురు మా ప్రపన్నులు
కనియెడి కన్నులు కమలాక్షు నియం
దనువు పరతురటు హరి సేవకులు

పలికెడి పలుకులు పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
తలచేటి తలపులు ధరణీధరు పై
తలకొలుపుదు రాతదియ్యులు

కరముల శ్రీపతి కైంకర్యములే
మురియుచు జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీ వేంకటేశ్వరు మతమే
సిరుల నమ్ముదురు శ్రీ వైష్ణవులు (1-402)

అన్నమయ్య స్మరించిన భక్తుల్లో పౌరాణిక భక్తులున్నారు. చారిత్రక భక్తులూ ఉన్నారు.

అన్నమయ్య ఆలోచన అనంత శయనుని అపారకృప మీదికి వెళ్ళింది. ఆయన అంతరంగం ద్రవించింది. పాటగా పల్లవించింది. భక్తవత్సలుడైన భగవంతుడు భక్తులకెంత సులభంగా అందుబాటులో ఉంటాడో? ఆయనకు లింగభేదంగాని, వయోభేదంగాని, రూపభేదంగాని ఏవీ ఉండవు. ఆయన దృష్టిలో అందరూ ఒక్కటే. ఆయనకు కావల్సిందల్లా భక్తి ఒక్కటి మాత్రమే. పిల్లవాడని

పెడచెవిని పెట్టక ప్రహ్లాదుని మొర విన్నాడు. సముచితంగా స్పందించాడు. అడవి జంతువని గజేంద్రుణ్ణి అలక్ష్యం చెయ్యలేదు. మొర విన్న వెంటనే వచ్చాడు. మకరిని ఖండించి కరిని కాపాడాడు. ఆడువారి మాటలకేమి లెమ్మని అలక్ష్యం చెయ్యకుండా ద్రౌపది ఆర్తిని తక్షణమే పోగొట్టాడు. ఈ నిరుపేదవల్ల ఒరిగేది ఏముంది లెమ్మని ఉదాసీనపరచకుండా కుచేలునికి సంపదలను సమకూర్చాడు. భక్తులెవ్వరైనా ఆర్ద్రభక్తితో ఆక్రందిస్తే వారందరినీ ఇట్టే అనుగ్రహించే వరదుడు శ్రీ వేంకటేశ్వరుడు. ఈ పాటలో నలుగురు భక్తులను గురించి అన్నమయ్య తెలియజేశాడు. వీరు ఒక్కొక్కరు ఒక్కొక్క కోవకు చెందినవారు. మొత్తానికి అందరూ దుర్బలులే. వీరిని ఆదరించిన స్వామి అనుగ్రహం అపారం కదా! అని అన్నమయ్య ఆలోచన. ఇది ఆయన రచించిన కీర్తన.

సులభుడు మధుసూదనుడు మన
మెలమి నమ్మిన నిట్టే సుండీ

పడుచు మాటనకా ప్రహ్లాదు నెదుట
పొడచూపె నాది పురుషుడు
అడవి దేహనక ఆదంతి మొఱకును
తడవి కాచిన దైవము సుండీ

ఆడు మాటలనక అంతలో ద్రౌపదిని
వాడిమి గాచిన వరదుడు
పోడిమి బేదనక పొందిన కుచేలుని
వీడె సంపదిచ్చె విష్ణుడు సుండీ

వీరు వారనకిదె వేడిన వరములు
సారెకు నిచ్చిన సర్వేశుడు ....
మేరతో లోకముల మెఱసె నిప్పుడును
యీరీతి శ్రీవేంకటేశుడే సుండీ (1-394)

మంత్రప్రభావాన్ని గురించి అన్నమయ్య ఆలోచించాడు. "మననాత్ త్రాయతే ఇతిమంత్రః" అని మంత్రశబ్ద వ్యుత్పత్తిని ఆకళింపచేసుకున్నాడు.

విష్ణువుకు సంబంధించిన మంత్రాలనేకం. ఎవరెవరు ఏయే మంత్రాన్ని జపించి ఎంతటి సత్ఫలితాన్ని పొందారో ఒకసారి గుర్తు చేసుకున్నాడు. తను గుర్తు చేసుకుంటున్నట్టే లోకానికి కూడా గుర్తుచేశాడు. నారాయణమంత్రం నారదుణ్ణి దేవర్షిగా రూపొందించింది. దేవర్షులలో నారదుడు నేనే అని కృష్ణుడు శ్లాఘించేంతగా నారదునివ్యక్తిత్వం ఎదిగేట్టుచేసింది. "దేవర్షీణాంచ నారదః" (భగవద్గీత 10-26), ప్రహ్లాదుడి వల్లనే నరసింహావతారం వచ్చింది. నారసింహ మంత్రమూ వచ్చింది. దైత్యుల్లో ప్రహ్లాదుణ్ణినేనే అని కృష్ణుడు చెప్పే విధంగా అతని గొప్పతనం విలసిల్లింది. 'ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం' (భగవద్గీత 10-30), విభీషణుడు శత్రుపక్షం వాడైనప్పటికీ రామ మంత్రాన్నుపాసించి రాముని శరణుజొచ్చి లంకాభిషిక్తుడయ్యాడు. ధ్రువుడు బాలుడైనప్పటికీ వాసుదేవ మంత్రాన్ని జపించి విష్ణుసాక్షాత్కారం పొందాడు. విష్ణుదేవుని అనుగ్రహంచేత ధ్రువపదాన్నికూడా పొంది ప్రకాశిస్తూఉన్నాడు. పార్థుడు పొందిన విజయాలన్నిటికీ పార్థసారథి కృపే కారణం. ఆయన కృపను పొందేందుకు అర్జునుడు అవలంబించిన మార్గం కృష్ణనామ స్మరణే. శుకుడు సాటిలేని మేటి బ్రహ్మచారి. అపారశక్తి సామర్థ్యాలు కలవాడు. స్వయంగా సూర్యమండలాన్ని ఛేదించుకొని ఊర్ధ్వలోకాల్లో ప్రవేశించగలిగిన దిట్ట ఈయన. ఇతనికి అబ్బిన ఇంతటి ప్రభావానికి కారణం ఈ మహర్షి అనుసంధించిన విష్ణు మంత్రమే. ఇన్ని మంత్రాలకూ లక్ష్యము పరబ్రహ్మ అయిన మహా విష్ణువే. శ్రీవేంకటేశ్వరుడే. అందువల్లనే ఈ మంత్రాలన్నీ కూడా వేంకటేశ్వర మంత్రంలోనే ఆవహించి ఉన్నాయని అన్నమయ్య స్పష్టం చేశాడు. నారదుడు, ప్రహ్లాదుడు, విభీషణుడు, ధ్రువుడు, అర్జునుడు, శుకుడు వీరిని ఈ కీర్తనలో అన్నమయ్య స్మరించాడు. మనచేత కూడా స్మరింపచేస్తున్నాడు. ఒకవైపు ఈ ఆదర్శమూర్తుల జీవితాలను గుర్తుచేస్తూనే మరోవైపు వీరు ఉపాసించిన మంత్రాలను, వీరి ఉపాసనా విధానాలను గుర్తుచేసి భక్తులకు మార్గనిర్దేశం కావించిన అన్నమయ్య శేముషి ఎంతైనా కొనియాడదగి ఉంది. ఇదే అన్నమయ్య నోట వెలువడిన ఆ కీర్తన.

అన్ని మంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకు గలిగె వెంకటేశు మంత్రము

నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరె బ్రహ్లాదుడు నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము
వేరె నాకు గలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపించె
నంగవించె గృష్ణమంత్ర మర్జునుడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకునబ్బె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

యిన్ని మంత్రములకెల్ల యిందిరానాథుడే గురి
పన్నిన దిదియే పరబ్రహ్మ మంత్రము
నన్నుగావ కలిగెబో నాకు గురుడియ్యగాను
వెన్నెల వంటిది శ్రీ వెంకటేశు మంత్రము ॥అన్ని॥ (4-438)

విష్ణు భక్తుల్లోకెల్లా అధికతముడుగా అనుపమ యశస్సును ఆర్జించినవాడు హనుమంతుడు. రఘునాథ కీర్తన వినడం, రామనామ స్మరణ చేయడం, రాక్షస సంహారం గావించడం ఈయన ప్రధాన కృత్యాలు. తనను ఆశ్రయించిన వారిలో రామభక్తిని రగిలించి మోక్షపథంలో నడిపించడం, వారికి అన్ని రక్షలు తానే కావడం ఆంజనేయుని ప్రత్యేకత. అంతటి మహనీయుడు కాబట్టే అన్నమయ్య అంతరంగంలో సులభంగా చోటు సంపాదించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో హనుమత్సంకీర్తనల సంఖ్య అధికంగానే కనిపిస్తుంది. అందరిలోనూ హనుమంతుడే అధికుడని అన్నమయ్య సుస్పష్టం చేశాడు.

హనుమంతుడు జన్మించేటప్పుడే బంగారు కుండలాలతోనే జన్మించినట్టు అన్నమయ్య అభిప్రాయం. అది హనుమంతుని జన్మ ప్రత్యేకతకు సంబంధించిన అంశం. గొప్ప ప్రతాపాన్ని ప్రదర్శిస్తూ తన పెద్దతోక పైకెత్తిన పరాక్రమశాలి ఈయన. సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి అల్లకల్లోలం చేసిన అనుపమ సాహసికుడు. తనను గూర్చి తెలియజేసేందుకు విశ్వరూపాన్ని ధరించి ధ్రువమండలం అంత ఎత్తుకు ఎదిగిన మహాకాయుడీ మారుతి. తన భక్తి తేజంతో దాసులను కాపాడే స్వభావం గలవాడు. ఇంతటి మహిమోన్నతుడైనప్పటికీ తనను

వేంకటేశ్వరుని బంటుగా లోకానికి అభివ్యక్తం చేసుకున్న ఆదర్శ భక్తుడు ఈ హనుమంతుడు. రామభక్తివల్ల మహోన్నత మహిమను పొందినప్పటికీ హనుమంతుడు ఎంతో అణకువను ప్రదర్శించాడు. మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవ సన్నిధౌ (నాకంటే అల్పులు సుగ్రీవుని దగ్గర ఎవరూ లేరు) అని సీతకు తెలియజేశాడు.

అందరిలోనా నెక్కుడు హనుమంతుడు
కందువ మతంగగిరికాడి హనుమంతుడు

కనక కుండలాలతో కాపీనము తోడ
జనియించినాడు యీ హనుమంతుడు
ఘన ప్రతాపముతోడ కఠిన హస్తాలతోడ
పెనుతోక యెత్తినాడు పెద్ద హనుమంతుడు

తివిరి జలధిదాటి దీపించి లంకయెల్లా
అవల యివలనేసె హనుమంతుడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువ మండలము మోచె దొడ్డ హనుమంతుడు

తిరమైన మహిమతో దివ్య తేజముతోడ
అరసి దాసులగాచీ హనుమంతుడు
పరగ శ్రీవేంకటేశుబంటై సేవింపుచు
వరములిచ్చీ బొడవాటి హనుమంతుడు (2-207)

అన్నమయ్య పౌరాణిక భక్తులనే గాక చారిత్రక పురుషులను కూడా సంస్మరించిన విషయాన్ని ఇంతకు ముందే చెప్పుకున్నాం. అన్నమయ్య తన పూర్వులైన ఆళ్వారులను కూడా సముచితంగా స్మరించాడు. ఆళ్వారులు తమిళదేశంలో వైష్ణవధర్మవ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. వారి విష్ణుభక్తి అనుపమం. అపారం. వారందరినీ విష్ణువు అనుగ్రహించిన తీరు కూడా మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోదగ్గ విధంగా ఉంది. అందుకే వారిని అన్నమయ్య స్మరించాడు. విష్ణుదేవుడు స్వయంగా నమ్మాళ్వారుకు సాక్షాత్కరించి వేద రహస్యాలు బోధపడేట్టు చేశాడు. దారిదోపిడీ చేసి భాగవత సమారాధన కొనసాగించిన తిరుమంగై

యాళువారుకు నారాయణమంత్రాన్ని ఉపదేశించాడు. గోదాదేవి ధరించి ఇచ్చిన మాలలను ఎంతో ప్రియంగా ధరించి ఆమెను ఆండాళ్‌గా అభినుతి కెక్కేట్టు చేశాడు. ఆండాళ్‌ను స్మరించేటప్పుడు పెరియాళువారిబిడ్డ అనే ప్రయోగంతో పెరియాళువారిని కూడా స్మరించడం విశేషం. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి కొనియాడిన విధం హృద్యం. ఇదిగో ఆ కీర్తన.

వాడె వెంకటేశుడనేవాడె వీడు
వాడి చుట్టు గైదువ వలచేతివాడు

కారిమార సుతుని చక్కని మాటలకు జొక్కి
చూరగా వేదాల గుట్టు చూపినవాడు
తీరని వేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమి కూటికాసపడ్డవాడు

పెరియాళువారి బిడ్డ పిసికిపై వేసిన
విరుల దండల మెడ వేసినవాడు

.................................

................................." (1-121)

అన్నమయ్య కీర్తనల్లో శఠగోప మునికి సంబంధించిన ఒక కీర్తన గూడా కనిపిస్తుంది. ఇందులోని శఠగోపముని నమ్మాళ్వారైనా కావచ్చు లేదా అహోబిల మఠ స్థాపకులైన ఆదివన్ శఠగోపయతీంద్రులైనా కావచ్చు.

ఈయన భక్త సులభుడు. శిష్య సులభుడు. ఈయనకు హరి యెప్పుడూ తోడు నీడగా ఉంటాడు. ఈయన దొరముని. అంటే మునిశ్రేష్ఠుడని అభిప్రాయం. ఈయన కైవల్యానికి సోపాన మార్గంగా, విరజానదిని దాటించే నావగా, వేదాంతసారంగా విరాజిల్లుతున్నాడు. ఈయన సుజ్ఞానదీపం. జగతీతేజం. భవాబ్ధికి నావ. శ్రీరంగంలో వెలసిన రంగనాథస్వామికి, కాంచీ నగరంలో నెలకొన్న వరదరాజస్వామికి, వేంకట గిరి మీద విరాజిల్లే వేంకటేశ్వరునికి, అహోబిల క్షేత్రంలో ప్రకాశించే నరసింహునికి ఈ శఠగోపయతి మిక్కిలి తాత్పర్యంతో మెలిగేవాడు. ఆ మహనీయుడు అన్నమయ్యను ఆకట్టుకున్నాడు.

మనః పదంలోనూ, మధురపదం లోనూ పరిమళించాడు. ఇదిగో ఆ పదం మీ దృష్టి పదానికి

చూడుడిందరికి సులభుడు హరి
తోడు నీడయగు దొరముని యితడు

కైవల్యమునకు గనకపు తాపల
త్రోవై శ్రుతులకు దుదిపదమై
పావన మొక రూపమై విరజకు
నావై యున్నాడిదె యితడు

కాపాడగ లోకములకు సుజ్ఞాన
దీపమై జగతికి దేజమై
పాపాలడపగ భవపయోధులకు
తేపై యున్నాడిదే యితడు

కరుణానిధి రంగపతికి గాంచీ
వరునకు వేంకటగిరి పతికి
నిరతి నహోబల నృకేసరికి ద
త్పరుడగు శఠగోపముని యితడు (1-117)

వైష్ణవులలో ఆళ్వారుల తర్వాత పేర్కొదగినవారు ఆచార్యులు. వారిలో ఆళవందార్ తర్వాత పేర్కొదగిన వారు శ్రీరామానుజులవారు. ఈయన బ్రహ్మ సూత్రాలకు, ఉపనిషత్తులకు, భగవద్గీతకు భాష్యం రాసి భాష్యకారులనే ప్రసిద్ధి పొందారు. శ్రీవైష్ణవవ్యాప్తికి ఎనలేని సేవచేశారు. ఆదిశేషుని అంశంగా కొనియాడ బడే ఈయన అన్నమయ్య అంతరంగంలోనూ ప్రవేశించాడు. అన్నమయ్య భక్తికి, సన్నుతికి పాత్రుడయ్యాడు. ఊర్ధ్వ మార్గాలన్నీ నశిస్తున్న ఈ కలియుగంలో సద్గతి చూపవచ్చిన సద్గురు దైవమని సంకీర్తనాచార్యుడు ఈయనను సన్నుతించాడు.

ఎందరినో వైష్ణవులుగా మార్చిన ఘనత ఈయనది. తిరుమణి, చక్రాంకిత ముద్రలు, ప్రపన్నులకు నియమాలు ఈయనే ఏర్పాటు చేశాడు. అష్టాక్షరీ మంత్రాన్ని అందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా బోధించాడు. వేదాల

రహస్యాలు వివరించాడు. శరణాగతి విశిష్టతను చాటి చెప్పాడు. కరుణతో అందరికీ మోక్షమార్గం చూపాడు. అటువంటి మహానుభావుణ్ణి కృతజ్ఞతా పూర్వకంగా స్మరించడం వైష్ణవులకు వాడుక. అన్నమయ్యాది భక్త శిఖామణులకు వేడుక. ఇదిగో ఆ అన్నమయ్య సంకీర్తన.

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతడే చూపె ఘన గురుదైవము

యీతని కరుణనేకా యిలవైష్ణవుల మైతి
మీతని వల్లనే కంటి మీ తిరుమణి
యీతడేకా వుపదేశమిచ్చె నష్టాక్షరి మంత్ర
మీతడే రామానుజులు యిహపర దైవము

వెలయించె నీతడేకా వేదపు రహస్యములు
చలిమి నీతడే చూపె శరణాగతి
నిలిపినాడీతడేకా నిజ ముద్రా ధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము

నియమములీతడేకా నిలిపె బ్రపన్నులకు
దయతో మోక్షము చూపె దగనీతడే
నయమై శ్రీ వేంకటేశు నగ మెక్కె వాకిటను
దయజూచీ మమ్ము నిట్టే తల్లితండ్రి దైవము (2-372)

వేంకటేశ్వరుడు ఒక్కడే. ఆయన భక్తులు అనేకులు. వారితోటి ఆయన సంబంధం ఆర్ద్రం. కుమ్మర దాసుడైన కురువరతినంబికి వేంకటేశ్వరుడు అత్యంత గౌరవాన్ని ఆపాదించాడు. చక్రవర్తి అర్చించిన బంగారు పూలను పక్కకు నెట్టి నంబి సమర్పించిన మట్టి పువ్వులను ప్రేమతో స్వీకరించాడు. తొండమాన్ చక్రవర్తికి అనేకసార్లు అనేకవిధాలుగా సహాయంచేసి ఆలయం నిర్మించిన ఘనత ఆయనకు దక్కేట్టు చేశాడు. తనకోసం నందనవనము, తటాకము నిర్మింప సమకట్టిన అనంతాళ్వార్ కైంకర్యంలో అయాచితంగా పాలుపంచుకున్నాడు. వెట్టికే మన్ను మోశాడు. తిరుమలనంబి పాపవినాశనతీర్థం నుంచి అభిషేక జలం తెస్తుండగా వ్యాధుని రూపంలో వచ్చి కుండకు రంధ్రం చేసి నీరు త్రాగి అతన్ని అనుగ్రహించాడు. అతనికి బాధ కలగకుండా వుండేందుకు ఆకాశగంగను

వేంకటేశ్వరుడే స్వయంగా ఏర్పరచాడు. కంచిలో వరదరాజస్వామి కైంకర్యంలో నిమగ్నుడై ఉన్న తిరుకచ్చినంబిని తన దగ్గరకు రప్పించుకున్నాడు. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకొని అన్నమయ్య వేంకటేశ్వరునికి ఇప్పుడు చెప్పుకున్న ఆయన భక్తులకు ఉన్న సంబంధాన్ని ఉటంకిస్తూ హృదయంగమ గేయాన్ని రచించాడు. ఈ గేయం అనుదిన అనుసంధేయం. చిత్తగించండి.

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడు వాడు

కుమ్మరదాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ॥కొండ॥

అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమలనంబితోడుత
నిచ్చ నిచ్చ మాటలాడినొచ్చినవాడు ॥కొండ॥

కంచిలోన నుండ దిరుకచ్చినంబి మీద గరు
ణించి తన యెడకు రప్పించినవాడు
యెంచ నెక్కుడైన వేంకటేశుడు మనలను
మంచివాడై కరుణ బాలించిన వాడు ॥కొండ॥ (1-151)

రూపం ధరించిన భక్తే అన్నమయ్య. అందువల్ల భక్తులంటే ఆయనకు ఎక్కువ అభిమానం. వారి ఘనతను కొనియాడడం పట్ల ఎంతో ఆసక్తి వీలు చిక్కినప్పుడల్లా భక్తజన సంస్మరణ చేయడం ఆయనకు పరిపాటి. అన్నమయ్యను అలరించిన భక్తులను గురించి తెలియజేసే కీర్తనలనేకం ఉన్నప్పటికీ కొన్నిటిని మాత్రమే ఇక్కడ స్పృశించడం జరిగింది. కొందరు భక్తులను గురించి మాత్రమే ప్రస్తావించడం జరిగింది. అన్నమయ్యను అలరించిన భక్తులు అందరినీ అలరించిన వారే. అన్నమయ్య ద్వారా ఆయన స్మరించిన భక్తుల ద్వారా భగవత్తత్త్వానికి చేరువయ్యే ప్రయత్నం చేయడం సమంజసం.

# అన్నమయ్య - హనుమత్సంకీర్తనలు

"మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధి మతాం వరిష్ఠం
వాతాత్మజం వానరయూధ ముఖ్యమ్
శ్రీరామ దూతం శిరసా నమామి"

"యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్
తత్ర తత్ర కృత మస్తకాంజలిమ్
భాష్పవారి పరిపూర్ణ లోచనమ్
మారుతిం నమత రాక్షసాంతకం"

అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు. భక్తాగ్రేసరుడు. భక్త విధేయుడు. సంకీర్తనాచార్యుడుగా, పద కవితా పితామహుడుగా సన్నుతికెక్కిన సహజ వాగ్గేయ కారుడు. ఆళ్వారుల పాశురాల అంతరార్థాన్ని జీర్ణింప జేసుకున్న వైష్ణవాచార్యుడు. తెలుగుగడ్డమీద వైష్ణవం వ్యాపించేందుకు ఎనలేని సేవచేసిన కర్మయోగి. వైదిక వంశంలో జన్మించినప్పటికీ వైష్ణవంతో తాదాత్మ్యం చెందిన తపస్వి. సంస్కృతాంధ్ర తమిళాది భాషలలో ప్రావీణ్యం సంపాదించిన ప్రాజ్ఞుడు.

అన్నమయ్య వేంకటేశ్వరుని పేరుమీదుగా 32వేల కీర్తనలు రచించినట్టు ప్రతీతి. వాటిలో భగవంతుని కీర్తనలేగాక భక్తుల కీర్తనలు కూడా చోటు చేసుకున్నాయి. వైష్ణవం భగవంతునికెంత ప్రాధాన్యమిస్తుందో భక్తునికి కూడా అంతే ప్రాధాన్యమిస్తుంది. అనుకరించి ధరించడమన్న అంశం ప్రాతిపదికగా భక్తులను అనుకరించి భాగవత జీవనం సాగించడం వైష్ణవులకెంతో ఇష్టం. జ్ఞానుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని తదనుగుణంగా జీవనం సాగించడం పరమోత్కృష్టమని భారతం బోధించింది.

"ఎరుకగలవారి చరితలు
గరచుచు సజ్జనుల గోష్ఠి కదలక ధర్మం
బెరుగుచు నెఱిగిన దానిని
మరవకనుష్ఠించునది సమంజస బుద్ధిన్"

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఆదిపర్వం, 3-203)

జ్ఞానులైన భక్తులను పదే పదే స్మరించి వారినుంచి ఉత్తేజం పొందడం భక్తులకు పరిపాటి. ఆళ్వారులు కూడా పూర్వ భక్తజన సంస్మరణచేశారు. వారినాదర్శంగా పెట్టుకొని పురోగమించిన అన్నమయ్య కూడా చాలామంది భక్తులను స్మరించాడు. తన కీర్తనల్లో వారి ఘనతను కీర్తించాడు. అన్నమయ్య కీర్తించిన భక్తుల్లో పౌరాణికులూ ఉన్నారు. చారిత్రకులూ ఉన్నారు. ప్రహ్లాదుడు, గజేంద్రుడు, ద్రౌపది, కుచేలుడు, నారదుడు, విభీషణుడు, ధ్రువుడు, అర్జునుడు, శుకుడు, హనుమంతుడు మొదలైనవారు పౌరాణిక భక్తులు. పన్నిద్దరాళ్వారులు, రామానుజస్వామి, కురువరతినంబి, తొండమాన్ చక్రవర్తి, అనంతాళ్వారు, తిరుమలనంబి, తిరుక్కచ్చినంబి, ఆదివన్ శఠగోపయతి మొదలైనవారు చారిత్రక భక్తులు. వీరిలో హనుమంతునికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి అన్నమయ్య చాలా కీర్తనలు రచించాడు. వాటిలో కొన్నిటిని పరిచయం చేయడమే ఈ వ్యాస పరమావధి.

అన్నమయ్య వేంకటేశ్వర సేవకు అంకితమైనట్టే రఘువీరుని సేవకు అంకితమైన మహాభక్తుడు హనుమంతుడు. పురాణ పురుషులు కొందరు చిరంజీవులుగా ప్రసిద్ధులు. వారు అశ్వత్థామ, బలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు, ధ్రువుడు. ఈ మహనీయులలో హనుమంతుడు కూడా చోటు సంపాదించడం గమనార్హం. హనుమంతుడు మాట తీరు తెలిసినవాడు. స్నేహశీలి. శత్రుదమనుడు. అతని ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుడే హనుమంతుని గొప్పతనాన్ని లక్ష్మణుడికి తెలియజేశాడు.

శ్లో॥ తమభ్య భాష సౌమిత్రే సుగ్రీవ సచివం కపిమ్
వాక్యజ్ఞం మధురైర్వాక్యైః స్నేహయుక్త మరిందమమ్ ॥
(కిష్కిందకాండ - తృతీయ సర్గః - 27 శ్లోకం)

లక్ష్మణా! సుగ్రీవుని మంత్రియైన ఈ వానరుడు మాటలు తెలిసినవాడు. స్నేహము కలవాడు. శత్రువులను నశింపజేయువాడు. అట్టి ఈతనితో మధురమైన మాటలతో మాటలాడుము.

హనుమంతుడు మహాజ్ఞాని, మహాబలాఢ్యుడు. గొప్ప మహిమాన్వితుడైన ప్పటికీ అణకువతో బంటుగానే జీవనం సాగించాడు. అశోకవనంలో సీతాదేవిని దర్శించినపుడు హనుమంతుడామెకు తెలియజేసిన మాటలు అతని అణకువను అభివ్యక్తం చేస్తాయి.

శ్లో॥ మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్రవనౌకసః
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ
(సుందరకాండ - 39వ సర్గ - 38వ శ్లోకం)

ఆ వానరులలో కొందరు వానరులు నాకంటే గొప్పవారు. కొందరు నాతో సమానులు. నాకు తీసిపోయేవాడు ఒక్కడూ సుగ్రీవుని దగ్గర లేడు.

ఆదర్శ సేవకుడెలా ఉండాలో తన గుణగణాల ద్వారా జీవతం ద్వారా లోకానికి చాటిన మేటి బంటు హనుమంతుడు. ఆంజనేయుణ్ణి దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య బంటు ఎలా ఉండాలో తెలియజేశాడు. చెప్పినవి చేయడం, ఓర్పు, నేర్పు బంటుకుండవలసిన మంచి లక్షణాలు. తేట తెలుగు మాటలలో అన్నమయ్య రచించిన ఈ కీర్తన గమనిస్తే బంటు స్వరూప స్వభావాలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి.

అటి ముటి హనుమంతుడట్టి బంటు
వెలుపులేని రఘువీరునికి బంటు ॥పల్లవి॥

యేలికను దైవముగానెంచి కొల్చేవాడే బంటు
తాలిమి గలిగిన యాతడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాడే బంటు
వేళగాచుక వుండేటి వెరవరే బంటు ॥అటి॥

తను మనోవంచన లెంతటా లేనివాడే బంటు
ధనము పట్టున శుద్ధాత్మకుడే బంటు
అనిశము నెదురు మాటాడనివాడే బంటు
అనిమొన దిరుగని యతడే బంటు ॥అటి॥

చెప్పినట్లనే నడిచిన యాతడే బంటు
తప్పులేక హితుడైన నాతడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలగువాడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు ॥అతి॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-278)

కౌపీన, కనక కుండలాలతో జన్మించడం హనుమంతుని ప్రత్యేకతను చాటుతుంది. సీత కోరికమీద విశ్వరూపం చూపి ధ్రువమండలముకంటె ఎత్తుకు ఎదగడం అతని గొప్పదనానికి గుర్తు. ఈ రెండు అంశాలను అన్నమయ్య 'అందరిలోనా నెక్కుడు హనుమంతుడు' అనే కీర్తనలో ప్రస్తావించాడు.

"కనక కుండలాలతో కౌపీనముతోడ
జనియించినాడు యీ హనుమంతుడు"
"వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుడు"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 2-207)

అనుపమ ప్రతాపవంతుడు హనుమంతుడు. ఆయన విజృంభణకు ఎదురు ఉండదు. రాక్షసులను సంహరించడంలో అతనికతడే సాటి. ఆంజనేయుడు ఎటువైపు చూచినా రాక్షసులతనివల్ల నశిస్తారని అన్నమయ్య అభిప్రాయం. మారుతి మహిమాన్విత ప్రతాపాన్ని అన్నమయ్య వర్ణించిన తీరు అద్భుతం. అనితర సాధ్యం.

"అదివో నీ ప్రతాపము హనుమంతా
యెదురు లేదు నీకు నెక్కడా హనుమంతా

యెత్తిన నీ కుడిహస్తమిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీ యెడమచేతి పిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా ॥అదివో॥

నలియ దొక్కిన నీవున్నతపు బాదముకింద
నలమటించే రరులు హనుమంతా
చలవట్టి నీవు జంగచాచిన పాదహతిని
బలు దానవులు భంగపడిరి హనుమంతా ॥అదివో॥

వడి నీవు మీదికి వాల మల్లార్చిన
అడగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీ వేంకటేశు పంపున నీవు గెల్వగ
బెడిదమై పొగడేరు పెద్ద హనుమంతా"

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 3-500)

హనుమంతుడెంత అసాధారణుడో అతని విద్యాభ్యాసం కూడా అంత అసాధారణం. సూర్యుడు మహా విద్యాధికుడు. ఒకచోట నిలువని అతని దగ్గర విద్య నేర్చుకోవడమంటే సామాన్యమైన పనికాదు. తన శరీరాన్ని పెంచి నభో మార్గంలో సాగే సూర్యుని వెంట వెళుతూ విద్యనభ్యసించాడు. ఇక్కడ అతని పట్టుదల, ఏకాగ్రత, కుశాగ్రబుద్ధి మెచ్చుకోదగ్గవి. సూర్యుడి దగ్గర విద్య నేర్చుకొన్న హనుమంతుడు అవసరమైతే సూర్యుణ్ణి కూడా మించిపోయే విధంగా తన శరీరాన్ని పెంచుకొంటాడు. సూర్యచంద్రులు అతనికి మొలగంటలయ్యే విధంగా చుక్కలు మొల పూసలయ్యేవిధంగా ఎంతో ఎత్తుకు పెరుగుతాడు. హనుమంతుని విద్యాభ్యాస దృశ్యం, మహోన్నతంగా పెరిగిన దృశ్యం, అన్నమయ్య కళ్ళలో కదలాడాయి. కమ్మని గేయంగా రూపుదిద్దుకొన్నాయి.

"అరుదీ కపీంద్రుని యధిక ప్రతాపము
సురలకు నరులకీ సుద్దులెందు గలవా

వుదయా చలము మీది నొక్క జంగ చాచుకొని
వుదుటున నపరాద్రి నొక్క జంగ జాచుకొని
తుద సూర్య మండలముతోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివె బెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

వొక్క మొలగంట చంద్రుడొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్ల బెరిగెను పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

పడికిలించిన చేత బిరుదుల పండ్ల గొల
తడయక కుడిచేత దశ దిక్కుల
జడియక శ్రీ వేంకటేశ్వరుని మన్నన బంటు
బెడిదపు మహిమల పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-470)

అందరి ఆపదలనూ బాపేవాడు శ్రీరాముడు.

శ్లో॥ ఆపదామపహర్తారం
ధాతారం సర్వ సంపదాం
లోకాభిరామం శ్రీరామం
భూయో భూయో నమామ్యహం

అని శ్రీరాముని కొనియాడతారు. అటువంటి శ్రీరామ చంద్రుణ్ణి కూడా హనుమంతుడు ఆపదనుంచి రక్షించాడు.

మొదటిసారి సీతాదేవి క్షేమవార్తను రాముడికి చెప్పడం. రెండవసారి సంజీవపర్వతం తెచ్చి లక్ష్మణుణ్ణి బతికేట్టు చెయ్యడం ప్రతిఫలాపేక్ష లేకుండా పరోపకారం చేసే గుణం పరమ శ్లాఘ్యం. అటువంటి గుణం కలవాడు కాబట్టే హనుమంతుడు బ్రహ్మ పదవికి అర్హుడయ్యాడు. ప్రస్తుతం ఉన్న బ్రహ్మ పదవి ముగియగానే హనుమంతుడే బ్రహ్మ పదవికి వెళతాడని ప్రతీతి. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొని హనుమంతుని ఘనతనుకొనియాడుతూ అన్నమయ్య రచించిన కీర్తన హనుమంతుని కీర్తినే కాదు, అన్నమయ్య పొందిన స్ఫూర్తిని కూడా ఆవిష్కరిస్తుంది.

అవధారు చిత్తగించు హనుమంతుడు వీడె
భువిలోన గలశాపుర హనుమంతుడు

రామ నీ సేవకుడిదె రణరంగ ధీరుడు
ఆముకొన్న సత్వగల హనుమంతుడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామిత ఫలదుడు యీ ఘన హనుమంతుడు ॥అవ॥

జానకీరమణ సప్త జలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుడు
పూని చుక్కలెల్లా మొలపూసలు గాగ బెరిగి
భానుకోటి కాంతితో జొప్పడు హనుమంతుడు ॥అవ॥

యినవంశ శ్రీవేంకటేశ నీ కరుణతోడ
అనుపమ జయశాలి హనుమంతుడు
పనిపూని ఇటమీది బ్రహ్మ పట్టమునకు నీ
యనుమతి గాచుకున్నాడదె హనుమంతుడు ॥అవ॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-490)

ఈశ్వరాంశతో జన్మించిన హనుమంతుడి లీలలు దేవతలకు కూడా అంతుపట్టవు. హనుమంతుణ్ణి ధ్వజంగా ఉంచుకొనే అర్జునుడు భారత యుద్ధంలో విజయం సాధించాడు. ఇక్కడ శ్రీకృష్ణ భగవానుడి తోడ్పాటేగాక భక్తాగ్రేసరుడయిన హనుమంతుని తోడ్పాటుకూడా పాండవ మధ్యముడికి లభించడం పరిగణనలోకి తీసుకోదగిన అంశం. హనుమంతుని సహకారంతోనే సుగ్రీవుడు రాముడికి పరిచయం అయ్యాడు. రామభక్తుడయ్యాడు. రామానుగ్రహానికి పాత్రుడయ్యాడు. పర్యవసానంగా కిష్కింధ రాజ్యానికి వానర రాజుగా పట్టం గట్టుకొన్నాడు. హనుమంతుడు భీష్ముడికి కూడా తోడ్పడి అతని విక్రమ విజృంభణాలకు కారకుడయ్యాడు. ఇంతటి హనుమంతుణ్ణి అన్నమయ్య ప్రశంసించిన తీరు ప్రశంసార్హం.

ఆంజనేయ యనిలజ హనుమంత నీ
రంజకపుఁ జేఁతలు సురల కెంచవసమా ॥పల్లవి॥

తేరి మీద నీ రూపు దెచ్చిపెట్టి యర్జునుడు
కౌరవుల గెలిచె నంగర భూమిని
సారెకు భీముడు పురుషామృగముఁదెచ్చుచోట
నీరోమములు గావా నిఖిల కారణము ॥ఆంజ॥

నీ మూలమునఁగాదె నెలవై సుగ్రీవుడు
రామునిఁ గొలిచి కపిరాజాయను
రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవి।
ప్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ఆంజ॥

బలు దైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁగలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనే మంగాంబుధి
నిలయపు హనుమంత నెగడితిగా ॥ఆంజ॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-458)

హనుమంతుని విశ్వాకారం ఊహకందని విషయం. ఆతని పాదాలు పాతాళంలో వున్నాయి. ముఖం ధ్రువమండలం దగ్గర వుంది. ఆతడు పది దిక్కులకు వ్యాపించాడు. అతని రోమ కూపాల్లో దేవతలు విహరిస్తారు. అంతటి మహా మహుడు వేంకటేశ్వరుడి సేవకుడు. ఎంత ఎదిగితే అంత ఒదగాలి. అపుడే అతడు అందరికీ అభినందనీయుడు కాగలడు అని తన ప్రవర్తన ద్వారా ప్రకటించిన ప్రశంసనీయుడు పావని. ఇది అన్నమయ్య ఆలోచన. ఈ ఆలోచన రూపుకట్టిన పాట హృదయాలను మీటక మానదు.

ఇతడు రాముని బంటు యితనికెవ్వరెదురు
చతురత మెరసె నిచ్చట హనుమంతుడు

ఆకాసమంతయు నిండి యవ్వలికిఁ దోఁక చాఁచి
పైకొని పాతాళాన ఁబాదాలు మోపి

కైకొని దశ దిక్కులు కరముల గబళించి
సాకారము చూపినాఁడిచ్చట హనుమంతుడు ॥ఇతడు॥

కొంచక సురలు రోమకూపముల విహరించ
ముంచి ధ్రువ మండలము మొగమై యుండ
యెంచగ లోకములెల్లా యెడనెడ సందులుగా
చంచు మెరసినాఁడిచ్చట హనుమంతుడు ॥ఇతడు॥

గరిమ రవి చంద్రులు కర్ణ కుండలములుగా
ధరణి మేరువు కటితటముగాఁగా
ఇరవుగ శ్రీవేంకటేశుని సేవకుడై
బెరసె నిచ్చట నిదె పెద్ద హనుమంతుడు

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 2-218)

హనుమంతున్ని బంటుగానేగాక ఏలికగా కూడా అన్నమయ్య దర్శించాడు. అటువంటి ఏలిక తనలాంటి వాళ్ళకు రక్షకావాలని సంకల్పించాడు. ఎంతటి రక్షకుడైన అతనికి రక్షణ లేకుంటే అతనిచ్చే రక్షణ కూడా నిరర్థకమై పోతుంది. అందువల్ల హనుమంతుడు తమకు రక్షణ ఇస్తున్నట్టే హనుమంతుడికీ పలువురు రక్షణా బాధ్యత వహించాలని అన్నమయ్య సంకల్పం. ఎవరెవరు ఏయే భాగాన్ని రక్షించాలో ఆయనే నిర్దేశించాడు. వాయువు గమనానికి తోడ్పడతాడు కాబట్టే హనుమంతుడి పాదాలను వాయుదేవుడు రక్షించాలంటాడు అన్నమయ్య. తక్కిన భాగాలు, వాటిని రక్షించే బాధ్యత వహించేవారు, ఇంచుమించు ఇలాగే అన్నమయ్య సంకీర్తనలలో చోటు చేసుకోవడం జరిగింది.

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

మొదలనింద్రుడు నీ మోమునకెల్లా రక్ష
యిదె నీ శిరసునకు నినుఁడురక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష
బెదరని నీ మేనికెల్ల శ్రీరామరక్ష

పిరుదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడడు నీ కరయుగముల రక్ష
గరిమ నీ కుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీరామరక్ష

వడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష

నలువ నీగళరక్ష నాలుక కుర్వర రక్ష
అలద నీ సంధులకు హరుడు రక్ష
పలు నీ రోమములకు బహు దేవతలు రక్ష
చెలగునే చేఁతలకు శ్రీరామరక్ష

అంగపు నీ తేజమున కగ్ని దేవుడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీసతిరక్ష
మంగాంబునిధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-459)

హనుమంతుడు లోకానికంతటికీ ఎదురులేని దైవం అయ్యాడని అన్నమయ్య తలపోత. బ్రహ్మగా, విష్ణువుగా, రుద్రుడుగా, సూర్యుడుగా, శేషుడుగా, వాయుదేవుడుగా, చంద్రుడుగా అనేక విధాలుగా కనిపించిన హనుమంతుడు వేంకటేశ్వరుని బంటుగా కూడ దర్శనమిచ్చి దైవదాసునకంటె ధన్యుడు మరొక్కడు లేడని స్ఫురింపజేసి అన్నమయ్య గుండెలో పాట రవళింపజేశాడు. పల్లవిని పల్లవింపజేశాడు.

ఒక్కడే యేకాంగ వీరుఁడుర్వికి దైవమైనాడు
యెక్కడా హనుమంతుని కెదురా లోకము ॥పల్లవి॥

ముందట నేలే పట్టమునకు బ్రహ్మాయినాఁడు
అందరు దైత్యులఁ జంపి హరి పేరైనాడు
అంది రుద్రవీర్యము దానై హరుడైనాడు
యెందు నీ హనుమంతునికెదురాలోకము ॥ఒక్కడే॥

చుక్కలు మోవ బెరిగి సూర్యుడు దానైనాఁడు
చిక్కుఁబాతాళము దూరి శేషుడైనాడు
గక్కన వాయుజుడై జగత్ప్రాణుడైనాఁడు
యెక్కువ హనుమంతునికెదురా లోకము ॥ఒక్కడే॥

జలధిఁబుట మెగసి చంద్రుడు దానైనాడు
చెలగి మేరువు పొంత సింహమైనాడు
బలిమి శ్రీవేంకటేశు బంటై మంగాంబుధి
నిల యీ హనుమంతునికెదురా లోకము ॥ఒక్కడే॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 4-462)

అన్నమయ్య రచించిన హనుమత్సంకీర్తనల్లో సంస్కృత సంకీర్తనలు కూడా ఉన్నాయి. అవి అతని గీర్వాణ వైదుష్యాన్ని ఆవిష్కరిస్తాయి. హనుమంతుడు పాతాళ లంకలో ప్రవేశించి మైరావణుడిని మట్టుబెట్టి రామ లక్ష్మణులను విడిపించిన వృత్తాంతం సాహిత్యంలో అతి తక్కువ చోట్ల మాత్రమే కనిపిస్తుంది. అన్నమయ్య ఆ వృత్తాంతాన్ని కూడా విడిచిపెట్టలేదు. తన సంస్కృత సంకీర్తనలో ప్రస్తావించాడు. మృధు మధుర శబ్ధజాలంతో అన్నమయ్య రచించిన ఈ కీర్తన అందరికీ అవధరణీయమే.

సీతాశోక విఘాతక వో
పాతాళ లంకాపతి విభాళా ॥పల్లవి॥

హనుమంతరాయ అంజనీతనయ వో
వనధి లంఘనగాత్ర వాయుపుత్రా
యినకులాధిప నిజహిత జగన్నుత
వనజోదర సేవక సత్వ ధనికా ॥సీతా॥

ప్రళయాంతకరూప బలదీప రవిఫల
గిళన ప్రతాప సుగ్రీవ ప్రియా
కుళక దానవ సంకుల విదారణ
భళి భళి జగత్పతి బలుబంటా ॥సీతా॥

పంకజాసనుదివ్యపద వైభవ వో
లంకిణీ ప్రాణ విలంఘున
వేంకటేశ్వరు సేవావీర మహాధీర
కింకరరాయ సుఖీభవ ॥సీతా॥

(తాళ్ళపాక అన్నమాచార్యులు - అ.సం.- 1-366)

హనుమంతున్నుద్దేశించి అన్నమయ్య రచించిన సంకీర్తనలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ వాటన్నిటినీ గురించి ఒక చిన్న వ్యాసంలో ప్రస్తావించడం వీలయ్యే పనికాదు. కొండను అద్దంలో చూపించేవిధంగా కొన్నిటిని మాత్రమే ఇక్కడ పరిశీలించడానికి వీలౌతుంది.

అన్నమయ్య హనుమత్సంకీర్తనలను భాషా దృష్ట్యా రెండు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి 1.తెలుగు సంకీర్తనలు, 2. సంస్కృత సంకీర్తనలు. తెలుగు సంకీర్తనలు అధిక సంఖ్యలోను, సంస్కృత సంకీర్తనలు తక్కువ సంఖ్యలోను ఉన్నాయి.

దేశంలో ఎన్నోచోట్ల ఆంజనేయ క్షేత్రాలున్నాయి. రామాలయాల్లాగే ఆంజనేయాలయాలు కూడా దేశమంతటా వెలశాయి. ఇప్పుడు లభించిన అన్నమయ్య సంకీర్తనల్లో తిరుమల, తిరుపతి, మంగాంబుధి, కలశాపురం, మతంగాద్రి, హంపి, విట్ఠలక్షేత్రం మొదలైన ప్రదేశాల్లో ఉండే హనుమంతుణ్ణి అన్నమయ్య నోరారా కీర్తించాడు. భక్తితో భావించి పరవశించాడు.

హనుమంతుని జననం, సూర్యుణ్ణి పండని మింగబోవడం, హనుమంతుని విద్యాభ్యాసం, సుగ్రీవ సాన్నిహిత్యం, రామ సుగ్రీవులకు మైత్రిని ఏర్పరచడం,

సముద్ర లంఘనం, సీతను కలుసుకుని ముద్రికను ఇచ్చి చూడామణి తీసుకరావడం, విశ్వరూప ప్రదర్శన, సంజీవి పర్వతం తీసుకరావడం, రాక్షసులను హతమార్చడం, భీమార్జునులకు తోడ్పడడం, బ్రహ్మపట్టం కోసం వేచి ఉండడం మొదలైన హనుమజ్జీవిత సంఘటనలెన్నో అన్నమయ్య హనమత్సంకీర్తనల్లో కనిపిస్తాయి. సంకీర్తనలు ముక్తకాలు కావడం వల్లను ఇంతకుముందు చెప్పినవి సమయానికి గుర్తు లేకపోవడం వల్లను ఈ సంకీర్తనల్లో పునరుక్తులు పలుచోట్ల కనిపిస్తాయి. ఆశ్చర్యాన్ని ప్రకటించేటప్పుడు, ఆనందాన్ని ఆవిష్కరించేటప్పుడు తప్పకుండా గుర్తుంచుకోవలసిన విషయాలను తెలియజేసేటప్పుడు ఒకే విషయాన్ని రెండుసార్లు చెప్పవచ్చని పెద్దలు సెలవిచ్చారు.

"విస్మయేచ విషాదేచ దైన్యే చైవావధారణే
తథా ప్రసాదనే హర్షే వాక్యమేకం ద్విరుచ్యతే"

విస్మయమందును, విషాదమందును, దీనభావమందును, తత్వావధారణ యందును, అనుగ్రహమందును, హర్షమందును ద్విరుక్తి ప్రయోగము గలదు.

హనుమంతునికి సంబంధించిన విషయాలు ఆశ్చర్యానందదాయకాలు, దైవానుగ్రహాన్ని కలిగించేవి. గుర్తు పెట్టుకోవలసినవి. మళ్ళీ మళ్ళీ మననం చేసుకోదగ్గవి. కాబట్టి వాటిని ఎన్నిసార్లు పేర్కొన్నా పునరుక్తి దోషం అంటదు.

అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా హనుమంతుని అనంతాకారాన్ని, అనుపమ కృత్యాలను, అభినందించదగిన ఆశయాలను పవిత్ర వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాడు. వైష్ణవంలో హనుమదీయం ఆవిర్భవించేందుకు కూడ అన్నమయ్య దోహదం చేశాడంటే సాహసం కాబోదు.

# తిమ్మక్క పంచిన తియ్యదనం

ఆంధ్ర సాహిత్య చరిత్రలో తాళ్ళపాకవారి కుటుంబానికి ప్రత్యేకస్థానం ఉంది. వారి బాణి, వారి వాణి అందరికీ అనుసరణీయాలుగానే అలరారాయి. అందుకేనేమో 'తాళ్ళపాకవారిది కొంత, తమది కొంత' అనే నానుడి బాగా వ్యాపించింది. తాళ్ళపాకవారు దాదాపు అన్ని సాహితీ ప్రక్రియల్లోను రచనలు చేశారు. భక్తికి, మధురభక్తికి, నీతికి, లోకరీతికి, మానవీయ ప్రీతికి ప్రాధాన్య మిచ్చారు. కృతులనేగాక కైంకర్య సత్కృతులనూ వెలయించారు. వేంకటేశ్వరభక్తి, వైష్ణవవ్యాప్తి వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఆధ్యాత్మిక జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అహర్నిశలూ అవిశ్రాంతంగా తాళ్ళపాకవారు కృషి చేశారు.

తాళ్ళపాక కవి కుటుంబానికి ఆద్యుడు అన్నమాచార్యుడు. తొలి తెలుగు వాగ్గేయకారుడుగా, పద కవితా పితామహుడుగా పండిత ప్రశంసలందుకొన్న పరమ ప్రాజ్ఞుడు. 32 వేల కీర్తనలతో వేంకటేశ్వర కీర్తిని ఆంధ్రుల గుండెలలో నింపిన అమర పదకర్త. వేంకటేశ్వర శతకం, శృంగార మంజరి వంటి మధుర కృతులను వెలయించడమే కాక 'సంకీర్తనా లక్షణం' అనే లక్షణగ్రంథాన్ని కూడా సంస్కృతంలో వెలయించిన లక్షణకర్త.

అన్నమాచార్యుని కుటుంబంలో దాదాపు అందరూ కవులే. పండితులే. గేయకారులే. గాయకులే. తాళ్ళపాక అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయకారుడైనట్టే ఆయన మొదటి భార్య తాళ్ళపాక తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రిగా సాహితీ జగత్తులో స్థానం సంపాదించుకొంది. భర్తకు తగిన భార్య అనిపించుకొంది. ఈమె సుభద్రా కల్యాణమనే ద్విపదకావ్యం రచించి తన కుటుంబ కల్యాణానికేగాక ఆంధ్ర సాహిత్య ప్రపంచ కల్యాణానికి కూడా దోహదం చేసింది అంటే అతిశయోక్తి కాదు. ఫలశ్రుతిలో చోటు చేసుకున్న ద్విపద పంక్తులు సుభద్రాకల్యాణం తిమ్మక్క ప్రణీతమేనని ప్రస్ఫుటం చేస్తున్నాయి.

"తరుణి తిమ్మక చెప్పె - దాను సుభద్ర
కల్యాణమను పాట - కడుమంచి తేట"

(తాళ్ళపాక తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-76)

ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారని వాడుక. అన్నమయ్య సహచర్యంలో అన్ని సంవత్సరాలు గడిపిన అన్నువ ఆయనలో అర్ధమైనా కాకపోతే అర్ధాంగి పదానికి సార్ధకం ఎలా సంప్రాప్తిస్తుంది. అన్నమయ్య ప్రభావం ఆమె మీద పరిపూర్ణంగా పడ్డట్టే ఉంది. పర్యవసానంగా ఆమెనోట ద్విపదపాట పరిమళించింది. పరవశింపజేసింది. 'మందె మేలము - కందువ' వంటి అన్నమయ్య ప్రయోగించిన పదాలేగాక అన్నమయ్య పేర్కొన్న నగలు, ఆహారపదార్థాలు వంటివెన్నో తిమ్మక్క సుభద్రాకల్యాణంలో కనిపించడం గమనార్హం. ఇవి తిమ్మక్క మీద అన్నమయ్య ప్రభావాన్ని సూచించే అంశాలే.

అన్నమయ్య వేంకటేశ్వర స్వామి భక్తుడు. వేంకటేశ్వరుణ్ణి ఉద్దేశించే రచనలు చేశాడు. పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య అతనిని అనుసరించారు. తాళ్ళపాక చిన్నన్న దైవానికేగాక దైవభక్తులకు కూడా తన ద్విపద రచనలలో స్థానం కల్పించాడు. అష్టమహిషీ కల్యాణం, ఉషా పరిణయం, శ్రీకృష్ణ పారమ్యానికి ప్రాధాన్యతనివ్వగా; పరమయోగి విలాసం విష్ణుభక్తులైన ఆళ్వారులకు, అన్నమాచార్య చరిత్ర వేంకటేశ్వర భక్తుడైన అన్నమయ్యకు బ్రహ్మరథం పట్టాయి. వీరందరూ విష్ణుతత్వాన్ని, వేంకటేశ్వర తత్వాన్ని ఎలుగెత్తి చాటగా తిమ్మక్క దైవం జోలికిగాని, దైవభక్తుల జోలికిగాని పోకుండా సుభద్రా కల్యాణం రచించింది. అన్నమయ్యకు తిమ్మక్క జ్యేష్ఠ పత్ని. ఆమెతో ఆగని అన్నమయ్య అక్కలమ్మను కూడా వివాహంచేసుకొన్నాడు. ఆ సందర్భంగా తిమ్మక్క హృదయం క్షోభించి ఉంటుంది. ఆమె హృదయాన్ని ఆవిష్కరించేందుకు అనువైన పరిస్థితులు ఆనాడు లేవు. అన్యాపదేశంగా తన అంతరంగాన్ని అభివ్యక్తం చేసే చిన్న పనికి పెద్ద ప్రయత్నమే చేయవలసి వచ్చింది. మనసులో మాట బయటకు వెళ్తేనే మనశ్శాంతి. ఈ కారణం చేత ఏడుకొండలస్వామిని వదలి తన స్వామి

తనపట్ల చూపిన అలక్ష్యాన్ని ఆవిష్కరించి ఊరట పొందేందుకే ఈ ప్రయత్నం చేసినట్లుంది. మా గురువుగారు కామిశెట్టి శ్రీనివాసులుగారు సుభద్రా కల్యాణానికి రాసిన పీఠికలో తెలియజేసిన అభిప్రాయమిక్కడ గమనించదగి ఉంది.

తిమ్మక్క మహాభారతం బాగా చదువుకొన్నది. ఆదిపర్వం అష్టమాశ్వాసంలో "అర్జునుని తీర్థయాత్ర" సన్నివేశాన్ని చక్కగా హృదయస్థం చేసుకొన్నది. తన భర్త అన్నమయ్యలో పార్థుని చూసుకున్నది. తాను ద్రౌపది అయినది. అక్కలమ్మలో సుభద్ర కనిపించింది. తిమ్మక్క పాడుకొన్నది. ఆ అందమైన పాటే సుభద్రా కల్యాణం.

సుభద్రా కల్యాణకావ్యంలో తిమ్మక్క రాసిన పంక్తులు కూడా ఇక్కడ గుర్తు చేసుకోదగి ఉన్నాయి.

"యేమి వస్తువైన నియవచ్చుగాని
ప్రాణేశునిచ్చి మరి బ్రతుకంగరాదు"

(తాళ్ళపాక తిమ్మక్క, సుభద్రాకల్యాణం, పీఠిక-13)

తిమ్మక్క ద్రౌపది పాత్రలో కొంతసేపు తొంగిచూసి వెంటనే తప్పుకొన్నది. తిమ్మక్క ఒక ఇల్లాలు. మరొక సతితో కలసి భర్తను పంచుకొన్నది.

తిమ్మక్క రచించిన సుభద్రా కల్యాణాన్ని తిరుమల - తిరుపతి దేవస్థానం వారి పక్షాన సారస్వత తపస్వి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1950లో ప్రచురించారు. దీనికి శ్రీ శాస్త్రిగారే అమూల్యమైన పీఠికను సమకూర్చారు. ఈ పుస్తకం 1956లో పునర్ముద్రణ పొందింది. మా గురువర్యులు ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి గారు ఉదాత్తమైన కావ్య సమీక్షతో ఈ గ్రంథాన్ని అలంకరించారు. మా ప్రియతమ గురువర్యులు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారు సుభద్రా కల్యాణాన్ని 2003వ సంవత్సరం అన్నమాచార్య మిషన్ పక్షాన పునర్ముద్రించారు. వీరి పీఠిక సుభద్రాకల్యాణానికే కల్యాణప్రదంగా భాసిస్తూ ఉంది.

తిమ్మక్క రచించిన సుభద్రా కల్యాణానికి ఆంధ్ర మహాభారతమే మూలం. అందులోని అర్జునుడి తీర్థయాత్ర, సుభద్రాకల్యాణం దీనిలోని వస్తువు. ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి గారు కూడా సుభద్రాకల్యాణం కావ్యసమీక్షలో ఈ విషయం తెలియజేశారు.

"తిమ్మక్క రచన కేవలం ఆంధ్రమహాభారతమునందలి కథనే అనుసరించి యున్నది. పాటగా రచించుట చేత సందర్భానుసారంగా కొన్ని చమత్కార సంభాషణలు క్రొత్తగా చేరి ఉన్నవి". (తిమ్మక్క సుభద్రాకల్యాణం, పుట-2)

కవిత్రయ ఆంధ్రమహాభారతం ఆదిపర్వం అష్టమాశ్వాసంలో 90వ పద్యం నుంచి 223వ పద్యం దాకా వ్యాపించి ఉన్న వృత్తాంతాన్ని తీసుకొని తిమ్మక్క సంక్షిప్తంగా ద్విపదకావ్యంగా వెలయించింది.

ద్రౌపదితో ఇంద్రప్రస్థంలో సుఖంగా కాలం గడుపుతున్న పాండవుల దగ్గరికి నారదుడు వచ్చి వారికి నియమాన్ని సూచించడం, బ్రాహ్మణ గోరక్షణార్థం అర్జునుడు నియమభంగం చేసి తీర్థయాత్రకు వెళ్ళడం, ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకోవడం, ఐదుగురు అప్సరసలను శాపవిముక్తులుగా చేయడం, బభ్రువాహన జననం చాలా సంక్షిప్తంగా చెప్పి సుభద్రా కల్యాణాన్ని వాటికంటే కొంత విస్తారంగా చెప్పడానికి తిమ్మక్క ప్రయత్నించింది. అర్జునుడు యతివేషంలో ద్వారకకు రావడం, కృష్ణార్జునులు కలుసుకోవడం, కృష్ణుడు కపటయతికి పరిచర్య చేసేందుకు సుభద్రను నియమించడం, సుభద్రార్జునుల పరస్పరానురాగ వికాసం, సుభద్రార్జునుల వివాహం, బలభద్రుడు ఈ వివాహాన్ని వ్యతిరేకించడం, కృష్ణుని సానునయం, సుభద్రార్జునులు ఇంద్రప్రస్థానికి వెళ్ళడం, కృష్ణ బలరాములు కూడా వెళ్ళి సుభద్రార్జునులకు అరణమిచ్చి రావడం సుభద్రా కల్యాణకావ్యంలో చోటుచేసుకొన్న మరికొన్ని అంశాలు. ఈ కావ్యంలో కథ మాత్రమేగాక ఆకళింపు చేసుకొని ఆస్వాదించి ఆనందించవలసిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిలో మొదట పేర్కోదగ్గది తిమ్మక్క ఆంధ్రాభిమానం.

**ఆంధ్రాభిమానం :** తిమ్మక్క ఆంధ్రాభిమానం సుభద్రా కల్యాణంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి గారు తమ కావ్య సమీక్షలో తిమ్మక్క ఆంధ్రాభిమానాన్ని కూడా ప్రస్తావించారు.

"మూలమునందే పలు విధములుగా సొంపులు దిద్దుకొన్న ఈ కథకు తిమ్మక్క చిక్కని చెరిగిపోని ఆంధ్రతాముద్ర వేసినది" (తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట-2).

అర్జునుడు స్నాన యోగ్యాలైన తీర్థాలకు మాత్రమే వెళ్ళినట్టు మూలంలో ఉంది. తిమ్మక్క ఆ తీర్థాలతో బాటు ఆంధ్రదేశంలో ఉన్న అనేక పుణ్యక్షేత్రాలను కూడా అతనిచేత దర్శింపజేసింది. ఇక్కడ ఆమె ఆంధ్ర దేశాభిమానం చక్కగా అభివ్యక్తమవుతుంది. సింహాచలం, అహోబిలం, కంచి, శ్రీరంగం అర్జునుడు దర్శించిన క్షేత్రాల్లో కొన్ని

"చనుదెంచె పర్వత - స్వామి సన్నిధికి
అమర నహోబిళం - బావెంకటాద్రి
వరుస నాపై కంచి - వరదుల గొలిచె
క్రమమున కావేటి - రంగనాయకుల
ప్రేమను దర్శించి ..................."

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-25)

యాదవులు రైవతకాద్రి మహోత్సవానికి వెళ్ళారు. ఊరికే వెళ్ళలేదు. కమ్మని వంటకాలు సిద్ధం చేసుకొని మరీ కదిలారు. ఆ వంటకాలు ద్వారకా ప్రాంతంలోని గుజరాతీ వంటకాలు కావు. తెలుగువారి వంటకాలే. తిమ్మక్క ఆంధ్రాభిమానం గుభాళించే వంటకాలే.

"పప్పు బూరెలు నెయ్యి - పాయసాన్నములు
కాయగూరలు పెక్కు - కలవంటకాలు

ఊరగాయలు నెయ్యి - బొబ్బట్లు వడలు
గారెలు, బూరెలు - కండ మండిగెలు
అరటి పండులను రా - జాన్న రాసులును
పిండి కూరలు మొదల్ - పెద్ద కుడుములను
గరిగల ఘటముల - గంపలనునిచి"

(తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట-33)

తిమ్మక్క సుభద్రార్జునుల తొలిరాత్రి పడకటింటిని 15వ శతాబ్దపు ఆంధ్రుల శోభనపు గదిగానే తీర్చిదిద్దింది. ధర్మరాజు సూచనమేరకు ద్రౌపది పడకటింటిని అలంకరించింది. నూతన వధూవరులకు తినుబండారాలు కూడా అక్కడ సిద్ధం చేసింది. అవి ఆనాటి ఆంధ్రుల తినుబండారాలేనేమో!

"మదిరాక్షి యునిచెను - మఱియు నచ్చటను
చాఱపప్పు గసగ - సాలానవాలు
శ్రీ సుగంధమ్ములు - చిటి బెల్లములును
చెఱుకు బిళ్ళలు మంచి - చిఱుదిండి వరకు
పసిమి మామిడి పండ్ల - రసముల పిసికి
పసిపచ్చ గిన్నెల - పాలు వేనినిచి
పలువన్నె గిండ్లతో - పన్నీరు నించి
బంగారు చెంబుల - పానకమునిచి
బుంగల దింపించి - గంగోదకములు"

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట 70-71)

సుభద్ర బొమ్మల పెళ్ళి చేసింది. అప్పుడామె చెసిన వేడుకలు, ఆంధ్రుల ఆడపిల్లలు దసరాకు చేసే వేడుకలుగానే కనిపిస్తాయి. ఈ వర్ణన గమనిస్తే ఈ అంశం బోధపడుతుంది.

"పొలుపైన రత్నాల - బొమ్మరింటికిని
తళుకైన పగడాల - దారబంధములు

పచ్చుల తలుపులు - పన్నారు గురుగు
లచ్చుంపు దంతాన - నమరు బొమ్మలును
చెఱగుల యంచుల - జీనిఁవ్రాతలును
చిరుత పప్పుళ్ళు మఱి - చెంద్రకావులును
బంగారు బొమ్మల - బాగుగా కట్టి
శృంగారమమరించె - చెలియ సుభద్ర"

(తిమ్మక్క - సుభద్రా కల్యాణం, పుట-37)

పూర్వకాలంలో ఆంధ్రుల ఇళ్ళలో ఆడువారు ధరించే నగలనే తిమ్మక్క సుభద్ర చేత కూడా ధరింప జేసినట్టుంది. ఈ నగలపేర్లు కొన్ని ఇప్పుడు మరుగున పడిపోయినప్పటికీ కొన్ని పేర్లు మాత్రం ఇప్పటికీ వినిపిస్తున్నాయి. సుభద్ర నగలను అలంకరించుకున్న తీరు గమనిస్తే ఈ విషయం అవగతమవుతుంది.

"బసిడి ముత్యాల నొ - ప్పగ పూర్ణ చంద్రు
రవమించు చెవులతా - టంకాలు చేర్చి
మొగపు తీగెకు చెంత - ముత్యంపు కొలికి
జిగి మణుల్ మిగులు మం - జిడి తాళిజేసె
పుంజాల దండ దా - పున నేవళమ్ము
రంజిల్లు బన్నస - రమ్ము క్రీడించ
యిన్ని సొమ్ములకును - వన్నె బెట్టినట్టు
మూడు వేల్ వెలసేయు - ముక్కఱ బెట్టె'

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-47)

ఆంధ్రస్త్రీలకు ముక్కఱంటే మక్కువ ఎక్కువ కాబోలు. తిమ్మక్క ఈ ముక్కఱను రెండుచోట్ల ప్రస్తావించింది.

తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహాత్మ్యంలో నిగమశర్మ అక్కచేత ముక్కఱ కోసమే ఏడ్పించాడు.

భ్రాతృ ప్రేమ : అన్నాతమ్ముళ్ళ మధ్య, అక్కా తమ్ముళ్ళ మధ్య, అన్నా చెల్లెళ్ళ మధ్య సహజంగానే ప్రేమ నెలకొంటుంది. అది వాచామాత్రంగాగాక హృదయ సంబంధిగా ఉంటుంది. దీనికి భిన్నంగా కూడా కొందరు మసలుకోవడం లేక పోలేదు. వాళ్ళు సహజదూరులే అని చెప్పవచ్చు. ఈ భ్రాతృప్రేమను తిమ్మక్క విశేషించి ఆదరించింది. అర్జున ధర్మరాజుల మధ్య, శ్రీకృష్ణ సుభద్రల మధ్య, కృష్ణ బలరాముల మధ్య ఈ ప్రేమను ప్రవేశపెట్టి అందరూ ఇలాగే ఉండాలని పరోక్షంగా సూచించింది.

నియమభంగం కావడం వల్ల అర్జునుడు తీర్థయాత్రకు వెళ్ళేందుకు సంసిద్ధుడయ్యాడు. అనుమతి కోసం అన్న దగ్గరకు వచ్చాడు. ధర్మరాజు తమ్ముణ్ణి వారించాడు. అతనిని విడిచి ఉండలేనన్నాడు.

నిను విడిచి యొక ఘడియ - నేనుండలేను
నను విడిచి యేరీతి - చనెదవో యన్న

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-22)

అర్జునుడికి, సుభద్రకు వివాహం జరిగింది. శోభనానికంతా సిద్ధమైంది. అప్పుడు కూడా అర్జునుడు అన్నకు నమస్కరించడం మరువలేదు.

అక్కడ ధర్మజుం - డర్జునునకు
అతిరక్తితో నలం - కృతులు సేయించె
సవ్యసాచిని జూచి - సన్నగావించె
శయ్యా గృహమునకు - నొయ్యబొమ్మనుచు
వెసనన్న పాదార - విందములు మ్రొక్కి
పానుపు కడకేగి - పార్థుడంతటను

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-72)

ఇక్కడ అర్జునుడి భ్రాతృభక్తి అభివ్యక్తమౌతుంది. అన్న ధర్మరాజుకు తమ్ముడి పట్ల ఉన్న అనురాగం బోధపడుతుంది. ఇదేవిధంగానే కృష్ణుడికి, సుభద్రకు మధ్య ఉన్న అనురాగం వ్యక్తమవుతుంది.

కపట సన్యాసిగా ఉన్న అర్జునుడు సుభద్రతో సరసాలకు దిగాడు. ఆమె సహించలేకపోయింది. తనకున్న చనువుకొద్ది అన్నతో ఈవిధంగా మొర పెట్టుకొంది.

గ్రక్కున శ్రీకృష్ణు - కడకు నేతెంచి
యెక్కడి యతివరుం - డితడు వోయన్న!
చూడ సంయమిగాని - చూఱాకాడితడు
ఆడెడి మాటలిట్ల - ని పల్కరాదు
సరసమాడగ వచ్చు - సారెనాతోను
సొంపు నొయ్యారంపు - చూపులే తఱచు
ఇత్తఱినే భిక్ష - మిడినంత దాను
పొత్తున భుజియింప - పొలతి రమ్మనెను
ఎంత జేసితిరిమీ - రిటువంటి వారి
నంతః పురమ్ములో - నర్హమా యుంచ
అన్న యీ సన్యాసి - ననుపుమా వేగ
ఎన్నిక బూజింప - నే దగవు కాదు
తన్ను జూడగ నిల్వ - తగవు గాదితడు
కటకట యిటువంటి - కపట సన్యాసి
నెటువలె బూజింతు - నిందిరా రమణ

(తిమ్మక్క, సుభద్రాకల్యాణం, పుట 39-40)

దీనిని బట్టి కృష్ణ సుభద్రల మధ్య ఎంత ఆప్యాయత ఉందో అభివ్యక్త మవుతుంది.

కృష్ణుడికి సుభద్రంటే చాలా ఇష్టం. ఆమె అర్జునుణ్ణి వలచిందని తెలుసుకొని ఆమె కోరిక నెరవేర్చాలనుకొన్నాడు. కపటయతిగా వచ్చిన అర్జునునికి శుశ్రూష చేసేందుకు సుభద్రను నియమించాడు. సుభద్ర విషయంలో ఆవేశం కనబరచిన

అర్జునుణ్ణి మందలించి అదుపు చేశాడు. సుభద్రను లాలించి మళ్ళీ అర్జునునికి సపర్యలు చేసేందుకు సిద్ధం చేశాడు. కృష్ణుడు సుభద్రను లాలించిన తీరు ఎంతో రమణీయంగా ఉంది.

"భద్రే భగమున సు - భద్ర రమ్మనుచు
తోయజాక్షుడు తన - తొడపైన నునిచె
నీలాల వంటి వా - నెలత నెఱి కురులు
వాలారు కొనగోళ్ళ - వడి చిక్కుదీసె
శ్రీకృష్ణుడావేళ - చెల్లెలికినపుడు
సేసకొప్పటు బెట్టి - చెలువమ్ముతోను
చుబుకంబు పైకెత్తి - చూచియోదార్చి
మక్కువనలరించె - మగువ నెమ్మోము
కుంచించుకొని శిరసు - వంచుకొనబోవ
శిరసు తాబైకెత్తి - చెల్లెలి చూచి
చిఱునవ్వుతో బలికె - శ్రీకృష్ణుడెలమి"

(తిమ్మక్క - సుభద్రా కల్యాణం, పుట-42)

సుభద్రార్జునుల వివాహానంతరం సుభద్రను అత్తగారింటికి పంపే సమయం వచ్చింది. రుక్మిణీదేవి సుభద్రకు ఊరట కలిగేవిధంగా మాట్లాడింది. వెళ్ళినచోట ఇబ్బంది ఉండదంది. అత్త మేనత్త కావడం, బావలుమరుదులు మేనబావలు మేన మరుదులు కావడం ఆమెకు ఎంతో అనుకూలమంది. ఈ సందర్భంలోనే కృష్ణుడికి సుభద్రంటే ఎంత ఇష్టమో రుక్మిణి తెలియజేసింది.

అడలనేమిటికె మా - యమ్మ సుభద్ర
అత్తయు నీకు మే - నత్తయుగాన
వింత వారెవ్వారు - వీరిలోపలను
బావ మఱుదులు చాల - భక్తిగలవారు

నిను విడిచి మీయన్న - నిమిషమేనియును
నిలువరిప్పుడె నిన్ను - బిలిచి తెచ్చెదరు

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట-62)

కృష్ణ బలరాముల మధ్య కూడా ఇటువంటి గాఢానురాగమే కనిపిస్తుంది. కృష్ణుడు బలరాముణ్ణి గౌరవించాడు. బలరాముడు కృష్ణుణ్ణి ఆదరించాడు. ఎంతో ఆత్మీయత ప్రదర్శించాడు. సుభద్ర వివాహ సందర్భంలోను, అరణమివ్వడానికి వెళ్ళిన సందర్భంలోను ఇది సుస్పష్టంగా గోచరిస్తుంది.

**పరిహాస కుశలత :** హాస్యానికి, పరిహాసానికి ఆంధ్రకవులు కూడా అగ్రతాంబూలమిచ్చారు.

"................... పరిహాసములేని ప్రసంగ వాక్యమున్
గ్రాసములేని కొల్వు కొరగానివి పెమ్మయసింగధీమణీ!"

అని ఒక శతకకారుడు పరిహాస ఆవశ్యకతను గట్టిగా నొక్కి వక్కాణించాడు. పరిహాసంలేని వాక్యమే కొరగానప్పుడు పరిహాసంలేని కావ్యం మాత్రం ఎలా సమాదరణీయమవుతుంది? అందుకే కాబోలు తొలి తెలుగు కవయిత్రి కూడా తన 'సుభద్రా కల్యాణ' కావ్యంలో పరిహాసానికి సముచిత స్థానం కల్పించింది.

వరుసైనవారు అవకాశం చిక్కినప్పుడల్లా పరిహాసాలకు దిగడం మన కుటుంబాల్లో పరిపాటి. దీన్నే తిమ్మక్క కూడా ఆసరాగా తీసుకుంది. కృష్ణార్జునుల మధ్య, రుక్మిణీ-సుభద్రల మధ్య హాస్యాన్ని ప్రవేశపెట్టి ఆనందింప జేసింది.

అర్జునుడు కపట సన్యాసి వేషంతో ద్వారకకు వచ్చాడు. కృష్ణుడికి నమస్కరించాడు. ఇక్కడ కృష్ణుడు అర్జునుని పరిహసించిన తీరు ఎంతో హృద్యంగా ఉంది.

నిన్ననే సుతులగని - నెఱతనమ్మునను
యింతలో సన్యాసి - వెట్లయితి వయ్య

యెరుగుదుము మీ విద్య - లెల్లనుమేము
గరిమ వేసాలెల్ల - గ్రాసాల కొఱకె
అని గేలి సేయుచు................."

(తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట-32-33)

వచ్చినవాడు సన్యాసి కాడని, అర్జునుడేనని సుభద్రకు తెలిసిపోయింది. విరహం తొంగి చూచింది. ఎవరితోనూ మాట్లాడకుండా వెళ్ళి మంచమెక్కింది. కృష్ణుడు రుక్మిణికి విషయమంతా చెప్పాడు. సుభద్రను ఉత్సాహపరచమని సూచించాడు. రుక్మిణి సుభద్ర దగ్గరకు వచ్చింది. పర్యాచకాలతో పలుకరించింది. పరిహసించి ఉక్రోషం పుట్టించింది. ఇక్కడ మరదలితో వదిన ఆడిన సరసం ఎంతో రసవత్తరంగా ఉంది.

"ఆ యంబుజాక్షియు - నచటికరుదెంచి
ఆ మరదలి జూచి - యటు నవ్వి పలికె
కనులేల మూసేనె - కలహంసగమన
శిరసేల వంచేవె - సింహేంద్ర మధ్య
వాలు కన్నుల నీరు - రాలనేమిటికె
వనిత సన్యాసిని - వలపించుకొంటి
రామావతారాన - రమణిరో నీవు
శాంతయనుపేరుతో - సహజాతవైతి
అల ఋష్య శృంగుని - అటులోను జేసి
వలవేసి కొంటివే - వనితరో నీవు
దేవేంద్రసుతు దృష్టి - తెగువతో తాకె
దృష్టితీయింతుమే - తెలివిరా నీకు
తెగువాలు కన్నుల - దృష్టించి చూడ
అతని చేతనె కాని - అది మానదనెను (సుభద్రా కల్యాణం, పుట-57)

**మనస్తత్వ చిత్రణ :** సుభద్రా కల్యాణంలో పాత్రలకు స్పష్టమైన తేడా కనిపిస్తుంది. సుస్పష్టమైన ఆలోచనా ధోరణి గోచరిస్తుంది. ఈ ఆలోచనా ధోరణి, మాటల పొందిక, పాత్రల మనస్తత్వాన్ని సహజ స్వభావాన్ని యిట్టె పట్టి యిస్తాయి. కృష్ణుడు కపట నాటక సూత్రధారి. ఆయన మనస్సులో కపటమూ ఉంటుంది. కార్యసాఫల్య విధానమూ ఉంటుంది. అలనాడు యతి వేషంలో ద్వారకకు వచ్చినపుడు సుభద్రార్జునుల వివాహాన్ని మనసులో ఉంచుకొని పార్థుణ్ణి ఆదరించాడు. బలరాముడితో యతి ఆగమనాన్ని తెలియజేశాడు. ఇక్కడ అతని కాపట్యం అభివ్యక్తమవుతుంది. కార్యసాఫల్యానికై వేసిన ఎత్తు బోధపడుతుంది.

"బలదేవుజూచియా - పద్మాక్షుడనెను
ఎక్కడి నుండియో - యీ పర్వతమునకు
నరయ మెవ్వరొకాని - యతి వచ్చినాడు
పొసగ చాతుర్మాస్య - పూజ చేయుదమ (పుట-36)

సుభద్ర మాయాయతి దగ్గర పాండవుల ప్రస్తావన తెచ్చింది. అర్జునుని గురించి అడిగింది. వారంతా యతికి ఎక్కడైనా తారసపడ్డారేమో చెప్పమని కోరింది. సుభద్ర అర్జునుని గురించి అభినందన పూర్వకంగా ఆత్మీయంగా మాట్లాడేసరికి అర్జునుడిలో ఆనందం, ఆవేశం పుంజుకుంది. తమాయించుకోలేక పోయాడు. తానే అర్జునుడని చెప్పేశాడు. సుభద్ర సిగ్గుతో అక్కడ నుండి వెళ్ళిపోయింది. అప్పటి నుంచే అర్జునుడిలో ఆరాటం ప్రారంభం అయింది. సుభద్రకు తన పేరు చెప్పకుండా ఉండవలసింది అనుకున్నాడు. ఆవిడ మళ్ళీ రాదేమో అని భయపడ్డాడు. తనతో మునుపటిలాగా మసలుకోదేమో అని మదనపడ్డాడు. ఆయన ఆలోచనా సరళిని తిమ్మక్క ఎంత సహజంగా పాఠకులకు అందించిందో గమనించడం సముచితం.

"యింతికి నాపేర - దేల చెప్పితిని
కాంతయులోనికి - గ్రక్కునఁబోయె

మరుని పుత్తడి బొమ్మ - మరలె నాచేతి
పరిచర్య లొనరించ - భాషించ దొక్కొ
సుందరి పాదాల - యందియల మ్రోత
విందునో వీనుల - వెరగందు నొక్కొ
తెలిసోగ కన్నుల - తెలియగ లేమ
సొలయక తాఁజూడ్కి - చూచునో లేదొ
కొమ్మలతో గూడ - గుజ్జన గూళ్లు
ఆ మగువ వడ్డించ - హర్షించదొక్కొ
యేమి చేయుదు నిట - కింకొకసారి
కామిని చనుదెంచి - కరుణించ దొక్కొ" (పుట-55)

ప్రేమికులు పైకి ఒకవిధంగానూ, లోపల ఒకవిధంగానూ ఉంటారు. సుభద్ర చేయిని అర్జునుడు పట్టుకున్నపుడు ఆమె అతన్నుంచి విడిపించుకొని వెళ్ళిపోయింది. అయినా ఆమె మనసు మాత్రం అతని దగ్గరే ఉండిపోయింది. తాను అతని చేతిని విడిపించుకొని వచ్చేయడాన్ని అర్జునుడు తప్పుగా భావిస్తాడేమోనని భయపడింది. అలక్ష్యం చేసినందుకు బాధపడింది. అర్థం చేసుకుంటాడు లెమ్మని ఊరట చెందింది. ఇదే సుభద్ర ఆలోచనా పరంపర.

"ఇంద్ర నందనుడు - మహీంద్ర స్తుతుండు
చేరి వినయమ్మున - చెట్టబట్టినను
విడిపించుకొని మఱి - వేగ బోయితిని
ఎలమినాతని మన - సెట్లుండె నొక్కొ
కాక దానొడబడితె - కడుచుల్కదనము
యీకడనందటి - కెన్నిక కాద
యెఱుగడా నాకేల - యింత చింతించ" (పుట-56)

రుక్మిణి సుభద్రను అత్తవారింటికి పంపించేటప్పుడు మితంగా హితం చెప్పింది. ముద్దుల మరదలు ముద్దరాలని మురిపెం చూపుతున్నందుకు అర్జునుడి

పట్ల అలక్ష్యంగా వ్యవహరించగూడదంది. పురుషుల నమ్మకూడదని వారు నల్లత్రాచులాంటి వారని హెచ్చరించింది.

ఇక్కడ పారిజాతాపహరణంలో సత్యభామ తన చెలికత్తెతో చెప్పిన పద్యం మదిలో మెదలక మానదు.

పరికింపరు తమ జాడలు
తరుణుల తగులములు నమ్మదగదండ్రు మదిన్
శరదంబుద చల చిత్తులు
పురుషులెపో వారి నమ్మబోలునె! చెలియా. (పారిజాత. ప్ర.ఆ. 87)

పాంచాలితో వంచనలేక మంచిగా ఉండమని మంచి మాటలు చెప్పింది. కృష్ణసర్ప ప్రయోగం కృష్ణున్ని అతని బహుభార్యత్వాన్ని వ్యంగ్యంగా సూచించినట్లయింది. సపత్నుల ఇబ్బందితో తనలాగే సతమతమవుతున్న పాంచాలిని వంచించవద్దని చెప్పడం రుక్మిణి అంతఃకరణాన్ని బహిర్గతం చేస్తుంది.

"చనవిచ్చినాడని - సకియరో నీవు
పలు మాటలకు నెట్లు - పాలుపడవద్దు
పొలతి నమ్మగరాదు - పురుషులనెపుడు
పలురీతి కృష్ణ స - ర్పమ్ములై యుండ్రు
కొంచక గృష్ణకు - కూర్మితో నుండు
వంచన సేయకు - వనిత యెపుడును (పుట-63-64)

తాను వలచి వరించిన వల్లభుడు అర్జునుడు మనసెరిగిన వాడేగాక మనసును దోచిన మనస్వి. అటువంటి ఆత్మీయుడు మరో మహిళను వెంటబెట్టుకొని యింటికి వచ్చాడు. ఆమె తనకు సపత్ని. ఆమెతోనే తాను అర్జునుని పంచుకోవలసి ఉంది. ద్రౌపది అంతరంగం ద్రవించింది. క్షోభించింది. గగ్గోలు పెట్టింది. అయినా బయట పెట్టడానికి వీలులేదు. మనసులో అనుకోకుండానూ ఉండలేక పోయింది. తన భర్తను మరొకరితో పంచుకోవలసిన తన దుస్థితిని

తలచుకొని విచారించింది. అయినా వచ్చిన వ్యక్తి కృష్ణుడి చెల్లెలు గదా అని సరిపుచ్చుకుంది. ద్రౌపది అంతరంగాన్ని తిమ్మక్క ఎంతో శక్తిమంతంగా ప్రతిభావంతంగా చిత్రించింది.

"ఏమి వస్తువులైన - నియవచ్చు గాని
ప్రాణేశునిచ్చిమఱి - బ్రతుకంగ రాదు
అఖిలాండ కోటి బ్ర - హ్మాండ నాయకుని
చెల్లెలు గనుకనే - నొల్లననరాదు
అదిగాక సభలోన - ఆ కౌరవులకు
మానభంగము గల్గు - హీన కాలమున
మాన ధన మొసగిన - మాహాత్మ్యశాలి
అటువంటి శ్రీకృష్ణు - కనుగు చెల్లెలట
అని మఱి తలపోసి - అతివ మోదించె (పుట 73-74)

ఇక్కడ కూడ సత్యభామ చెప్పిన మరొక పద్యం స్మృతి పథంలో మెదులుతుంది.

ధనమిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగ వచ్చు, మగడింతులకున్
జనవిచ్చి పుచ్చుకొన్నను
మన వచ్చునె? యింకనేటి మాటలు చెలియా!

(పారిజాత-ప్ర.ఆ. పద్యం 97)

ఇక్కడ రుక్మిణిలోనూ, ద్రౌపదిలోనూ తిమ్మక్క అనుభూతి ప్రతిబింబించింది. ఆమె స్వయంగా ఆ పాత్రల్లోనుంచి ఆకుచాటు పిందెలా తొంగిచూసి మౌనం వహించింది.

**వర్ణనలు :** తిమ్మక్క కావ్యంలో కమ్మని వర్ణనలు అనేకం కనిపిస్తాయి. వాటిలో సహజత్వము ఉంది. 15 శతాబ్దంనాటి వస్తు సామగ్రి ఉంది. ఆచారాలు,

అలవాట్లు ఉన్నాయి. తిమ్మక్క చేసిన వర్ణనల్లో మచ్చుకు కొన్నింటిని పరిశీలించడం మనోజ్ఞకరం.

సుభద్ర రైవతకాద్రికి నమస్కరించింది. అర్జునుడే తన భర్త కావాలని మనసులో కోరుకుంది. ఆ సమయంలోనే అర్జునుడు ఆమె ఆకారాన్ని మనసులోకి తెచ్చుకున్నాడు. ఇక్కడ తిమ్మక్క సన్నివేశ చిత్రణా సామర్థ్యం వెల్లడవుతుంది.

సుభద్ర చంద్రముఖి. మరాళకుంతల. ముక్త చిరుదరహాస. సింహమధ్య. ఈ రూపాన్ని అర్జునుడు తన మనోనేత్రం ముందు నిలుపుకున్న వైనం రమణీయం.

"యింతి మోముకు చంద్రు - డీ డైననేమి
కుంతలాల కలిమి - కొదమ తుమ్మెదలు
బాల కనుబొమల - ప్రతియౌను విల్లు
పాలించు ముత్యముల - పణతి చిర్నగవు
సతినాస తిలపుష్ప - సమమైనదేమి
అతివ మధ్యమ్ము సిం - హమునకు సరియె" (పుట 35)

స్త్రీల ముక్కును సంపంగి పువ్వుతో పోల్చడం కవి సమయం. ఇక్కడ తిమ్మక్క సుభద్ర ముక్కును నువ్వు పువ్వుతో పోల్చింది. రాయలసీమ ప్రాంతంలో సాధారణంగా మెట్టపంట్లలో వేసె నువ్వు పంట కూడా ఒకటి. పరిసర ప్రాంతంలో తాను చూసిన నువ్వు పువ్వును తిమ్మక్క కావ్యరచనకు ఉపయోగించు కొందేమో!

కృష్ణుడు సుభద్రను రమ్మని పిలిచాడు. అనేక సంబుద్ధులతో అలరించాడు. సుభద్ర ఆనందించింది. వయ్యారంగా అతని దగ్గరకు వచ్చింది. అప్పటి ఆమె రూపలావణ్యాలను, ఆభరణాలంకరణలను పాఠకుల కళ్ళకు కట్టేట్లు తిమ్మక్క వర్ణించింది. ఈ వర్ణనకు నమూనాగా తిమ్మక్క ఏ తెలుగింటి ఆడపడుచును తీసుకుందో ఏమో!

"అని యిట్లు తమ అన్న అంకించి పిలువ
పసిడి సలాక నా - పణతి సుభద్ర

వలిపువ్వు గుత్తుల - తలిరాకు బోణి
లలిత సౌరభ శోభ - గులుకరింపంగ
ససి చక్కగా పైట - సవరించుకొనుచు
నడవడ చిన్నారి - నడుము జవ్వాడ
అందెలు మ్రోయగ - హారముల్ తూగ
మొలనూళ్ళు ఘంటలు - మద్దియల్ మ్రోయ
సంది దండలు వెల్గ - సరిపెణల్దూల
దివ్వెలై హారముల్ - తెరవు జూపగను
హంసలనడకతో - నతివ సుభద్ర
అల్లనల్లన వచ్చె - అన్న ముందరికి" (పుట 41-42)

సుభద్ర కుహనా సన్యాసిని చూచినపుడు అతడు సన్యాసి వేషం సహజానికి చాలా దగ్గరగా కనిపించింది. నివురు గప్పిన నిప్పులా సన్యాసి వేషంలోనూ అర్జునుడి రాచఠీవి కనిపించింది. సుభద్రకు కనిపించిన అర్జునుడి సన్యాసి బొమ్మ తిమ్మక్క మనసులోంచి ఎలా వెలువడిందో గమనించడం సముచితం.

"మత్తాక్షి నిలుచుండె - మౌని జూచుచును
బృందావనము నీద - వెలయు నామౌని
కమాలార్క బింబంబు - గతి బోలు వాని
బాలేందు చాయల - పగిడి నిరుగడల
నెమ్మొగపుటూర్ధ్వపుం - డ్రమ్ములవాని
నొప్పు చందురకావి - నూటార్చినట్టు" (పుట 47-48)

సుభద్ర అర్జునుడితోనే అర్జునుడి గురించి ప్రస్తావించింది. అర్జునుడి గురించి కృష్ణుడు తనకు చెప్పాడంది. అతని రూపాన్ని అతడికే చెప్పడం ఇక్కడ విశేషం. సుభద్ర చెప్పిన అర్జునుని రూపం పాఠకుల మనోఫలకాల మీద కూడా నర్తించే విధంగా తిమ్మక్క ఇలా వర్ణించింది.

"యెగు భుజమ్ములవాడు - మృగరాజు నడుము
నడచి పుచ్చుకొను నె - న్నడుము గలవాడు
గరగరని వాడు చ - క్కనివాడు నతడు
గొప్ప కన్నులవాడు - కోదండ గుణకి
ణాంకంబులౌ బాహు - లమరినవాడు
వెన్నున మచ్చగల - విభవంబు వాడు
బవిరి గడ్డమువాడు - పన్నిదంబిడిన
వెన్ను పగడసాల - వెసనాడవచ్చు
చిగురొత్తు చంద్రిక - చెలగు పాదముల"          (పుట 53-54)

"కన్యావరయతే రూపం" అని శాస్త్రోక్తి. దానికి తగ్గట్టే సుభద్ర అర్జునుడి అందాన్ని వరించింది. ఆపైన రమణీయంగా వర్ణించింది.

సుభద్రార్జునులు వివాహం చేసుకొని ఇంద్రప్రస్థానానికి వచ్చారు. వారికక్కడ మంచి ఆదరణే లభించింది. ధర్మరాజు సూచన మేరకు ద్రౌపదే వారికి శోభనపు గదిని సింగారించింది. ఆమె మనసులో సపత్నీ మాత్సర్యం ఉన్నప్పటికీ అది కనిపించనీయకుండా అందంగా గదిని అలంకరించింది. అలంకరణలో ద్రౌపది నేర్పు, వర్ణనలో తిమ్మక్క నేర్పు ఒకేసారి, ఒకేచోట వ్యక్తం కావడం గమనార్హం.

"వేవేల రత్నముల - విందు తగజేసె
నొప్పైన బంగారు - టుప్పరిగలోను
కప్పుర వాసనల్ - గ్రమ్ముకొనంగ
సాంబ్రాణి ధూమముల్ - సఖితాను వేసి
చిత్రముల్ నిర్మించె - చెలియయంతటను
దిక్కుల మాణిక్య - దీపముల్ వెలుగ
నిలువుటద్దమ్ముల - నెలత చెక్కించె

వెయ్యి దీపంబులు - వెలుగంగ నందు
గవుసెనల్ఁ దీయించె - గాజు కంబముల
బంగారు తరికోళ్ల - పట్టెమంచమ్ము
అంగన వెలయించి - యమరించి సెజ్జ
సన్నవిరి మల్లెలు - జాజి మల్లెలును
బొండు మల్లెలు చాల - నిండ బరపించి
యిరుదెసల్ తలగడ - లిమ్ముగా దాసి
బంగారు సురటి తా - పణతి వెట్టించె
పంకించి బాగాలు - బరణులఁ బోసి
గాలించి సున్నము - కాయబెట్టించె
పండుటాకులుఁ దెచ్చి - పణతి మడిపించి" (పుట 69-70)

పెళ్ళిళ్ళ శోభనపుటింటిని తలపించే వర్ణన యిది. 15వ శతాబ్దంలో కూడా ఈవిధంగానే శోభనపు గదులను సిద్ధం చేసేవారేమో.

**సందేశం :** రచనకు లేదా కావ్యానికి సందేశం ఆత్మవంటిది. ఈ సందేశం రెండు విధాలు. పరోక్ష సందేశం. ప్రత్యక్ష సందేశం. కావ్యంలోని ఇతివృత్తం ద్వారా, అందలి అంశాల ద్వారా కవి వెలిబుచ్చే అభిప్రాయాన్ని పరోక్ష సందేశం అనవచ్చు. ఇది మథనప్రాయ సమాలోచన ద్వారానే పాఠకులకు లభిస్తుంది. దీన్ని గ్రహించడం కొంత కష్టంతో కూడుకున్న పనే. కవి స్వయంగాగాని పాత్రల ద్వారాగాని తెలియజేసే నీతి వాక్యాలను ప్రత్యక్ష సందేశంగా పరిగణించవచ్చు. బహు భార్యత్వం వల్ల వాటిల్లే అనర్థాలను తెలియజేయడం సుభద్రా కల్యాణంలోని పరోక్ష సందేశం అనిపిస్తుంది. ఇదేకాక సందేశప్రాయాలైన వాక్యాలు అనేకం ఈ కావ్యంలో అక్కడక్కడ కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని,

నారదుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. పాంచాలి పాండవులయిదుగురికి ఏకపత్ని కావడంవల్ల తలెత్తే సమస్యను సున్నితంగా సూచించాడు. సుందోప

సుందుల వృత్తాంతం తెలియజేసి స్త్రీవల్ల కలిగే అనర్థాన్ని ఎత్తిచూపాడు. ఎటువంటివారికైనా స్త్రీవల్ల ఇబ్బంది కలుగుతుందని తెలియజేశాడు.

"ఇంతుల కథలైన - నెంతవారికిని
చింతింప మదిలోన - చీకాకుగదురు" (సు.క. పుట-20)

అన్ని దానాలలోను అన్నదానమే మిన్న. అట్టి దానంకన్న ప్రాణదానమే మిన్న అని పెద్దల నానుడి. అందుకే కాబోలు ప్రాణ రక్షణ సమయంలో బొంకినా పరవాలేదని శుక్రుడు సమర్థించాడు. గోరక్షణానికి అర్జునుడు వెళ్ళాడు. నియమభంగం అయింది. ధర్మరాజు అనుమతితో తీర్థయాత్రకు బయలుదేరాడు. ఉలూచి తారసపడి వలచి వల్లభుడు కమ్మంది. తను తీర్థయాత్రలకు వచ్చిన విషయం తెలిపి ధర్మభంగం అవుతుందని అర్జునుడు ఆమెతో చెప్పాడు. ఈ సందర్భంలోనే ఉలూచి సర్వోత్తమ ధర్మాన్ని ప్రస్తావించింది. అన్ని ధర్మాలకన్నా ప్రాణదానమే సర్వోత్కృష్టం అంది.

"ధర్మమేదియు ప్రాణ - దానముతోను
తులదూగదని మహా - త్ములు పలుకుదురు" (సు.క. పుట-24)

**పరిశిష్టం :** ఇపుడు గమనించినవే కాక మరికొన్ని అంశాలు కూడా సుభద్రా కల్యాణంలో కనిపిస్తాయి. ఆనాటి ప్రజల విశ్వాసాలను, భాషలో కనిపించే సామెతలను ఇక్కడ గమనించవచ్చు. ప్రకృతికి పూజ చేయడం, తద్వారా మంచి కలుగుతుందని విశ్వసించడం ఆనాటి నుండి ఈనాటి దాకా కూడా జనంలో కనిపిస్తుంది. సుభద్ర అర్జునున్ని వరించింది. అంతటి దండి మగడికి అర్ధాంగి అయి తరించాలనుకుంది. అపుడే రైవతకాద్రి ఉత్సవం కూడా వచ్చింది. ద్వారకలో నివసించే యాదవులు పిండి వంటలతో, పూజా సామగ్రితో పర్వతం దగ్గరకు వెళ్ళి పూజించారు. మొక్కుబళ్ళు చెల్లించారు. అలా వెళ్ళిన యాదవులతో సుభద్ర కూడా వెళ్ళింది. తనకు అర్జునుడే భర్త కావాలని సంకల్పించి పర్వతానికి నమస్కరించింది.

"వాసవిసుతుడు తన - వరుడు కావలసి
ఆయచలమునకు - నా యింతి మ్రొక్కె"

రైవతకాద్రి చలించలేని జడపదార్థం. దానికి కోర్కెలు తీర్చే శక్తి లేదు. అయినప్పటికీ అలాంటి శక్తేదో ఉందని సుభద్ర పర్వతానికి నమస్కరించింది. నాటి సామాన్య జానపదుల ఆలోచనా ధోరణిని సుభద్ర చర్య ప్రతిబింబిస్తుంది.

సుభద్రా కల్యాణ కావ్యంలో ఆనాటి జానపదుల వాడకంలోని ఎన్నో పదాలు కనిపిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే శిష్ఠ భాషను, జానపద భాషను అన్నమయ్య వాడుకున్నట్టే తిమ్మక్క కూడా వాడుకుంది. తొలి తెలుగు వాగ్గేయకారుడిలాగే తొలి తెలుగు కవయిత్రి కూడా తన భాషలో విలక్షణత సాధించేందుకు ప్రయత్నించింది. ఎన్నో జాతీయాలు, నానుళ్ళు, సామెతలు ఈమె కావ్యంలో కనిపిస్తాయి. మచ్చుకు ఒకటి -

"తెరలి యేనుగు నెక్కి - దిడ్లు దూరె దరె"

కవులు ఎంతటి వారైనప్పటికీ కథన దక్షులైనప్పటికీ అవధానలోపం వల్ల, ఏకాగ్రతా లోపం వల్ల తప్పులు దొరలే అవకాశం ఉంది. శ్రీనాథుడు హరవిలాసం రాసినప్పుడు ఆరవ ఆశ్వాసంలో అవధానలోపం వల్ల కొన్ని తప్పులు దొర్లినట్టు ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యంలో ఎత్తి చూపారు. అలాగే తిమ్మక్క సుభద్రా కల్యాణంలో కూడా ఒక కథనలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సుభద్రా కల్యాణఘట్టం ఆదిపర్వం 8వ ఆశ్వాసంలోని వృత్తాంతం. అప్పటికి పాండవులు ఇంద్రప్రస్థంలోనే ఉన్నారు. వారు రాజసూయయాగం కూడా చేయ లేదు. సభాపర్వంలో చోటుచేసుకున్న ద్యూతక్రీడానంతర పాండవుల భంగపాటు అప్పటికి జరగనే లేదు. సభాపర్వంలో చోటుచేసుకున్న ఈ వృత్తాంతం కూడా ద్రౌపది మనసులో మెదలడం గమనార్హం. తనకు సవతిగా వచ్చిన సుభద్ర కృష్ణుడి చెల్లెలు. కృష్ణుడు కౌరవసభలో పాండవులను భంగపాటు నుంచి ఆదుకున్నవాడు. అటువంటి కృష్ణుని చెల్లెల్ని ఆదరించడం తన కర్తవ్యం అని తలపోసింది.

"అదిగాక సభలోన - ఆ కౌరవులకు
మాన భంగము గల్గు - హీనకాలమున
మాన ధన మొసగిన - మహాత్మ్యశాలి
అటువంటి శ్రీకృష్ణు - కనుగు చెల్లెలట" (పుట 74)

భావి వృత్తాంతాన్ని ముందే ప్రస్తావించడం సముచితం కాదు. తిమ్మక్క బహుకార్య భారంతోనూ, కుటుంబ భారంతోనూ మానసికంగా ఇబ్బందిపడి ఉండడం వల్ల ఈ అవధానలోపం సంభవించి ఉండవచ్చు. ఇది పరిగణనలోకి తీసుకోదగింది కాదు.

తిమ్మక్క సుభద్రా కల్యాణాన్ని ఏ ఉద్దేశంతో రచించినా రసవత్తరంగానే రాసింది. తర్వాతి కవులను ఆకర్షించే విధంగానే రాసింది. తిమ్మక్క తర్వాత చాలామంది సుభద్రాకల్యాణం రాశారు. వారిలో పేర్కోదగ్గవారు. చేమకూర వేంకట కవి, కూచిమంచి జగ్గకవి, వావిలి కొలను సుబ్బారావు, శ్రీ ముదిగొండ నాగవీరయ్యశాస్త్రి మొదలైనవారు.

వేంకటకవి విజయవిలాసం మీద తిమ్మక్క సుభద్రా కల్యాణ ప్రభావం ఉన్నట్లు విమర్శకుల విశ్వాసం. మా గురువుగారు కామిశెట్టి శ్రీనివాసులు గారు సుభద్రా కల్యాణానికి వ్రాసిన పీఠికలో ఇలా తెలియజేశారు" తిమ్మక్క సుభద్రా కల్యాణంలోని మెరుపులు 'విజయవిలాసం' కావ్యంలో స్పష్టంగ తొంగి చూస్తున్నాయి. దీనినిబట్టి చేమకూర కవి తిమ్మక్క పాటను అక్కడక్కడ అనుసరించిట్లు స్పష్టమౌతున్నది". చేమకూర కవి తిమ్మక్కను అనుసరించాడ-నేందుకు ఆధారంగా అర్జునుడి వర్ణనను తీసుకోవచ్చు.

## తిమ్మక్క సుభద్రా కల్యాణం

"యెగు భుజమ్ములవాడు - మృగరాజు నడుము
నడచి పుచ్చుకొను నె - న్నడుము గలవాడు
గరగరని వాడు చ - క్కనివాడు నతడు
గొప్ప కన్నులవాడు - కోదండ గుణ కి

జాంకంబులౌ బాహు - లమరినవాడు
వెన్నుగ మచ్చగల - విభవంబు వాడు
బవిరి గడ్డమువాడు - పన్నిదంబిడిన
వెన్ను పగడసాల - వెసనాడవచ్చు" (పుట 53)

## చేమకూర వేంకటకవి విజయవిలాసం

సీ॥ ఎగు భుజంబులవాడు మృగరాజు మధ్యంబు
బుడికి పుచ్చుకొను నెన్నడుము వాడు
.............................................
.....................................
గొప్ప కన్నులవాడు కోదండ గుణకిణాం
కములైన ముంజేతు లమరువాడు
బవిరి గడ్డమువాడు పన్నిందంబిడి డాగ
వచ్చు నందపు వెన్ను మచ్చవాడు
గీ॥ గరగరని వాడు నవ్వు మొగంబువాడు"
(విజయవిలాసం, ఆ. 2-164)

అన్నమయ్య మంజరీ ద్విపదలో శృంగార మంజరిని ద్విపద రామాయణాన్ని రచిస్తే అతడి అర్ధాంగి తిమ్మక్క ద్విపదలోనే సుభద్రా కల్యాణం రచించింది. అనంతర వాగ్గేయకారుల మీద అన్నమయ్య ప్రభావం కనిపించినట్లే తరువాతి కవులమీద తిమ్మక్క ప్రభావం గోచరిస్తుంది. తిమ్మక్క కూడా అన్నమయ్యలాగే వైదుష్యం కల్గి ఉన్నప్పటికీ, ఆయనలాగే జానపదుల గుండె సవ్వడి తెలిసిన పొలతి. ఈ చిన్నకావ్యంలోని ఆమె కవితా సౌందర్యం పాఠకుల అంతరంగాన్ని పట్టి కుదుపుతుంది. సుభద్రా కల్యాణం అలతి మాటలతో పాటగా రచించబడినప్పటికీ రసవత్కావ్యంగానే రాణకెక్కింది. తాళ్ళపాకవారి ఇల్లాలు శ్రద్ధతో పూయించిన ఈ పూవు ఆంధ్ర సారస్వతారామంలో ఎప్పటికీ పరిమళాలు వెదజల్లుతూనే ఉంటుందనటంలో సందేహం లేదు.

# పెద తిరుమలయ్య మధురభక్తి

తాళ్ళపాక సాహితీ స్రష్టల్లో పెద తిరుమలయ్య ద్వితీయుడు. ప్రక్రియా వైవిధ్యంతో రచన సాగించడంలో అద్వితీయుడు. దేశీయతకు పెద్దపీట వేసిన ప్రముఖ తెలుగు కవులలో తృతీయుడు. ఈయన కృతులను వెలయించడమేగాక అనేక కైంకర్య సత్కృతులను కూడా చేసి ఆంధ్ర సాహిత్య చరిత్రలోనేగాక ఆంధ్రదేశ చరిత్రలో కూడా సముచితస్థానం సంపాదించాడు. పెద తిరుమలయ్య రచనలు చేయడం ఒక ఎత్తయితే, తండ్రి రచనలను రాగిరేకులమీద చెక్కించి భద్రపరచడం మరొక ఎత్తు. పెద తిరుమలయ్య చేసిన ఈ సాహిత్య సేవకు తెలుగుజాతి అంతా అతనికి రుణపడి ఉందంటే అతిశయోక్తి కాదు.

తాళ్లపాక కవి వంశ మూలపురుషుడైన అన్నమాచార్యుడు శ్రీవేంకటేశ్వర స్వామి మీద 32వేల కీర్తనలు రచించాడు. స్వామి ఆదేశం మేరకు రోజుకొకటికి తక్కువ కాకుండా రచించాడు. అన్నమయ్య సంకీర్తనా రచన సంకీర్తనాయజ్ఞంగానే సన్నుతికెక్కింది.

అన్నమయ్య పరమపదిస్తూ తన సంకీర్తనా యజ్ఞభారాన్ని కుమారుడు పెద తిరుమలయ్యకు అప్పగించాడు. తనలాగే రోజుకొక కీర్తనకు తక్కువకాకుండా స్వామిమీద గానం చేయవలసిందిగా ఆదేశించాడు. అప్పటి నుంచి పెద తిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించాడు. పెద తిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో జీవనాయిక నాయకుడైన దేవుడికోసం పడే ఆరాటం కనిపిస్తుంది, శృంగార ప్రాథమిక దశనుంచి చరమదశ దాకా చోటు చేసుకునే వివిధ దశలు పెద తిరుమలయ్య శృంగార పదాల్లో కనిపిస్తాయి. పెద తిరుమలయ్య సంకీర్తనల్లో కనిపించే శృంగారాన్ని మధురభక్తిగా వ్యవహరిస్తారు.

భగవంతుడిలో చేరితే తాపం నశిస్తుంది. ఆపైన రూపం కూడా నశిస్తుంది. భగవంతుడి అనుగ్రహం పొందేందుకు అతనిలో చేరి ఆనందాంబుధిలో ఓలలాడేందుకు అనేక మార్గాలున్నాయని భాగవతం తెలియజేసింది.

"కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులుం
బ్రేమన్ మీరలు, భక్తినేమునిదె చక్రిం గంటి మెట్లైన ను
ద్దామ ధ్యాన గరిష్ఠుడైన హరిజెందన్ వచ్చు ధాత్రీశ్వరా!"

(శ్రీమదాంధ్ర భాగవతం, సప్తమస్కందం, పద్యం-18)

గోపికలు కామోత్కంఠతతో గోపాలకృష్ణుని పట్ల అవలంబించిన విధానాన్నే శృంగారభక్తి, మధురభక్తి, మధురభావన, దివ్య ప్రణయము అంటారు. ఆర్ద్రమైన మనసుతో భగవంతుని కోసం పరితపించే ఏదైనా భక్తి కాబట్టి మధురభక్తి కూడా భక్తిలోని అంతర్భాగమే అనటం నిర్వివాదాంశం. అయితే ఇది తనపోకడలతో కొంత ప్రత్యేకతను సంతరించుకొంది. డా॥ సి. నారాయణరెడ్డి గారు మధురభక్తిని ఇలా నిర్వచించారు. "భగవంతుని ప్రియునిగా భావించుకొని తన్ను తాను ప్రేయసిగా భావించుకొనుటయే మధురభక్తి".

ఆచార్య ఎస్. గంగప్పగారి అభిప్రాయానుసారం "అలౌకిక శృంగారమే మధురభక్తి".

ఆనందవర్ధనుడు తన ధ్వన్యాలోకంలో "శృంగార ఏవమధురః పర ప్రహ్లాదనోరసః" అని తెలియజేశాడు. కాబట్టి మధుర శృంగార రసాత్మక భక్తియైన దీన్ని మధురభక్తి అనడం అర్థవంతంగానే ఉంది.

మధురభక్తి సాహిత్యాన్ని, పండిత విమర్శకుల నిర్వచనాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే మధురభక్తి ప్రధాన లక్షణాలనిలా చెప్పుకోవచ్చు. ఆరాధనీయుడయిన భగవంతుడే దీనిలో నాయకుడు లేదా ప్రియుడు. ఆరాధించే భక్తుడే నాయిక లేదా ప్రియురాలు. భక్తుడు పురుషుడయినా, తనలో పుంస్త్వమే లేనట్లు స్త్రీత్వాన్ని ఆరోపించుకొని నాయకుడయిన భగవంతునికోసం పరితపిస్తాడు. భక్తుడయిన నాయిక భగవంతుడయిన నాయకుని దివ్యమంగళ విగ్రహాన్ని చూడడం వల్లనో, అతని మాహాత్మ్యం వినడం వల్లనో అతనిమీద వలపు జనించడం నాయికా విరహం, దౌత్యం, నాయికా నాయక సమాగమం మొదలైనవి మధురభక్తిలోని ప్రధానాంశాలు. సంయోగ విప్రలంబ శృంగారాలు రెండూ కూడా దీనిలో చోటు చేసుకుని ఉండడం గమనించదగి ఉంది. శైవులు సంయోగ

శృంగారానికి, వైష్ణవులు విప్రలంబ శృంగారానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తుంది.

భారతీయ సాహిత్యంలో మధురభక్తికి మహోన్నత స్థానం ఉంది. వేదాల్లో యోషాజారా భావంగాను ఉపనిషత్తుల్లో పత్నీపతి భావంగాను ఇది కనిపిస్తుంది. విష్ణుపురాణాది మహాపురాణాల్లోనూ మధురభక్తికి స్థానం లభించింది. రామాయణ అరణ్యకాండంలో నామమాత్రంగా చోటు చేసుకున్న మధురభక్తి భాగవతంలోని గోపికాకృష్ణుల శృంగారంలో వికసించి వినూత్న పరిమాణం పొందింది. నాయన్మార్లు, ఆళ్వార్లు కూడా మధురభక్తికి ప్రాధాన్యమిస్తూ రచనలు చేశారు. జయదేవుడు తన గీతగోవిందంలో రాధామాధవుల ప్రణయవృత్తాంతాన్ని ఆవిష్కరించాడు. అన్నమయ్య అలిమేలు మంగా శ్రీనివాసుల, గోపికా కృష్ణుల దివ్య ప్రణయాన్ని నిత్యనవ్యంగా చిత్రించాడు. అన్నమయ్య అడుగుజాడల్లోనే పురోగమించిన పెద తిరుమలయ్య కూడా మధురభక్తి జాలువారే శృంగార కీర్తనలనేకం రచించాడు. వాటిని రేఖామాత్రంగా చూపడమే ఈ వ్యాసోద్దేశం.

జీవితంలో యౌవనానికి ఎంతో ప్రాధాన్యముంది. స్త్రీ పురుషులను మానసికంగాను, శారీరకంగాను దగ్గర చేసే దశ ఇది. ఈ దశలో స్త్రీపురుషులు ఒకరినిగూర్చి మరొకరు వింటారు. వారి గుణగణాలు, రూపలావణ్యాలు పరస్పరం హృదయాల్లోప్రవేశిస్తాయి. ఒకరినొకరు చూడటంతటస్థిస్తే ఆ రూపలావణ్యాదులు అంతరంగంలో హత్తుకుపోయి శిలా చిత్రాలుగా నిలిచిపోతాయి. వీటివల్ల స్త్రీ పురుషులు ఒకరికొకరు దగ్గర కావాలనుకుంటారు. ఎలాగైనా కలుసుకోవాలనే కోరిక జనిస్తుంది. దీన్నే వలపు అని చెప్పుకోవచ్చు. ఈ వలపు భావన ద్వారా బలీయమవుతుంది. ఈ స్థితిలో ఉచితానుచితాలుగాని, సాధ్యాసాధ్యాలుగాని, సమయా సమయాలుగాని పరిగణనకు రావు. స్త్రీ పురుషుల ఆలోచనాశక్తిని నశింపజేసే ఈ స్థితినే మోహమని వ్యవహరిస్తారు. శృంగార జీవితంలో వలపు తొలిదశ అయితే మోహం మలిదశ. పెద తిరుమలయ్య నాయికలో ఈ మోహం గోచరిస్తుంది.

నాయికకు నాయకుడి మీద మోహం క్రమంగా పెరగసాగింది. నాయకుడు వచ్చినప్పుడు ఎన్నెన్నో చెప్పాలనుకుంది. ఏవేవో చెయ్యాలనుకుంది. అయినా

అవేవీ సాధ్యపడలేదు. కారణం పారవశ్యం. కమనీయ మోహాధిక్యత. తనకు ప్రాప్తించిన ఈ మోహావస్థను నాయికే నాయకుడుకి స్వయంగా తెలియజేసింది.

"ఏమి సేతు నా భాగ్యము యెఱిగీ నెఱుగ నీదు
నా మోహమే మిక్కుటమై నన్ను దడబరచెను

భావించి నిన్ను జూచితే పరవశమౌదుగాని
ఆవేళ నీతో సరసమాడ మరతు
చేవ మీఱఁ దలచితే చిత్తము గరగుగాని
వోవరిలో గుబ్బల నిన్నొత్తి పట్టమఱతు

గక్కన నీవెదురైతే కడుసిగ్గురేగుగాని
పెక్కు వుపచారాల మెప్పించమఱతు
తక్కిక నీవంటి తేను తమకమే నిండుగాని
చొక్కించి నా చేతలు చూపగ మఱతు

జట్టిగా నిన్నుఁ గూడితే సంతోసమే నిండుగాని
గుట్టున నీ మోవి చవిగొనమఱతు
యిట్టె శ్రీ వేంకటేశ యేనలమేల్మంగను
నెట్టన నీ గుణాలు వర్ణించ మఱతు"

(పెద తిరుమలాచార్యులు - శృ.సం. 23-245)

**విరహం :** మోహం తరువాతి దశ విరహం. శృంగార జీవితంలో అయోగ, సంయోగ, వియోగాలనే మూడు దశలు ప్రధానంగా చోటు చేసుకుంటాయి. విరహం అయోగ వియోగాల్లో చోటుచేసుకోవడం గమనార్హం. ఒక్కమాటలో చెప్పాలంటే శృంగార జీవితంలో సంయోగమెంత ముఖ్యమో విరహం కూడా అంతే ముఖ్యమని అభిప్రాయం.

నాయికా నాయకులిద్దరూ పరస్పరం ఆకర్షితులౌతారు. ఆ ఆకర్షణ వలపుగాను, మోహంగాను వికసిస్తుంది. పరిస్థితుల ప్రభావం వల్లనో, అవకాశం లభించకపోవడం వల్లనో వారి కలయిక వీలుపడదు. కలయిక వాయిదాపడే కొద్దీ కలుసుకోవాలనే కాంక్ష తీవ్రతరమవుతుంది. అది తాపంగా రూపం

దాలుస్తుంది. ఈ తాపాన్నే విరహమని వ్యవహరిస్తారు. నాయకుడు మగవాడు. బహు వ్యాపకాలున్నవాడు. అందువల్ల విరహ ప్రభావం నాయకుడి మీద అంతగా కనిపించదు. విరహం ఏర్పడినా నాయికను ఇబ్బంది పెట్టినంత బాగా నాయకుడిని ఇబ్బంది పెట్టదు. అందువల్ల కవులు నాయిక విరహాన్ని వర్ణించడానికిచ్చినంత ప్రాధాన్యత నాయకుని విరహాన్ని వర్ణించడానికి ఇవ్వలేదు. చంద్రుడు, మలయానిలం, తుమ్మెదలు, ప్రకృతి సౌందర్యం, మన్మథ విజృంభణ స్త్రీని బాధపెట్టినంత బాగా పురుషుణ్ణి బాధపెట్టలేకపోతాయి ఎందుకోమరి. నాయికకు విరహావస్థ ఏర్పడినప్పుడు చెలులామెకు రకరకాల శైత్యోపచారాలు చేస్తారు. ఈ దృశ్యాలు మన కావ్యాల్లో కోకొల్లలు. వాగ్గేయకారులు కూడా తమ శృంగార సంకీర్తనల్లో నాయికా విరహానికి సముచితస్థానం కల్పించారు.

ప్రియుణ్ణి మొదట చూచి, తర్వాత ఎదురుచూచి నాయిక కళ్ళు ఎరుపెక్కాయి. ఆ కళ్ళలో రాగమూ ఉంది. విరహాగ్ని జ్వాలా ఉంది. నాయకుని ఎడబాటుతో విపరీతమైన విరహానికి గురైన నాయిక అతను వచ్చినప్పుడు తన కోపతాపాల్ని ప్రదర్శించింది. అయినా ఆమె విరహం తగ్గలేదు. అధికం కాజొచ్చింది. ఇది చింతను పెంచే విరహం. వంతకు దోహదకారి. ఈమె పెదతిరుమలయ్య నాయిక.

కాంతుని దప్పక చూచి కన్నులెల్లా యెఱ్ఱనాయె
యెంతయినా మానదుకాక యికనేమి సేతునే

తానిందాకా రానెందుకు దగ్గరినేవాదుసేసి
పూనియంత దిట్టినాను పోదు గోపతు
ఆనవెట్టి రమణుని యంగము పచ్చి సేసినా
మానదు నాచలమింక మఱియేమి సేతునే

సారెబొంకి నందుకు సంగడి వారెల్లాజూడ
చేరి పాదాన జిమ్మినా చింతవాయదు
కూరిమి నాపతి నిట్టి కుచముల గుమ్మినాను
తీరదు నా నెంజిలి దీనికేమి సేతునే

ఆకడఁ దాఁబరాకైన యందు నెగడవెట్టి
వాకిటఁ దన్నునాగినా వగపు పోదు
కైకొని శ్రీ వేంకటాద్రి కడప రాయుడుగూడె
వాకున నాడక మానవదె నేమిసేతునే

(పెద తిరుమలాచార్యులు - శృ.సం. - 23-30)

పెద తిరుమలయ్య నాయిక విరహాగ్ని వర్ణించడంతోనే సంతృప్తి చెందలేదు. ఈ పక్షపాతం ఎందుకనుకున్నాడో ఏమో నాయకునిలో ప్రజ్వరిల్లిన విరహాన్ని కూడా చిత్రించాడు. తన సమదర్శిత్వాన్ని చాటుకున్నాడు. నాయిక రూపం నాయకుని మనసులో తాపాన్ని రేకెత్తించింది. ఆమెను పొందాలనే ఆరాటం అధికమైంది. పర్యవసానంగా విరహం ప్రకోపించింది.

పెద తిరుమలయ్య నాయకుడు కృష్ణుడు. కృష్ణుడంటే శృంగార రసాధినాథుడు. ఆయన శృంగార క్రీడలు సుప్రసిద్ధాలు. అతనిక్కూడా విరహం వచ్చింది. వాస్తవ జ్ఞానం తాత్కాలికంగా సెలవు పుచ్చుకొంది. కోయిల కూత చెలి పిలుపని భ్రమపడ్డాడు. నెమలిని తన చెలి అనుకున్నాడు. తామరలను చెలి మోవి అని తలపోశాడు. భ్రమ కలిగించిన ఇతని విరహాన్ని పెద తిరుమలయ్య కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు.

"మగవాడు భ్రమసిన మరి తెలుపగరాదు
నగుబాటు చూడరమ్మ నాటకీడు కృష్ణుడు ॥

కోవిల గుయ్యగాను గోపిక పిలిచెనంటా
ఆవల దగ్గరబోయి అందుగానక
ఆ వేళ నొక్క నెమలి యాడనేగగాఁ జూచి
భావించి చెలియనుచుఁ బట్టఁబోయ గృష్ణుడు ॥

తీగె యల్లాడగాఁ జూచి తెఱవ చే సన్నలివి
నా గతి ననుచుఁ జేరి యటు గానక
సోగలనందుఁ గొలని సొంపు దామెరను జూచి
భాగుల జెలి మోవని పట్టబోయ గృష్ణుడు ॥

చెట్టుపై బూవులు రాలచెలిసేస వెట్టెనంటా
అట్టె శ్రీ వేంకటేశు c డాలకించగా
కట్ట గడనింతి యదిగని నిజముగ వచ్చి
యెట్ట యెదుటనే వుండె నేచి కూడె గృష్ణుడు ॥"

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-251)

**సఖీదౌత్యం :** నాయికా నాయకులకు విరహం దుర్భరమవుతుంది. శైత్యోపచారాలు కూడా పనిచేయవు. ఒకరినొకరు కలుసుకోవడం తప్ప గత్యంతరముండదు. అలాంటి సమయాల్లో నాయికా నాయకులు దూతలను పంపుకొంటారు. కాళిదాసు యక్షుడు మేఘాన్ని దూతగా పంపితే, త్రివిక్రమభట్టు దమయంతి నలుని దగ్గరకు ఒక పురుషుణ్ణి దూతగా పంపుతుంది. రామాయణం లోని హనుమద్దౌత్యం, భాగవతంలోని అగ్నిద్యోతన దౌత్యం ఈ కోవకే చెందుతాయి.

నాయికలు నాయకులు కూడా చెలికత్తెలను దూతలుగా పంపడం తటస్థిస్తుంది. వారిద్వారా పరస్పరం కానుకలు పంపుకోవడం కూడా పరిపాటి.

పెద తిరుమలయ్య నాయిక పంపిన దూతిక నాయికలో చోటుచేసుకన్న వలపును, దాని లక్షణాలను వర్ణించింది, వేగమే విచ్చేయుమని వేంకట విభుణ్ణి కోరింది.

"ఏలమాను నిద్దరికి నిటువంటి పొందులు
వేళాయ జెలికడకు విచ్చేయవయ్యా....."

చెలి కన్నుల నంటెను సింగారపు నీ రూపు
నిలిచె బాదములందు నీపై తమి
వలపు శిరసుకెక్కె వనితకు నీకుగానే
కలిగె నెన్నడుమను కందువ నీ గుణము ॥

యింతి మదిలోc బెరిగీనిదె నీపై కోరికలు
పంతము చన్నుc గొండలపై నాటెను
వంతుకు నీ వుంగరము వనితనేలనున్నది
వింతాయ నీ విలువిద్య వెలది బొమ్మలను

మగువ నీ బుద్ధులెల్లా మనసాయ రతివేళ
తగె నీ ప్రేమ కలికితనమునను
నగుతా శ్రీవేంకటేశ నాతి గలసితి విట్టి
పగటులిద్దరికిని పాయమున నిలిచె ॥

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-447)

**ప్రణయకోపం :** జీవితంలో కోపం ప్రమాదకరమైతే, శృంగార జీవితంలో ప్రణయకోపం ప్రమోదకరం. నాయికా నాయకులిద్దరూ ఒక్కటయ్యాక తటస్థించే దశ ఇది. ఈ ప్రణయకోపం నాయికలలో ఎక్కువగాను, నాయకులలో తక్కువగాను తరచూ కనిపిస్తుంది.

నాయిక కంటే నాయకుడికే వ్యాపకాలు ఎక్కువ. పనుల భారం వల్లనో, మరే కార్యాంతరం వల్లనో నాయకుడు అనుకున్న సమయానికి నాయికను కలుసుకోలేకపోతాడు. నాయిక నాయకుడు తనపట్ల చూపే నిర్లక్ష్య ధోరణిగా దాన్ని పరిగణిస్తుంది. ఆమెలో కోపం కలుగుతుంది. తాపం చెలరేగుతుంది. ప్రణయం వల్ల కలిగే ఈ కోపాన్నే ప్రణయకోపం అని ప్రాజ్ఞులు వ్యవహరించారు. నాయకుడు అనుకున్న సమయానికి రానందువల్ల కలిగిన కోపాన్ని, విరహతాపాన్ని నాయకుడు వచ్చినప్పుడు నాయిక అతనిముందు వెళ్ళగక్కుతుంది. అతన్ని నిందించడం ద్వారా ఉపశమనం పొందుతుంది. అదును కనిపెట్టిన నాయకుడు ఆమెను తనలో ఐక్యం చేసుకొని ఆనందాంబుధిలో ఓలలాడిస్తాడు. తానుకూడా సంతోషసాగరంలో అనుభూత్యావగాహనం చేస్తాడు.

నాయిక నాయకునిమీది ప్రణయకోపంతో బాగా వేగిపోయింది. అధిక్షేప సూచక సంజ్ఞలు వెలువడ్డాయి. అయినా ఆ నాయకుడు సహించాడు. నాయిక మెప్పుకు పాత్రుడయ్యాడు. పెద తిరుమలయ్య కీర్తనలో రూపుదాల్చిన దృశ్యమిది.

మేలునాయది వలచిన వారి మేకుల బెట్టేది
నాలికాడు నా చన్నులు కొనగోర నాటించె నేనింక నేమి సేతునే ॥

నాడు నాడే యీ సుద్ది చెప్పిన నా యంత నేనుందును
వేడి వేడి కాకలు రేచి వెతలు సేయింతురా

ఆడుదాననై మూలనుండితే నాసలెల్లా మానునా
నేడు తన మోవి యిచ్చి కతలెల్ల నేరిపె నేనెట్టు విడుతునే ॥

చాలదా యింత తడవు నాతో సరసము దనకు
ఆలించి యాడబొంచు వినీనో అంత మాయకాడు
తాళమంటినట్టు శ్రీ వేంకటేశుడు దగ్గరి నన్ను గూడెను
యేలో నాకు నవ్వులివే ముంచుకొనె నేడనుంటివని యడుగరే ॥

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-91)

"ఆడువారు కడుగోపులవుట నీవెఱగవా
నేడుగొత్తలుగా భూమి నేర్చుక వచ్చేరా ॥"

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-31)

**అష్టవిధ నాయికలు :** మన లక్షణశాస్త్రం నాయికలను పలు విధాలుగా వర్గీకరించింది. శరీర లక్షణాలను బట్టి నాలుగు విధాల నాయికలను పేర్కొంది. పద్మిని, హస్తిని, శంఖిని, చిత్తిని. తాళ్ళపాక అన్నమాచార్యుడుకూడా తన సంకీర్తనల్లో లక్షణాలతో సహా ఈ నాయికలను పేర్కొని ఉండడం గమనార్హం. నాయికల శృంగారావస్థలను దృష్టిలో ఉంచుకొని 8 రకాల నాయికలను కూడా లక్షణశాస్త్రం పేర్కొంది. వారు - 1) స్వాధీనపతిక, 2) వాసక సజ్జిక, 3) విరహోత్కంఠిత, 4) విప్రలబ్ధ, 5) ఖండిత, 6) కలహాంతరిత, 7) ప్రోషిత పతిక, 8) అభిసారిక.

**స్వాధీనపతిక :** మనసును దోచే ప్రవర్తనతోను, మాట, మన్ననలతోను నేర్పుతో, ఓర్పుతో నాయిక నాయకుణ్ణి తనకు వశవర్తిగా చేసుకుంటుంది. అతడు ఆమె చెప్పినట్టల్లా చేసే స్థితికి తెచ్చుకుంటుంది. ఈమె స్వాధీన పతిక. ఈ లక్షణాలున్న నాయికను పెద తిరుమలయ్య తన శృంగార సంకీర్తనలో చక్కగా చిత్రించాడు.

అలిమేలు మంగ సలిగ గల ఆలు. వేంకటేశ్వరుడు చెప్పినట్టల్లా చేసేటి చేకొలది మగడు. ఆమెకు అతడు దక్కినవాడు. అలిమేలుమంగే పెద తిరుమలయ్య చిత్రించిన స్వాధీన పతిక.

"మాకేమి మీకెట్టున్నా మంచిదే నేడు
పైకొని మీ వారమై బ్రదికేమునేము
చెప్పినట్టు సేసేటి చేకొలది మగడాయ
అప్పుడే సలిగగల ఆలవైతివి

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-196)

**వాసక సజ్జిక :** నాయకుని రాకకోసం ఎదురుచూస్తూ పడకటింటిలో వేచి ఉండే నాయిక వాసక సజ్జిక.

నాయిక మంచమెక్కి నాయకుని కోసం నిరీక్షించింది. నాయకుడు ఎంతో ఆలస్యంగా వచ్చాడు. అతడు రాకముందే అతని చేతలన్నీ చెలుల ద్వారా తెలుసుకొంది. నిష్ఠూరంగా మాట్లాడింది. మంచములో చోటిచ్చి మరుకేళిలో సొక్కింది. ఈమె పెదతిరుమలయ్య చిత్రించిన వాసక సజ్జిక.

"................................
............. మంచమెక్కి వున్నదాన
నీ చేటన్నియును నీ వెంటనే వచ్చె
కూచుండ రాయికనైన కుదురయిలోనను ॥

యెదురు చూచితిగానీ వేడనుంటివోకాని
పదరకురా యిది పంతముగాదు
పొదిగి శ్రీ వేంకటేశ పోనీక నన్ను గూడితి
వుదుటై యెందును బోక వుండరా యిాలోనను ॥

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-81)

**విప్రలబ్ధ :** నాయకుడు రాకపోవడం వల్ల విరహంతో తపించే నాయిక విప్రలబ్ధ. నాయకుడు రాలేదు. నాయిక దూతికను పంపుతుంది. అయినా అతని జాడలేదు. అతని స్మృతులు మదిలో మెదులుతాయి. ఆమె తాపం అగ్గలమవుతుంది. సంయోగానంతర వియోగ విరహాలకు గురైన ఈ నాయిక విప్రలబ్ధ.

పెద తిరుమలయ్య నాయిక నాయకుని కోసం ఎంతగానో వేచి చూసింది. వేసారింది. అతడు వచ్చేట్టు కనిపించలేదు. విరహమంతకంతకు అధికం కాసాగింది. దుస్సహమైన ఆమె విరహతాపాన్ని చెలికత్తెలతో చెప్పుకొంది. తనను వంతకు గురిచేసిన వలరాజు జనకుడు ఎంతకూ రాడేమని వాపోయింది. ఏ కాంతచెంత ప్రొద్దుపుచ్చాడో నిలదీయండని చెలికత్తెలకు సూచించింది. అందువల్ల ఈమె విప్రలబ్ధ.

"అనరే యిట్టే యెనసి దోసమనరే చెల్లదనరే మీరాతనితో నేడు నా
మనసెల్ల దనవెంట వెంటనే మరపె నేనెట్టు మఱతునే
యేలరాడే రమణుడు తనకేమి సేసితినే
వేళతో దానిన్నాళ్ళింతకు విచ్చేసుదానీడకు
.......................................
......................................."

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, శృ.సం. 23-91)

పెద తిరుమలయ్య తన శృంగార సంకీర్తనల్లో నాయికా మోహం, నాయికా నాయకుల విరహం, సఖీదౌత్యం, ప్రణయకోపం మొ॥న అంశాలను పేర్కొన్నాడు. అష్టవిధ నాయికలలో స్వాధీనపతిక, వాసక సజ్జిక, విప్రలబ్ధలను గూర్చి మాత్రమే ప్రస్తావించాడు. తక్కిన నాయకుల గురించి ఎందుకో అతడు ప్రస్తావించలేదు. మధురభక్తిలో ప్రధానాంశమైన జీవనాయిక భగవన్నాయికల గురించి, నాయిక నాయకుడికోసం పడే ఆరాటం గురించి, శృంగార జీవితంలోని వివిధ దశల గురించి చక్కగా తెలియజేశాడు. మధురభక్తితో మాధవుణ్ణి ఆరాధించి మాయను తరించి ఆయనతో ఆయనలో ఐక్యం కావలసిందిగా అన్యాపదేశంగా సూచించాడు.

# చిన తిరుమలయ్య ఆధ్యాత్మిక వైభవం

**తా**ళ్ళపాక వాగ్గేయకారుల్లో చివరివాడు చిన తిరుమలయ్య. ఈయన తాళ్ళపాక అన్నమాచార్యుని పౌత్రుడు. పెద తిరుమలయ్య జ్యేష్ఠ పుత్రుడు. తాత తండ్రుల్లాగే వేంకటేశ్వరుని మీద అపార భక్తి కలవాడు. వేంకటేశ్వర సాక్షాత్కారం పొందిన తాత అన్నమాచార్యులవారే స్వయంగా ఈయనకు అక్షరాభ్యాసం, బ్రహ్మోపదేశం చేయడం విశేషం. చిన తిరుమలయ్య తండ్రిలాగే కైంకర్యాలనేకం చేసి కీర్తి గడించిన వదాన్యుడు.

చిన తిరుమలయ్య కూడా తాత తండ్రుల్లాగే అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించాడు. ఈయన అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించాడు. ఈయన అధ్యాత్మ సంకీర్తనలు 60, శృంగార సంకీర్తనలు 119 సంపుటీకరింపబడి తిరుమల తిరుపతి దేవస్థానం వారిచేత ప్రచురింపబడ్డాయి. తాతగారు సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణాన్ని తేనెలొలికే తేట తెలుగు మాటలతో ఈయన ఆంధ్రీకరించాడు. అష్ట భాషాదండకాన్ని రచించి తన అష్టభాషా వైదుష్యాన్ని లోకానికి చాటుకున్నాడు.

చిన తిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలు తక్కువ సంఖ్యలోనే ఉన్నప్పటికీ వాటిలో తెలుసుకోవలసిన విషయాలు అధిక సంఖ్యలోనే ఉన్నాయి. మళ్ళీ మళ్ళీ మననం చేసుకొని వంటబట్టించుకోదగిన కొన్ని అంశాలను ఈ వ్యాసం ప్రస్తావిస్తుంది.

**మేలు కొలుపు :** దేవతలకు నిద్రాహారాలు లేకపోయినా వాటిని ఆరాధించే మానవుడు వాటిని ఆపాదిస్తాడు. దేవతలను కూడా మానవులుగానే భావించి మేలుకొలుపుతాడు. షోడశోపచారాలతో పూజించి నైవేద్య ఫల తాంబూల దక్షిణాదులను నివేదించి సంతృప్తి చెందుతాడు. పరమాత్మానుగ్రహం తనమీద పరిపూర్ణంగా ప్రసరించినట్టు భావించి పరమానందభరితుడౌతాడు. ప్రాచీన కాలం నుండి ఆలయాల్లో మేలుకొలుపులు పాడే ఆచారం ఉంది. శ్రీవేంకటేశ్వర సుప్రభాతం ఈవిధంగానే వచ్చి ఉంటుంది. శ్రీ మల్లికార్జున సుప్రభాతం, శ్రీ

రాఘవేంద్ర సుప్రభాతం ఈ కోవకే చెందుతాయి. వాగ్గేయకారులు కూడా తమ ఆరాధ్య దేవతలను ఉద్దేశించి మేలుకొలుపులు రచించి గానం చేశారు. అన్నమయ్య, పెద తిరుమలయ్య కూడా మేలుకొలుపులనేకం రచించారు. వారి అడుగుజాడల్లో పురోగమించిన తిరుమలయ్య చక్కని మేలుకొలుపు కీర్తన రచించాడు.

చిన తిరుమలయ్య వేంకటేశ్వరుణ్ణి గోవిందుడిగానే భావించి మేలు కొలిపాడు. వాసవాదులు వచ్చి వాకిట వేచి ఉన్నారన్నాడు. భక్త పాలనకు వేళయిందని గుర్తు చేశాడు. రతిసుఖం నిరత కర్తవ్యానికి నీళ్ళు వదిలేట్లు చేయకూడదని ధ్వనింపజేశాడు.

"గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమానీకు॥

కమలజ చల్లని కాగిటఁ దగిలి
సమరతిఁ బాయగ జాలవూ
కమలభవాదులు కడునుతియింపగ
విమలపు శయనము విడవగలేవు ॥

భూసతి తోడుత పొందులు మరిగి
వే[illegible]దె నీ వేడుకలా
వాసవ ముఖ్యులు వాకిట నుండగ
పాసి వుండనని పవళించేవూ ॥

నీళా మనసిజ లీలల దగిలి
నాలితోడ మానగ లేవూ
వేళాయను శ్రీ వేంకటనాథుడ
పాలించి దాసుల బ్రతికించగనూ॥"

(చిన తిరుమలయ్య, అ.సం. 10-57)

**ప్రబోధం :** మహాత్ములు తాము తరించడమేగాక ఇతరులను కూడా తరింపజేసేందుకు యత్నిస్తారు. తమకు తోచిన మంచి విషయాలను బోధించి లోకులలో జ్ఞానాన్ని కల్గించేందుకు ప్రయత్నిస్తారు. ఇతరులకు చేసే బోధనలో భాగంగా తమ మనసుకు కూడా బోధిస్తారు. దీన్నే మానసిక ప్రబోధమని వ్యవహరించవచ్చు. చిన తిరుమలయ్య జనుల చిత్తాలకు హత్తుకొనేలా తన చిత్తాన్ని ఉద్బోధించాడు. ప్రాపంచిక సుఖాలు ఎండమావులవంటివన్నాడు. వేంకటేశ్వరునాశ్రయించి శాశ్వత సుఖాన్ని పొందడమే సముచితమన్నాడు. ఇది ఆయన చిత్తానికి చేసిన ప్రబోధం మాత్రమే కాదు, లోకులకు చేసిన ప్రబోధం కూడా.

"చెప్పే నా మాట విను చిత్తమా
చిప్పిలు నెండమావుల చెరువులు నున్నవా ॥

వెగటైన విషయాల వేడుక పడకు మవి
జిగురు గండె సుమ్మీ చిత్తమా
పొగరు మూపుదనాల బొరలకు మవియెల్ల
తగులు విరిపందెల దారివంటివి ॥

బలిమినె యాసల బారిఁ బడకుమవి
చిలుకల వోదాలో చిత్తమా
తలచి చూచితేనె తప్పులు దారులె
కలలోని రతుల యాకట వంటివి ॥

మేరమీరె కోరికల మిసిమి చూడకుమవి
జీరుకు బందలోయి చిత్తమా
చేరువనె కాచెటి శ్రీవేంకటనాథుఁగని
గారవాన బ్రదుకు మీ కల్పవృక్షతమదు ॥

(చిన తిరుమలయ్య అ.సం. - 10-12)

**నీతి ప్రబోధం :** జీవితంలోను సాహిత్యంలోను నీతికెంతో ప్రాధాన్యముంది. సాహిత్య ప్రాచీన దశనుంచి కూడా నీతే సాహిత్యానికి ప్రాణప్రాయంగా భాసిస్తూ

ఉంది. నీతి అంటే సత్ప్రవర్తనము, ధర్మానుకూలముగా నడుచుట, విధము, రీతి అని సూర్యరాయాంధ్ర నిఘంటువు తెలియజేస్తుంది. నీతి చెప్పడం అంటే బ్రతుకురీతి చెప్పడం, సముచిత పద్ధతి చెప్పడం అని అభిప్రాయం. ఇలా ఉండాలి. ఇలా ఉండకూడదు. ఇలా చెయ్యాలి. ఇలా చెయ్యకూడదు. చెడు పర్యవసానం ఏమిటి? మంచికి ఫలితమేమిటి? మొదలైన అంశాలను బోధించడమే నీతి ప్రబోధం.

అవాంఛనీయ కృత్యాలు అవాంఛనీయ ఫలితాలనే ఆహ్వానిస్తాయి. ఈ సంగతి తెలిసి కూడా జనం అవాంఛనీయ కృత్యాలపట్లే ఆసక్తి చూపుతారు. ఇది గ్రహించదగిన విషయం. వేంకటేశ్వరుని ఆశ్రయించి అన్నిటా మేలు పొందటమే అభిలషించదగిన అంశం. ఇదే చిన తిరుమలయ్య లోకులకు బోధించిన నీతి.

"ఏలికయైన హరినేల మరువవలె
పాలుమాలి మరియాల భంగపడవలెను॥

యిరుకుమాని సందినేటికి జొరవలె
తిరుగక లేక యేల తినుక వలె
యెరవుల విషయాల నేల పొరలవలె
కొరగాని పాపాల గొడవేల వలెను ॥

మిగుల వురులలోన మెడయాల పెట్టవలె
తగిలించుకొని యేల పొగులవలె
యెగసక్కెపుఁ గోరికలేల కోరవలె
జిగురువంటి బందాలఁ జిక్కనేలవలెను॥

పారేబండికింద పాదమేల చాచవలె
జారుపడి మరియాల జడియవలె
మీరి శ్రీ వేంకటనాథు మిక్కిలి వేడుకఁ గొల్చి
పోరుమాలి వుండకేల పొడి బడవలెను ॥

(చినతిరుమలయ్య - అ.సం. 10-49)

**వైరాగ్య ప్రబోధం :** మోక్షసాధన సామగ్రిలో వైరాగ్యానికెంతో ప్రాముఖ్యముంది. 'విరాగస్య భావం వైరాగ్యం' విరాగమంటే రాగం లేకుండడం. రాగమంటే ఇష్టం. ప్రపంచ సుఖాలపట్లగాని విషయ సుఖాలపట్లకాని ఎలాంటి ఇష్టమూ లేకుండడమే వైరాగ్యమని అభిప్రాయం. వైరాగ్యశబ్దానికి సూర్యరాయాంధ్ర నిఘంటువులో విరక్తి, ప్రాపంచిక విషయములతో సంబంధము వదులుకొనుట, విషయవాంఛలు లేకునికి. (2) అసంతుష్టి, వైమనస్యము, చింత, దుఃఖము అని అర్థాలున్నాయి. 'విద్యార్థి కల్పతరువు'లో ప్రపంచ విషయములందు అనురాగము లేకుండుట' అని, 'తెనుగుపర్యాయ పదనిఘంటువు'లో వైరాగి, విరక్తి, విరాగత్వము అనే అర్థాలు గోచరిస్తాయి. శబ్ద రత్నాకరంలో విరాగత్వము, విషయేచ్ఛా రహితత్వము అని వైరాగ్యానికి అర్థాలు చెప్పబడ్డాయి.

ధనధాన్యాలు, చుట్టపక్కాలు, రాజులు, ఇవ్వగలిగే సుఖాన్ని భగవంతుడు కూడా తప్పక ఇస్తాడు. అందరికంటే, అన్నిటికంటే ఎక్కువ సుఖాన్నే అతడు అనుగ్రహిస్తాడు. కావల్సినదల్లా అతనిపట్ల అచంచల విశ్వాసం. అన్యంపట్ల అనాదరణ. చిన తిరుమలయ్య ప్రాపంచిక సంబంధాలపట్ల విరాగం పెంచుకొని భగవంతునిపట్ల విడదీయరాని ఆసక్తిని, భక్తిని పెంచుకోవల్సిందిగా వైరాగ్య ప్రబోధం చేశాడు. అతని కీర్తనంతా ఆలోచింపజేసే ప్రశ్నలమయం.

"మాయలో మునుగనేల మమతలేల
చేయరా దేవుడీపాటి సేయనోపడా ॥

అట్టె దేహ సమ్మంధ మాసపడే జీవులాల
పట్టి హరి సమ్మంధాన బ్రదుకరాదా
నెట్టన సర్వాంతరాత్మె నిలుచున్న దేవుడిట్టె
చుట్టాల పక్కాల పాటి శుభమియ్యనోపడా ॥

మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
వేసరక విష్ణుభక్తి వెదకరాదా
రాసికెక్క యిందరిని రక్షించె దేవుడె
కాసు వీసముల పాటికావనోపడా ॥

వెలయరాజులను దీవించె ప్రాణులాల
కల శ్రీ వెంకటనాథు గానగ రాదా
వలెనని యిందరికి వరాలిచ్చే దేవుడేమి
కొలువు నిలువు పాటి గుణమియ్యనోపడా ॥

(చిన తిరుమలయ్య - అ.సం. 10-42)

**విముఖత :** విముఖత అంటే వ్యతిరేకత కలిగి ఉండడం అని అభిప్రాయం. పారమార్థిక రంగంలో పురోగమించే వారు ప్రాపంచిక విషయాలపట్ల విముఖత కల్గి ఉంటారు. కొందరు రాజాశ్రయంపట్ల వైముఖ్యాన్ని ప్రదర్శిస్తారు. మరికొందరు తాము ఆరాధించే దేవతలను తప్ప అన్య దేవతలను పట్టించుకోరు.

**రాజాశ్రయ విముఖత :** రాజుల అభిమానము, వారిచ్చే భోగ భాగ్యాలు శాశ్వతంగా ఉండవు. పైగా రాజులు పెట్టే ఇబ్బందులు కూడా అప్పుడప్పుడు ఆత్మను స్పృశిస్తుంటాయి. కాబట్టి మహా కవులు, పండితులు వాగ్గేయకారులు కూడా రాజాశ్రయాన్ని నిరసిస్తూ రచనలు చేశారు. ధూర్జటి రచించిన శతకపద్యమిక్కడ చెప్పుకోదగి ఉంది.

"రాజుల్మత్తులు వారిసేవ నరక ప్రాయంబు వారిచ్చు నం
భోజాక్షీ చతురంత యాన తురగీ భూషాదులాత్మ వ్యథా
బీజంబుల్ తదపేక్ష చాలుఁ బరితృప్తిం బొందితిన్ జ్ఞాన ల
క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!"

(శ్రీకాళహస్తీశ్వర శతకం - పద్యం 18)

వేంకటేశ్వరుడే దిక్కని, సర్వదా అతన్ని అంటిపెట్టుకొని ఉండడమే సమంజసమనీ, ఇతరులను కొలవడం సుతరాము మంచిదికాదనీ చిన తిరుమలయ్య తలంపు.

"ఎఱుక గలిగితేను యీతడెదిక్కు
మఱి నిమిషమీతని మాని వుండఁ దగునా
యెవ్వరి సొమ్ము గుడిచి యెవ్వరి గుఱ్ఱాల వెంట
కొవ్వ దీరఁ బారాడి కొలిచేది" (చిన తిరుమలయ్య - అ.సం. 10-31)

**అన్య దేవతా విముఖత :** తమ కోరికలు నెరవేర్చుకోవడానికో, మోక్షాన్ని సాధించుకోవడానికో మానవులు దేవతలను ఆశ్రయిస్తారు. తాము ఆరాధించే దైవమే సర్వశక్తిమంతుడు, సర్వోన్నతుడని విశ్వసిస్తారు. ఈ విశ్వాసంవల్ల తక్కిన దేవతలపట్ల తిరస్కారభావమేర్పడుతుంది. తద్వారా విముఖత కూడా చోటు చేసుకొంటుంది. దీన్నే అన్యదేవతా విముఖత అని వ్యవహరిస్తారు. శైవుల్లోను, వైష్ణవుల్లోను ఇది ఎక్కువగా కనిపిస్తుంది. మత కలహాలకు కూడా ఒకప్పుడు ఇది దారితీసిందంటే అతిశయోక్తి కాదు. తమిళనాయన్మారులు, ఆళ్వారులేకాక, ఆంధ్రవాగ్గేయకారులు తమ రచనల్లో అన్యదేవతా విముఖతను ఆవిష్కరించారు.

"నరహరి కీర్తన నానిన జిహ్వా
నొరులనుతింపగ నోపదు జిహ్వా"(తాళ్ళపాక అన్నమయ్య, అ.సం.2-144).

అని అన్నమయ్య అన్యదేవతా విముఖతను అభివ్యక్తం చేశాడు.

అతని మనుమడు చిన తిరుమలయ్య కూడా ధ్వనిపూర్వకంగా తన అన్యదేవతా విముఖతను వెల్లడి చేశాడు. సర్వత్రా సర్వదా సర్వేశ్వరుడైన విష్ణువే శ్రీవేంకటేశ్వరుడే సర్వులకు శరణ్యమన్నాడు. ఇలా చెప్పడం ద్వారా అన్యదేవతలను ఆశ్రయించడం అనవసరమని ధ్వనింపజేశాడు.

". . . . . . . . . . . . . . . . .
యెందెందు దిరిగిన యేలికవు నీవే
నిందలేని యట్టి తోడు నీడవు నీవె
. . . . . . . . . . . . . . . . . ."

(చిన తిరుమలయ్య, అ.సం. 10-46)

**ఆత్మవిమర్శ :** తనను గురించి తాను ఆలోచించుకోవడమే ఆత్మవిమర్శ. తన బలాన్ని, బలహీనతను గుర్తెరిగి తదనుగుణంగా ప్రవర్తిస్తే మానవుడు మహోన్నతస్థితికి చేరుకోగలడు. చినతిరుమలయ్య తన బలహీనతలను గుర్తించాడు. వేంకటేశ్వరుని దృష్టికి తీసుకొచ్చాడు. "విషయాల గాడిలో కట్టుబడడం, ఊర సుద్దులతోనే కాలంగడపడం, ఉట్టిపడే కోరికలతో కొట్టుమిట్టాడడం" తన బలహీనతలని చిన తిరుమలయ్య స్వామికి మనవి చేసుకొన్నాడు.

“భారము నీదిగాన పట్టి విన్నవించేగాక
ఆరితేరి బుద్దెరిగేదది యెన్నడయ్యా ॥

వీలని సంసారపు వెట్టినేఁ జేయఁగాను
యేలిన నిన్నుఁ గొలచే దెన్నడయ్యా
కాలమెల్లా విషయాల గాడినె కట్టుండగాను
ఆలించి నీ సేవ సేసేదది యెన్నడయ్యా॥

బట్ట బయలు మాయలబారిఁ బడి వుండగాను
యిట్టే నిన్నుఁ దలచే దెన్నడయ్యా
వుట్టిపడే కోరికల వువ్విళ్ళూరఁగాను
అట్టె నిన్నుఁ బొగడేదది యెన్నడయ్యా ॥

సొలసి నాలుక నూర సుద్దులె తడవగాను
యిలపై నిన్ను నుతించే దెన్నడయ్యా” ॥

(చిన తిరుమలయ్య - అ.సం. 10-36)

**కాలస్పృహ :** పనిచేసినా చేయకున్నా కాలం గడుస్తూనే ఉంటుంది. ఆ కాలాన్ని మంచి పనులకు వెచ్చిస్తే మనుగడ సార్థకమవుతుంది. లేకపోతే నిరర్థకమవుతుంది. నిద్రాహారాలకు కొంత, కుటుంబం కోసం కొంత కాలాన్ని వెచ్చిస్తున్నామేకాని భగవంతునికోసం కాలాన్ని సదుపయోగం చేయడం లేదు. ఇది చినతిరుమలయ్య ఆవేదన, దైన్యం, నిరాశ, పారతంత్ర్య భావన ఈ గేయంలో ధ్వనిస్తున్న వైనం గమనార్హం.

నిమిషమెడతెగక హరి నిన్నుఁ దలచి
మమత నీమీదనే మరిపి బదుకుటగాక ॥

నిదురచే కొన్నాళ్ళు నేరములఁ గొన్నాళ్ళు
ముదిమిచేఁ గొన్నాళ్ళు మోసపోయి
కదిసి కోరినను గతకాలంబు వచ్చునె
మది మదినె వుండి యేమరక బదుకుటగాక ॥

కడుఁదనయులకుఁ గొంత కాంతలకు నొక కొంత
వెడ యాసలకుఁ గొంత వెట్టిసేసి
అదరి కావలెననిన నందు సుఖమున్నదా
చెడక నీసేవలే సేసి బదుకుటగాక ॥

ధనము వెంటాఁ దగిలి ధాన్యంబునకుఁ దగిలి
తనవారిఁ దగిలి కాతరుడైనను
కను గలిగి శ్రీ వెంకటనాథ కాతువె
కొనసాగి నిన్ను నే కొలిచి బదుకుటగాక ॥

(చిన తిరుమలయ్య, - అ.సం. - 10-59)

**భక్తజన సంస్మరణ :** భగవంతుణ్ణి ఆశ్రయించేవారిని ప్రతిబంధకాలేమి చేయలేవని చిన తిరుమలయ్య భావించాడు. ధ్రువుణ్ణి, అజామిళుణ్ణి, ఘంటాకర్ణుణ్ణి, ప్రహ్లాదుణ్ణి, వాల్మీకిని, అహల్యను ప్రతిబంధకాలేమి చేయలేక పోయాయని ప్రస్ఫుటం చేశాడు. అటువంటి భక్తజనులను సంస్మరించి అనుకరిస్తే ఆటంకాలన్నీ తమంతట తామే వైదొలగి పోతాయని ధ్వనింపజేశాడు.

కాలమేమి సేసీని కర్మమేమి సేసీని
యేలిన శ్రీరమణుడె యెదనుండగా
ఆలించిన ధ్రువునిని అజామిళునిని
కాలమేమి సేసెనయ్య కర్మమేమి సేసెను ॥

పాపమేమి సేసీని పగయేమి సేసీని
కాపాడె దేవుడే దగ్గరనుండగా
యేపున ఘంటాకర్ణుని యెలమి ప్రహ్లాదుని
పాపమేమి సేసెనయ్య పగయేమి సేసెను ॥

కులమేమి సేసీని గుణమేమి సేసీని
నలువైన శ్రీ వెంకటనాథుడుండగా
అలరి వాల్మీకికి అలనాడహల్యకు
కులమేమి సేసెనయ్య గుణమేమి సేసెను ॥

(చిన తిరుమలయ్య, అ.సం. - 10-43)

**నవవిధ భక్తితత్వం :** పరిచయం మోతాదు ఎక్కువైతే అభిమానం ఏర్పడుతుంది. అభిమానం ఎక్కువైతే ప్రేమగా రూపుదిద్దు కుంటుంది. ప్రేమ అధికమైతే భక్తిగా పరిమళిస్తుంది. ఈవిధంగా అనుబంధ పరాకాష్టే భక్తి అని చెప్పుకోవచ్చు. "మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసి" అని ఆర్యోక్తి. మోక్ష సాధనాలలో భక్తికి ఎంత ప్రాధాన్యమున్నదో దీన్నిబట్టి విదితమవుతుంది.

'భజ్' ధాతువుకు 'క్తి' ప్రత్యయముచేరి భక్తి అనే శబ్దమేర్పడిందని పండితుల విశ్వాసం. 'భజ్' అంటే భజించడం, సేవించడం, ప్రేమించడం, అర్చించడం అని అనేకార్థాలు చెప్పబడ్డాయి.

భక్తి అనేక రకాలు. భక్తి మూడు విధాలని కొందరు, అయిదు విధాలని మరికొందరు చెప్పగా, నారదుడు పదకొండు రకాలని పేర్కొన్నాడు. భాగవతం తొమ్మిది విధాల భక్తిని ప్రతిపాదించింది.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్" ॥
(వేదవ్యాసుడు - శ్రీమద్భాగవతము, 7-5-23)

భాగవతం ప్రతిపాదించిన నవవిధభక్తి మార్గాలే ఇప్పుడు బాగా ప్రచారంలో ఉన్నాయి. భక్తులనేకులు నవవిధ భక్తిమార్గాల్లో అన్నిటినో ఏ కొన్నిటినో ఆచరించి సత్ఫలితం పొందారు.

హరికీర్తనమే అన్ని విధాల శాంతికి ఆధారమని చిన తిరుమలయ్య కీర్తనాభక్తిని శ్లాఘించాడు.

సంకె లేక తలచిన జాణలకు
సంకీర్తనమే పో సర్వ శాంతి (చిన తిరుమలయ్య, అ.సం. - 10-20)

చిన తిరుమలయ్య స్మరణ భక్తిని ప్రస్తావించాడు. భగవంతుణ్ణి స్మరిస్తేనే జన్మకు శాంతి సిద్ధిస్తుందని దృఢంగా విశ్వసించాడు.

"భవహరమగు పతినామమె
జవకట్టి తలచితే జన్మశాంతి" (చిన తిరుమలయ్య, అ.సం. - 10-20)

ఇంట్లో శాంతి నెలకొనాలంటే శ్రద్ధతో చిత్తశుద్ధితో హరి పూజ చేయడం ఒక్కటే మార్గమని చిన తిరుమలయ్య సూచించాడు.

"తవిలి హరిపూజ తాజేయుటే
కువలయమున నిదిగో గృహ శాంతి"
(చిన తిరుమలయ్య, అ.సం. - 10-20)

హరిదాస్యం వల్ల కలిగే బలిమి ఎన్నటికీ చెడదని చిన తిరుమలయ్య భావించాడు. హరి దాస్యానికి నిండు మనసు అవసరమని ఆయన అభిప్రాయ పడ్డాడు.

"వెల్లవిరై యెప్పుడూ శ్రీ వెంకటనాథ నీ దాసు
తెల్ల కాలము జెడని యీ బలిమె నిజము"
(చిన తిరుమలయ్య, అ.సం. - 10-29)

ప్రహ్లాదుడు ప్రతిపాదించిన నవవిధ భక్తిమార్గాల్లో చినతిరుమలయ్య కీర్తన, స్మరణ, అర్చన, దాస్య భక్తి విధానాలను కొనియాడాడు. తక్కిన వాటిపట్ల ఎందుకో మౌనం వహించాడు.

చిన తిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలు 60 మాత్రమే లభిస్తున్నాయి. పరిమిత సంఖ్యలో ఉన్న వీటి నుంచి అపరిమిత విషయాలను ఆశించడం అంత సమంజసం కాదు. అన్నమయ్య, పెదతిరుమలయ్యల అడుగు జాడల్లోన్నే పయనించి తన సంకీర్తనా సృష్టికి చిన తిరుమలయ్య ఒరవడి దిద్దుకున్నాడు. ఈయన ఆధ్యాత్మిక వైభవం కొండ అద్దంలోలాగా, అతని అధ్యాత్మ సంకీర్తనల్లో సముజ్జ్వలంగా భాసిస్తూ ఉంది.

# చిన్నన్న కవన సౌందర్యం

ఆంధ్రసాహిత్యంలో మార్గశాఖకులాగే దేశిశాఖకు కూడా సముచిత స్థానం లభించింది. తెలుగుసాహిత్యానికి శ్రీకారం చుట్టిన నన్నయాదులు మార్గకవిత్వాన్ని సమాదరించినప్పటికీ తరువాత వచ్చిన శివకవులు దేశికవిత్వానికి శ్రీకారం చుట్టారు. దేశికవిత్వ ప్రథమాచార్యుడుగా పాల్కురికి సోమనాథుడు భాసించాడు. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర తెలుగులో వచ్చిన తొలితరం ద్విపద రచనలుగా చెప్పుకోవచ్చు. పాల్కురికి సోమన తరువాత అనేకులు ద్విపద ప్రక్రియ చేపట్టి రచనలు చేశారు. వారిలో తాళ్ళపాకవారు కూడా పేర్కోదగ్గవారు.

తాళ్ళపాక అన్నమాచార్యుడు ద్విపద రామాయణం, శృంగార మంజరి రచిస్తే తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు చక్రవాళ మంజరి రచించి తన కవితా నైపుణ్యాన్ని ఆవిష్కరించాడు. పెద తిరుమలాచార్యుని నాలుగో కుమారుడైన తాళ్ళపాక చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) తాత తండ్రుల అడుగుజాడల్లోనే పురోగమించి నాలుగు ద్విపద కావ్యాలు రచించాడు. తాళ్ళపాక కవులు ఎవరెవరు ఎందులో సిద్ధహస్తులో తెనాలి రామకృష్ణుడి చాటువు తెలియజేస్తుంది.

కం॥ "చిన్నన్న ద్విపద కెఱగును
పన్నుగ బెదతిరుమలయ్య పదమునకెఱగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్యగద్య శ్రేణిన్" ....

దీనినిబట్టి చిన్నన్న ద్విపద రచనలో సిద్ధహస్తుడని అభిప్రాయం.

తాళ్ళపాక పెదతిరుమలయ్యకు, అతని భార్య తిరుమలమ్మకు నాల్గవ కుమారుడుగా తాళ్ళపాక చిన్నన్న జన్మించాడు. ఈయన కూడా తక్కిన తాళ్ళపాక వారిలాగే అపార వేంకటేశ్వర భక్తి సంపన్నుడు. అనేక మహిమలు ప్రదర్శించాడు. చిన్నన్న తాత తండ్రుల్లాగా పదాలు రచించినట్లు దాఖలాలు లేవు. అయితే

చిన్నయంగారి కీర్తనలని పుదుక్కోట్టై భాగవతులు నేటికీ కొన్ని పదాలను పాడుకొంటున్నట్లు విజ్ఞులు చెబుతారు. ఈయన నాలుగు ద్విపద కావ్యాలను వెలయించి ప్రస్తుతికెక్కాడు. శాసనాలు వేయించి చరిత్రకు తోడ్పడడమేగాక తాళ్ళపాక వారి ఘనత వెల్లడయ్యేందుకు కూడా దోహదం చేశాడు.

దేవాంగులకు, పద్మసాలె వారికి మధ్య తలెత్తిన తగాదాను అలిమేలు మంగమ్మ అనుగ్రహంతో చక్కగా పరిష్కరించాడు. తద్వారా సమాజంలో శాంతి నెలకొనేట్టు చేశాడు. చిన్నన్న కూడా వైష్ణవ వ్యాప్తికి శాయశక్తులా తోడ్పడ్డాడు.

**కావ్యాలు :** తాళ్ళపాక చిన్నన్న రచనల మీద ఆచార్య రమణయ్యగారు పరిశోధన చేశారు. వారు తమ సిద్ధాంత వ్యాసంలో చిన్నన్న రచనల పూర్వాపరాలను చర్చించారు. వారి అభిప్రాయానుసారం చిన్నన్న మొదట రచించిన కావ్యం అష్టమహిషీ కల్యాణము, రెండవది ఉషా కల్యాణము, మూడవది పరమయోగి విలాసము, నాల్గవది అన్నమాచార్య చరిత్రము.

**అష్టమహిషీ కల్యాణము :** చిన్నన్న 1545వ సం॥ అష్టమహిషీ కల్యాణము రచించాడు. దీనిని అలమేలు మంగమ్మకు అంకితమిచ్చాడు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1937 వ సం॥ ఈ గ్రంథాన్ని ముద్రించారు. కావ్యలక్షణ సమన్వితంగా ఈ రచన సాగింది. దీనిలో తాళ్ళపాక వంశవృక్ష వర్ణన కూడా కనిపిస్తుంది. అష్టమహిషీ కల్యాణము 5 ఆశ్వాసాల ద్విపదగ్రంథం. దీనిలో 7365 ద్విపద పంక్తులున్నాయి. చిన్నన్న అష్టమహిషీ కల్యాణానికి మూలం బమ్మెరపోతనగారి శ్రీమదాంధ్ర భాగవతమె. దశమ స్కంధ పూర్వోత్తర భాగాలలో ఉన్న శ్రీకృష్ణుని చరిత్రను తీసుకొని కొన్ని మార్పులు చేర్పులు చేసి సుందర కావ్యంగా చిన్నన్న రూపొందించాడు.

అష్టమహిషీ కల్యాణము మొదటి ఆశ్వాసంలో కృష్ణావతార వృత్తాంతం, అతని బాల్యక్రీడలు చోటు చేసుకొన్నాయి. కృష్ణలీలలు, గోపికా వినోదాలు ద్వితీయాశ్వాసంలో ఉన్నాయి. మూడవ ఆశ్వాసంలో కంసవధ, జరాసంధుని

దాడి ఉన్నాయి. నాల్గో ఆశ్వాసంలో రుక్మిణీ కల్యాణం ఉంది. 5వ ఆశ్వాసంలో జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, సత్యకీర్తి, భద్ర, లక్షణలతో కృష్ణుని వివాహాలు చోటు చేసుకొన్నాయి.

అష్టమహిషీ కల్యాణములో కూడా పరీక్షిత్తు మహారాజే కృష్ణుని కథ చెప్పవలసిందిగా శుకయోగిని అడిగాడు. అష్టమహిషీ కల్యాణ వృత్తాంతాన్ని చెప్పమని కోరడమే ఈ గ్రంథంలోని ప్రత్యేకత. కావ్యం పేరును బట్టి కావ్యంలో ప్రాధాన్యత వహించిన వృత్తాంతాన్ని బట్టి పరీక్షిత్తు అష్టమహిషీ వృత్తాంతాన్ని చెప్పమని కోరడం సముచితంగానే ఉంది. చిన్నన్న అష్టమహిషీ కల్యాణాన్ని కొన్నిచోట్ల మూలముకంటే ఎక్కువగా పెంచి రాశాడు. ఈ పెంపులో దేశీయత గుభాళిస్తూ ఉంది. శైశవంలో శ్రీకృష్ణుడికి స్నానం చేయించడాన్ని చిన్నన్న దేశీయంగా రమణీయంగా వర్ణించాడు.

"నీరాడి ముదుకవన్నియ మూరకుఱుచ
చీరలు వెడగు కుచ్చెల వెట్టికట్టి
. . . . . . . . . . . . . . . . . . . . . .
కరణినుంగాయను గదిసి యుగ్గిడుచు"

(అష్టమహిషీ కల్యాణము - పుట. 21, 22)

గోపికా వస్త్రాపహరణం, గోవర్ధనోద్ధరణ, రాసక్రీడలు, మొదలైన ఘట్టాలు వర్ణించేటప్పుడు చిన్నన్న తన పాండితీ ప్రతిభను ప్రదర్శించి మూలంకంటే సుందరంగా రచించాడు. చిన్నన్న తన సంగీత నాట్య పరిజ్ఞానాన్ని ఇక్కడ చక్కగా ఆవిష్కరించాడు. కృష్ణుడి వివాహాలను చిన్నన్న దేశీయంగా వర్ణించాడు. భాగవతంలో లేని తెలుగువారి పెండ్లి ఆచారాలను చిన్నన్న తన కావ్యంలో చొప్పించి దేశీయతకు ప్రాధాన్యమిచ్చాడు. బాసికాలు కట్టడం, మధుపర్కమివ్వడం, పేరంటాండ్లు దవళాలు పాడడం, బెల్లము, జీలకఱ్ఱ పెట్టడం, మంగళసూత్రం కట్టడం, తలంబ్రాలు, సేసబ్రాలు పోయడం మొదలైన ఆచారాలు ఇక్కడ

చెప్పుకోవచ్చు. సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడి వేటను చిన్నన్న భాగవతంకంటే విపులంగా వర్ణించాడు. భాగవతంలో లేని విందు భోజనాలను కూడా తన కావ్యంలో చేర్చాడు.

రుక్మిణికోసం కృష్ణుడు, శిశుపాలుడు తలపడ్డారు. కృష్ణుడు శిశుపాలుని మీదికి విజృంభించడం వీరరస ప్రధానంగా అష్టమహిషీ కల్యాణములో వర్ణించ బడింది.

**పరమయోగి విలాసము :** 'పరమయోగి విలాసము' చిన్నన్న రెండవ రచన. పన్నిద్దరు తమిళ ఆళ్వారుల జీవితాల మీద వెలువడిన తొలి తెలుగు రచన. దివ్యసూరులుగాను, ద్వాదశసూరులుగాను ప్రసిద్ధి వహించినవారు ఆళ్వారులు. వైష్ణవం తొలిదశ వీరితోనే ప్రారంభమౌతుంది. ప్రాచీన తమిళదేశంలో ప్రభవించిన వీరు వైష్ణవాన్ని బాగా వ్యాప్తి చేశారు. అందువల్ల వైష్ణవంతోపాటు వీరి కీర్తి కూడా తమిళదేశపు ఎల్లలను దాటి ఇరుగు పొరుగు దేశాల్లో ప్రవేశించింది. ఈ రచన ద్వారా భక్తజన సంస్మరణవల్ల కలిగే పుణ్యమేగాక, వైష్ణవ వ్యాప్తికి దోహదం చేసిన ఘనత కూడా చిన్నన్నకు దక్కింది. చిన్నన్న ఈ కావ్యాన్ని 1546లో రచించాడు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ గ్రంథాన్ని 1938లో ప్రకటించారు. దీనిలో 8 ఆశ్వాసాలున్నాయి. 12754 ద్విపద పంక్తులున్నాయి. చిన్నన్న ఈ గ్రంథాన్ని అలిమేలుమంగా వేంకటేశ్వరులకు సంయుక్తంగా సమర్పణ చేసుకున్నాడు.

అవతారికలో పలు దేవతల్ని ప్రస్తుతించాడు. ఆచార్య పరంపరను, తమ వంశపూర్వులను పేరు పేరునా పేర్కొన్నాడు. వేంకటేశ్వరుడే తన కలలో వచ్చి ఆళ్వారుల చరిత్రలను ఆంధ్రంలో రచించి లక్ష్మీదేవికి తనకు అంకితమిమ్మని కోరినట్లు చిన్నన్నే స్వయంగా తెలియజేశాడు. ఇది అసాధారణ అంశం. ఆముక్త మాల్యదను గురించి ఆంధ్రములో రాయమని శ్రీకృష్ణదేవరాయలను ఆదేశించిన తెలుగు రాయడే కొండల రాయుడుగా ఆళ్వారుల చరిత్రను తెలుగులో

ఆవిష్కరించమని చిన్నన్నను కోరడం విశేషం. చిన్నన్న పట్ల స్వామికి గల అనుగ్రహాన్ని ఇది తెలియజేస్తూ ఉంది.

వైష్ణవ గురు పరంపరను తెలియజేసే తమిళ రచనలే పరమయోగి విలాసానికి మూలమని తెలుస్తుంది. విష్ణువు ధర్మ సంస్థాపనార్థం అప్పుడప్పుడు అవతరిస్తాడని భగవద్గీత భావన. ధర్మోద్ధరణకు తాను పూనుకోవడమేగాక తన పరిజనవస్తు వాహనాలను కూడ విష్ణువు వినియోగిస్తాడని విజ్ఞుల విశ్వాసం. వైకుంఠుడు వనజపాణితో చెప్పిన మాటలే ఇందుకు సాక్ష్యం.

కావున ధరలోనఁ గమలాయతాక్షి
నీవు విశ్వంభరానీళావధూటి
ధరచక్ర శార్జ్ఞ నందక గదానాగ
వరవైనతేయ విష్వక్సేనముఖులు
శ్రీవత్స కౌస్తుభాంచిత నిత్యవరులు
కోవిదులగు చందకుముదాది ఘనులు
దక్కు నిత్యులును భూస్థలి బ్రవేశించి" (పరమయోగివిలాసం-పుట-21)

పరమయోగి విలాసంలో మొదటి ఆశ్వాసంలో తొలి ఆళ్వార్లచరిత్రలు-న్నాయి. తొలి ఆళ్వారులంటే కాసారయోగి (పొయ్‌గయ్ ఆళ్వార్), భూతయోగి (భూతత్త్వాళ్వార్), మహాయోగి (పేయాళ్వార్). రెండవ ఆశ్వాసంలో భక్తిసారుని చరిత్ర ఉంది. భక్తిసారుణ్ణే తిరుమళిశై ఆళ్వార్ అనికూడ అంటారు. మూడవ ఆశ్వాసంలో నలుగురి చరిత్రలు కనిపిస్తాయి. వారు శఠగోపయోగి (నమ్మాళ్వారు), మధురకవియోగి (మధుర కవి ఆళ్వార్), కులశేఖరయోగి (కులశేఖర ఆళ్వార్), కవియోగి (తిరుప్పాణాళ్వార్). నాల్గవ ఆశ్వాసంలో తొండరడిప్పొడి ఆళ్వారుగా ప్రసిద్ధి వహించిన విప్రనారాయణ చరిత్ర ఉంది. ఐదవ ఆశ్వాసంలో పెరియాళ్వారుగా పెంపు గాంచిన విష్ణుచిత్తుని చరిత్ర, ఆండాళ్‌గా అభినుతికెక్కిన గోదాదేవి చరిత్ర చోటు చేసుకున్నాయి. ఆరు, ఏడు ఆశ్వాసాలలో తిరుమంగై ఆళ్వారుగా ఖ్యాతి వహించిన పరకాల యోగి కేటాయింప బడ్డాయి. ఎనిమిదవ

ఆశ్వాసంలో నాథముని, యామునాచార్యులు (ఆళవందార్) రామానుజాచార్యులు, పరాశరభట్టు వంటి వైష్ణవ ఘనుల చరిత్రలు వర్ణింపబడ్డాయి.

ఆచార్య సి.రమణయ్యగారు తమ సిద్ధాంత గ్రంథంలో చిన్నన్న పరమయోగి విలాస రచనను గూర్చి పేర్కొంటూ ఇలా తెలియజేశారు "పరమ యోగి విలాసమునకు మూలగ్రంథము ద్రవిడ ప్రబంధమని చిన్నన్నయే తెల్పియున్నాడు. కనుక ఆధారగ్రంథ విషయమున భేదాభిప్రాయము లేదు". నారదముని చెప్పినట్టి 'యాదవశైల మాహాత్మ్యము'న గల తెఱగునను, భాగవతమునందు పూర్వాచార కథితమైన విధమునను, 'వృద్ధ పాద్మంబున పద్మ తెరగొప్ప సూత్రవతికి జెప్పిన తీరునను చిన్నన్న పరమయోగి విలాస కావ్యకథనారంభించుచున్నట్లు చెప్పుకొని యున్నాడు. చిన్నన్న ద్రవిడ ప్రబంధమగు గురుపరంపరా ప్రభావము నందలి కథనే ఆధారముగగొని కొన్ని మార్పుల కూర్పులతో రసవత్తరముగ, సుసూక్ష్మముగ, కావ్యగౌరవమును ఇనుమడింపజేయుచు పన్నిద్దరాళ్వారుల చరిత్రను పరమయోగుల చరిత్రమును వైష్ణవమత సంప్రదాయమును పోషించుచు రచనగావించి యున్నాడు". (తాళ్ళపాక చిన్నన్న (తిరువేంగళనాధయ్య) కృతులు సవిమర్శక పరిశీలనము - పిహెచ్.డి. సిద్ధాంతవ్యాస గ్రంథము, పుట 155)

భక్తిసారుని కథలో శుక్తిసారుని వృత్తాంతం కొంకణసిద్ధుని వృత్తాంతం ఉన్నాయి. చిన్నన్న ఆ రెండు కథలను ఏకీకరించి కొంకణ సిద్ధుని వృత్తాంతంగానే రచించాడు. ఇది ఔచితీ పరిపోషకంగా ఉంది. నమ్మాళ్వార్ వంశక్రమాన్ని కొంత భిన్నంగా చిన్నన్న వర్ణించాడు. కులశేఖర ఆళ్వార్ చరిత్రలో కులశేఖరుడు రామాయణ శ్రవణ పారవశ్యములో రాముని మీదికి వచ్చిన ఖర దూషణాదులను ఎదిరించేందుకు సైన్యంతో సంసిద్ధుడైనట్లు ఉంది. దీన్ని కొంత మార్చి రావణుని దుష్కృత్యాలకు కోపించి కులశేఖరాళ్వార్ లంకకు బయలుదేరినట్లు, విష్ణువతని భక్తికి మెచ్చి విమానం మీద వైకుంఠానికి తీసుకొని వెళ్ళినట్లు చిన్నన్న మార్చి రాశాడు. భగవంతుని భక్త సౌలభ్య గుణాన్ని ఆవిష్కరించేందుకే ఈయన ఈ మార్పు చేసి ఉంటాడు. కులశేఖర ఆళ్వార్ పెరుమాళ్ తిరుమొళి అనే తమిళ

ప్రబంధాన్ని, ముకుందమాల అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. చిన్నన్న ఎందుకో ముకుందమాలను పేర్కొనలేదు. తిరుప్పాణాళ్వార్ వృత్తాంతంలో లోక సారంగముని తిరుప్పాణాళ్వార్ మీదికి రాయి విసిరిన సంఘటనను పరిహరించాడు. వైష్ణవులకు కులాల పాటింపు ఉండకూడదనే భావంతోనేమో చిన్నన్న ఈ సన్నివేశాన్ని విడిచినట్టున్నాడు.

రామానుజులవారు తీర్థయాత్రలు చేస్తూ కొన్ని శైవక్షేత్రాలను కూడా వైష్ణవీకరించినట్లు ఆధార గ్రంథాల్లో ఉంది. రామానుజులవారు వెళ్ళకముందే అవన్నీ వైష్ణవ క్షేత్రాలుగానే ఉన్నట్లు చిన్నన్న తెలియజేశాడు. రామానుజులవారికి న్యూనత రాకుండా చూడాలన్న చిన్నన్న దృఢనిశ్చయం, వైష్ణవంపట్ల అతనికి గల అచంచల భక్తి ఇక్కడ అభివ్యక్తమౌతాయి.

చిన్నన్న తన కావ్యఘనతను పెంచే ఉద్దేశంతో అక్కడక్కడ నాలాయిర దివ్య ప్రబంధ పాశురాలకు తెలుగు అనువాదాలు సమకూర్చాడు. అవి మూలానికి దగ్గరగా ఉన్నాయి.

"అమల నాది బిరాన్ అడియార్క్ ఎన్నై ఆడ్పడుత్త
విమలన్ విణ్ణవర్కోన్ విరైయార్ పొళిల్ వేంగడవన్
నిమలన్ నిన్మలన్ నీతి వానవణ్ నీళ్ళ్ మదిల్ అరంగత్తమ్మాన్ తిరు
క్కమల పాదంవందు ఎన్ కణ్ణినుల్లే ఉక్కింద్రదే"

తిరుప్పాణాళ్వార్ అమలనాదిబిరాన్ ప్రబంధ పాశురానికి చిన్నన్న తెలుగు అనువాదమిది.

రమణుడౌ వేంకటగ్రావేశుపాద
కమలముల్ నాకన్నుగవ నెలకొనియె
నలఘు ప్రసన్నుడై యఖిల లోకముల
గొలచి దైత్యుల గాడకులముల నరకి"

(పరమయోగి విలాసము - పుట 213-215)

తొండరప్పొడి ఆళ్వార్ రచించిన తిరుప్పళ్ళి యెళుచ్చి ప్రబంధంలోని పాశురానికి ఉదయకాల ప్రకృతిని వర్ణిస్తూ చిన్నన్న ఇలా తెనిగించాడు.

"కదిరవన్ గుణదిశై చిగరం వందణైన్ దాన్
కనైయిరుళ్ అగంద్రది కాలయం పొళుదాయ్
మదువిరిందొళిగన మామలర్ ఎల్లామ్.....
.........................................
అరంగత్తమ్మా పళ్ళి ఎళుందరుళాయె"

"అరుణ బింబంబుదయాద్రిపై నిలిచె
బలపల వేగి వీడ్వడ మబ్బులడగె
నలరుచు బూదేనియల సోన గురిసె
బాలించి కరుణ జొప్పడ యోగనిద్ర
చాలించి శ్రీరంగశాయి మేల్కొనవె"

(పరమయోగి విలాసము - పుట 363-366)

ఈవిధంగా చిన్నన్న నాలాయిర దివ్య ప్రబంధంలో కొన్ని పాశురాలను ఛాయానువాదముగాను, కొన్నిటిని యథాతథంగాను ఆంధ్రీకరించాడు.

**ఉషా కల్యాణము :** చిన్నన్న రచించిన ద్వితీయ కల్యాణకావ్యం ఉషాకల్యాణము. ఈ అద్వితీయ కావ్యాన్ని 1547 సం॥ రచించాడు. దీన్ని జగన్మాత అలిమేలు మంగమ్మకే అంకితమిచ్చాడు. తిరుమల-తిరుపతి దేవస్థానం వారీ కావ్యాన్ని 1936 సం॥ ప్రకటించారు. దీనిలో రెండు భాగాలున్నాయి. 1. పూర్వభాగం, 2. ఉత్తర భాగం 1979 ద్విపద పంక్తులున్న ప్రణయ ప్రబంధమిది.

ఉషాకల్యాణంలో ఉషానిరుద్ధల ప్రణయ వృత్తాంతం ఉంది. ఈ కథ భాగవతంలోను హరివంశంలోను ఉంది. ఉషాకల్యాణానికి హరివంశమే మూలం. హరివంశంలో ఉన్నవిధంగానే ఈ కావ్యాన్ని రచించినట్లు చిన్నన్నే స్వయంగా తెలియజేశాడు. చిన్నన్న విశిష్టాద్వైతానికి చెందినప్పటికీ కృత్యాదిలో శివస్తుతి చేయడం గమనార్హం.

జనమేజయుడు కోరిన మీదట వైశంపాయనుడతనికి ఉషాపరిణయగాథ వినిపించినట్టు చిన్నన్న తన కావ్యంలో తెలియజేశాడు. ఉషాకల్యాణ రచనా వైశిష్ట్యం గురించి ఆచార్య సి. రమణయ్యగారు ఇలా తెలియజేశారు.

"ఈ కథా విషయమును చిన్నన్న చాలా శీఘ్రగతిని, రసవంతముగ, ఔచితీ శోభితముగ, సిద్ధ వాక్ప్రౌఢిమతో రచించి యున్నాడు. (తాళ్ళపాక చిన్నన్న (తిరువేంగళనాథయ్య) కృతులు సవిమర్శక పరిశీలనము – పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసగ్రంథము, పుట 64)

చోణపురాన్ని పాలించే బాణాసురుడి భక్తికి మెచ్చి ఈశ్వరుడు అతని నగర ద్వారాన్ని సంరక్షించడం, బాణాసురుడు ఈశ్వరుణ్ణి యుద్ధం కావాలని కోరడం మయూరధ్వజం తనంతట తానే విరిగిపడినప్పుడు తనతో సమానుడైన వాడితో బాణుడికి యుద్ధం తటస్థిస్తుందని ఈశ్వరుడు చెప్పడం బాణుడీ విషయాన్ని మంత్రి కుంభాడుడితో చెబుతున్నప్పుడు నెమలిటెక్కం విరిగి నేలకూలడం దుర్నిమిత్తాలు కనిపించడం కుంభాడుడి కుమార్తె చిత్రలేఖ బాణుడి కుమార్తె ఉషకోసం ద్వారకకు వెళ్ళి అనిరుద్ధున్ని తీసుకరావడం, ఉషానిరుద్ధుల సంయోగం, ఉషానిరుద్ధులను బాణుడు బంధించడం, నారదుడి వల్ల విషయం విన్న యాదవులు బాణుడి మీదకి దండెత్తి రావడం. ఉషా కల్యాణము పూర్వభాగంలో చోటుచేసుకొన్న ఘట్టాలు. యాదవ సైన్యానికి శివ బాణాసుర సైన్యాలకు యుద్ధం జరగడం, కృష్ణుడు విపక్ష సైన్యాలను మట్టి కరిపించి విజేత కావడం, వేయి భుజాలున్న బాణాసురుడి రెండు భుజాలు మాత్రం మినహాయించి తక్కిన భుజాలన్నిటిని శ్రీకృష్ణుడు తన చక్రాయుధంతో ఖండించి వేయడం, ఉషానిరుద్ధుల వివాహం, వారు ద్వారకకు చేరుకోవడం ఉత్తరార్థంలోని విశేషాలు.

ఉషానిరుద్ధుల వివాహాన్ని చిన్నన్న ఒక తెలుగు పెళ్ళిగా అభివర్ణించాడు. వధూవరులనలంకరించడం, తలంబ్రాలు పోయడం, మధుపర్కమివ్వడం, మంగళాష్టకం చదవడం, ముత్తైదువలు పెండ్లి పాటలు పాడడం, వివాహం తరువాత విందు భోజనం మొదలైన వర్ణనల్లో తెలుగుదనం ఉట్టిపడుతూ ఉంది.

ఉష చిత్రలేఖ చెలికత్తెలతో వనకేళి, జలకేళి సలపడాన్ని, చిత్రలేఖ రచించిన చిత్రాలను ఉషా కన్యకు చూపిన క్రమాన్ని, చిత్రలేఖ ద్వారకకు వెళ్ళడాన్ని, అనిరుద్ధుడు బాణాసురుడు పంపిన సైనికులతో యుద్ధం చేయడాన్ని మూలానికంటే కొంత మెరుగ్గా వర్ణించాడు. ఉషానిరుద్ధుల కలయికను కూడా చమత్కారంగా, వ్యంగ్య మర్యాదలతో వర్ణించాడు.

ఉషాకల్యాణకావ్యంలో విష్ణుభక్తి గుభాళిస్తూ ఉంది. శంకరుడు చేసిన కృష్ణస్తుతి, శివజ్వరము చేసిన కృష్ణస్తుతి మూలానుసారంగానే రచింపబడినప్పటికీ చిన్నన్న భక్తి పరిమళించడాన్ని ఇక్కడ గమనించవచ్చు.

"మలసి బ్రహ్మనుగావ మత్స్యంబవైతి
వలనాడు కృష్ణుండవైతివి నేడు
చలమున హైహయ శత్రుండవైతి
వలనాడు కృష్ణుండవైతివి నేడు
జలధి గట్టగ రామచంద్రుడివైతి
వలనాడు కృష్ణుడవైతివి నేడు" (ఉషా కల్యాణము - పుట-66)

చిన్నన్న చేసిన వర్ణనల్లో సమయోచితంగా వైష్ణవ ప్రపత్తిని ఆవిష్కరించాడు. ఈవిధంగా ఉషాకల్యాణ కావ్యాన్ని మూలంకంటే కొన్నిచోట్ల తగ్గించి కొన్ని మార్పులు చేసి కొన్నిటిని కొత్తగా చేర్చి రమణీయంగా రచించాడు.

**అన్నమాచార్య చరిత్రము :** చిన్నన్న చివరి ద్విపద కావ్యం అన్నమాచార్య చరిత్రము. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ కావ్యాన్ని 1938లో మొదటిసారి ముద్రించారు. చిన్నన్న అన్నమాచార్య చరిత్రను అన్నమయ్య ఆరాధించిన వేంకటేశ్వరునికే అంకితమివ్వడం గమనార్హం. ఈ గ్రంథ వైశిష్ట్యాన్ని గురించి రాస్తూ ఆచార్య సి. రమణయ్య గారు ఇలా తెలియజేశారు. "ఇది తన తాతగారైన తాళ్ళపాక అన్నమాచార్యుని చరిత్రను విపులముగ, ప్రామాణికముగ, చారిత్రక సత్యమునకు దగ్గరగ రచింపబడిన గ్రంథము". (తాళ్ళపాక చిన్నన్న కృతుల - సవిమర్శక పరిశీలన, పుట 44)

అన్నమాచార్య చరిత్రలో అన్నమాచార్యుని పూర్వులు. అన్నమయ్య జననం, విద్యాభ్యాసం, తిరుమల గమనం, తాళ్ళపాక పునరాగమనం, వివాహం, ఆదివన్ శఠగోపయతి శిష్యరికం, సాళువ నరసింగ రాయని స్నేహం, తిరుమల పునరాగమనం, అన్నమయ్య మహిమలు, రచనలు, అన్నమయ్య పురంధర దాసుల సమాగమం, అన్నమయ్య సంతానం ఉన్నాయి.

**రసరంజకత్వం :** చిన్నన్న తీసుకొనే ఇతివృత్తాల్ని బట్టి వాటిని నిర్వహించిన విధానాన్ని బట్టి యథోచితంగా అనేక రసాలు చోటు చేసుకున్నాయి. వాటిని అతడు పోషించిన తీరు రమణీయం, కమనీయం.

రసరాజంగా పరిగణింపబడే శృంగారరసాన్ని చిన్నన్న చక్కగా పోషించాడు. ఉషాకల్యాణ కావ్యంలో అంగిరసం శృంగారమే. నాయకుడు ధీరలలితుడు. కాగా నాయిక ప్రగల్భ. జలకేళిలో పార్వతీ పరమేశ్వరుల శృంగార పారవశ్యాన్ని చూసిన ఉషలో కామోత్కంఠత కల్గడం అది క్రమంగా వికసించి అనిరుద్ధ సమాగమంతో పరాకాష్ఠను చేరుకోవడం కనిపిస్తుంది. పార్వతీ పరమశివుల శృంగార విలాసాన్ని చూసినప్పుడు ఉషలో అంకురించిన తలపులకు చిన్నన్న యిక్కడ అద్దంపట్టిన తీరు మనోహరం.

ఒకటియు నొకటియు నొరసిలోలోన
తుకతుకలాడు బంధుర కుచద్వయము
ప్రియుని వక్షము గాడ బిగియించి పట్టి
ప్రియములు రెట్టింప బింబాధరంబు
చవిగొను సతులెంత సౌభాగ్యవతులె
చివురు విల్తునికేళి చిత్తంబు గరిగి
కలకంఠి విభుని చొక్కగ చేయు మగువ
తలపోయమున్నెంత తపము చేసినదొ" (ఉషా కల్యాణము, పుట 18)

అష్టమహిషీ కల్యాణములో గూడ కృష్ణుడు గోపికలతో జలక్రీడలాడే సందర్భంలోను శృంగార కేళికి ప్రత్యక్ష వ్యాఖ్యానం కనిపిస్తుంది.

ఘన హాస్యరసము శృంగార మధ్యమున
గొనకొన్న గతి దాళి గోవిందుగట్టి
వారిలో నొనగూడి వారిలో జొచ్చి
వారి కేళి యొనర్చి వారిని వేడ్క
తరగలగని యొక్క తరళాక్షి శౌరి
కరములోయని పట్టి కరమునవ్వినను
హరికురులని యొక్క యతివ శైవలము
సరగున పట్టి వేసరి కోరి తిట్టె
కేలెత్తి యొకతె శ్రీకృష్ణుని యోగి
లోలోవాలోయిాలో లావు మెరసి
రమ్ము రమ్మనుచు గీరమ్ము చందమున
క్రమ్మి పిలుచుట విని కమలలోచనుడు
తటివేచి పట్టి సుందరి గుబ్బలలమ
తటలక నిలిచి యాతరలాక్షి పలికె -

(అష్టమహిషీ కల్యాణము, పుట 111)

**వీరరసం :** శృంగారం తర్వాత పేర్కోదగ్గ రసం వీరం. ఉషా కల్యాణములో అనిరుద్ధుడు ఉష అంతఃపురము నుంచి వెలువడి బాణుడి సైన్యంతో యుద్ధం చేసిన ఘట్టంలో వీరరసం విజృంభించి కనిపిస్తుంది. ఇక్కడ విజృంభించిన అనిరుద్ధుడి నేర్పే కాదు, అతనిని విజృంభింపచేసిన చిన్నన్న నేర్పు కూడ ద్యోతకమౌతుంది.

"ఘనసార కస్తూరి కొలిప్తబాణ
తనయ మనోహరస్తన యుగ్మ ఘటిత
ఘన వక్షుడగు యదు కంఠీరవుండు
తన చేర్వ నున్నట్టి దారుణోత్తుంగ
పరిషంబుగాని ప్రియ భామ హర్షింప

సర భసవృత్తి తత్సౌధంబు డిగ్గి
గురు గహ్వరీర గుహనుండి వెడలి
కరుల ఢీకొను హరికరణి గర్జించి
పరిఘంబు వడి ద్రిప్పి పరుల కొందరిని
శిరముల పగులంగ సెలసి యోడినను (ఉషా కల్యాణము, పుట 44)

శ్రీకృష్ణుడు ఈశ్వరునితోను బాణునితోను యుద్ధం చేసే ఘట్టంలో వీరరసం చక్కగా పోషింపబడింది.

అష్టమహిషీ కల్యాణములో రుక్మిణీ వివాహ సందర్భంగా శ్రీకృష్ణుడు శిశుపాలాదులతో తలపడ్డాడు. అప్పటి అతని విజృంభణ అద్భుతంగా వర్ణింప బడింది. ఇది వీరరస పరాకాష్ఠ. చిన్నన్న వర్ణనా నైపుణ్యానికి శిఖర ప్రాయం.

వాహినీ పతివలె వాహినీ సమితి - వాహిని దశదిశల్ వడకనేతేర
వాహినీ విభుడు భూవర యొప్ప మిగిలి
యాతత చైద్య శౌర్యచ్ఛేద హేతు - కేతువు గీతి తార్క్ష్య కేతలింపాద
మాగధోత్పాత భూమహిత గర్జనము - బాగునరథ సముద్భట నాదమడర
(అష్టమహిషీ కల్యాణము - పుట 192)

**రౌద్రరసం :** వీరరసం తర్వాత పేర్కోదగ్గది రౌద్రం. బాణుడు అనిరుద్ధుని బంధించిన వార్త కృష్ణుడు నారదుడి ద్వారా విన్నాడు. మనవణ్ణి విడిపించేందుకు ససైన్యంగా బయల్దేరాడు. అక్కడ అతని కోపం ఏపు చూపింది. రౌద్రం లాస్యం చేసింది.

"కాంచనాంబరమును కౌస్తుభమణియు
చంచత్కరాళ దంష్ట్రా చతుష్కంబు
శరగదా చక్రాది శార్ఙ్గ కృపాణ
దరపాశ భట కోద్యద్భుజాష్టకము
శ్రీవత్స కాంచన శ్రీయును కలిగి
దేవకీతనయుడెంతే సంభ్రమమున

అనుపమ నిజపౌరుషాన్వితుండగుచు
తన తొంటి రూపంబు దాల్చె రాముడును.

(ఉషా కల్యాణము, పుట 56)

శ్రీకృష్ణుడు ఈశ్వరునితో యుద్ధం చేసేటప్పుడు పరమయోగి విలాసములో పరకారుడి విజృంభణను సహించలేక చోళరాజు పరుగెత్తేటప్పుడు భయానక రసం పోషింపబడింది. ఉషాంతఃపురంలో అనిరుద్ధుడు చేరడాన్ని అక్కడి కావలివారు అద్భుతంగానే భావించారు. అష్టమహిషీ కల్యాణములో కృష్ణుడి బాల్య చేష్టలన్నీ అద్భుతాలే. ఉషా కల్యాణములో బాణాసుర యుద్ధరంగాన్ని బీభత్సంగానే చిన్నన్న వర్ణించాడు. పరమయోగి విలాసంలో పరకారుడికి, చోళ సైన్యానికి జరిగిన యుద్ధంలో కూడ బీభత్సం వర్ణింపబడింది.

పరమయోగి విలాసములో భక్తిసారుని కథలోను, గోదాదేవి వృత్తాంతంలోనూ హాస్యరసం పోషింప బడింది. పరమయోగి విలాసములో గోదాదేవి కథలో విష్ణుచిత్త విలాపం కరుణరస పరిప్లావితం. పరమయోగి విలాసము శాంతరస ప్రధాన కావ్యం. దీనిలో పలుచోట్ల కరుణరసం చక్కగా పోషింప బడింది. ఈవిధంగా చిన్నన్న తన ద్విపద కావ్యాల్లో నవరసాలకు స్థానం కల్పించి వాటిని చక్కగా పోషించాడు.

అనేక ధ్వన్యనుకరణ శబ్దాలను చిన్నన్న తన రచనలో ప్రవేశపెట్టాడు. బాణుడు యుద్ధానికి బయలు దేరుతున్న సన్నివేశాన్ని ఎంత శృతి సుభగంగా వర్ణించాడో గమనిస్తే అతని ధ్వన్యనుకరణ ప్రయోగ చాతురి ప్రస్ఫుటం కాగలదు.

ఘుమ ఘుమయని వార్ధి ఘూర్ణిలి కలగ
ధమ ధమయని మ్రోయ డమరువు ద్రిప్పి
పెట పెటయని శైల బృందముల్ పగుల
గిట గిట యని పండ్లు గీటుచు గనలి”

చిన్నన్న వర్ణనా నిపుణుడు. బీభత్సాన్ని కూడా రమణీయంగా వర్ణించడం అతని నేర్పుకు ఉదాహరణ. యుద్ధరంగంలోని దృశ్యాలను జలాశయ దృశ్యాలుగా మార్చి చిత్రించడం ఎంత అద్భుతంగా ఉందో పరికిస్తే ప్రస్ఫుటమౌతుంది.

దొరగు రక్తంబులు తోయ పూరములు
శరములండజయము లాస్యములు తామరలు
కనుగవల్ తొగలు మీగాళ్ళు తాబేళ్ళు
మినుకారు నెరికురుల్ మిండ తుమ్మెదలు
కరటి తుండములు నక్రముల కంఠములు
దరములు చామరల్ తన చైననాచు
ఘన శతాంగములు వక్రములు చక్రములు
పునుగులు వర హంసములు గాగ నొప్పు.


(పరమయోగి విలాసము, పుట 392)

ఈవిధంగా అతని వర్ణనలు పాఠకుల హృదయాన్ని పలకరించి పులకింపజేస్తాయి. చిన్నన్న రచనల్లో మేలుకొలుపులు స్తుతులు ఎన్నో కనిపిస్తాయి. చిత్ర కవిత్వం కూడ చోటు చేసుకుంది. సామెతలు జాతీయాలు ఎన్నో ఉన్నాయి. పాత్రోచిత భాషను కూడా చిన్నన్న ప్రయోగించాడు.

చిన్నన్న రచించిన నాలుగు కావ్యాలు ద్విపదాత్మకాలే. అతని ద్విపదలు పాడుకోవడానికి అనువుగా ఉంటాయి. చిన్నన్న ద్విపదలోని గేయలక్షణాన్ని ఆచార్య జి. నాగయ్యగారు ఈవిధంగా శ్లాఘించారు. "చిన్నన్న గాయకుడనుటకు అతడు రచించిన సంకీర్తనములేమియు కానరాకున్నను ఈ ద్విపదలు అతని సంకీర్తనములు లేని కొరతను తీర్చుచున్నవి. గాన మాధుర్యము, అర్థ సౌలభ్యము, సహజ గాంభీర్యము, శబ్ద మార్దవము ఈ ద్విపదలలో కనిపించును. ఇవి ఉత్తమ శైలికి ప్రధాన గుణములు. (డా॥ జి.నాగయ్య, ద్విపద వాఙ్మయము, పుట, 416-417)

చిన్నన్న రాసిన నాలుగు కావ్యాల్లోను రెండు కల్యాణ కావ్యాలు. మరి రెండు చరిత్ర కావ్యాలు. మొదటి రెండు భగవంతుని లీలలు తెలియజేస్తే, తరువాతి రెండు భక్తుల ఘనతను ఆవిష్కరిస్తాయి. నాలుగూ వైష్ణవవ్యాప్తికి తోడ్పడేవే. తన ద్విపదరచనద్వారా చిన్నన్న పాల్కురికి సోమనాథుణ్ణి తలపిస్తాడంటే అతిశయోక్తి కాదు.

# రచయిత గురించి........



జననం : 15-1-1948, తిరువళ్ళూరు జిల్లా,
తిరుత్తణి తాలూకా, కావేరి రాజపురం

తల్లిదండ్రులు : శ్రీమతి జక్కంపూడి వరసమ్మ
శ్రీ జక్కంపూడి మునిస్వామి నాయుడు

విద్యాభ్యాసం : ఎం.ఏ., పిహెచ్.డి.

వృత్తి : సంయుక్తాచార్యులు
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం,
తిరుపతి

రచనలు :

| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి పంచకం | 1965 |
| చంద్రమౌళి శతకం | 1972 |
| ఉళవర్ పత్తు (తమిళ గేయాలు) | 1980 |
| సోమన, ఎఱ్ఱనల హరి వంశములు | 1989 |
| నాటక వ్యాసాలు | 1989 |
| అన్నమయ్య, ఆళ్వార్లు తులనాత్మక పరిశీలన | 1996 |
| నటరాజ శతకం | 2003 |
| షిర్డి సాయి శతకం | 2003 |
| శ్రీ వేంకటేశ్వర శతకం | 2003 |
| దేదీప్య శతకం | 2003 |
| సఖ శతకం | 2003 |
| సుబ్రమణ్య శతకం | 2003 |
| తెలుగు బాల శతకం | 2004 |
| కృష్ణ శతకం | 2005 |
| భావనా తరంగిణి (వ్యాస సంపుటి) | 2005 |
| గొంతుల జ్వాల | 2005 |
| విపంచిక | 2005 |

Students Offset, TPT. Ph:2260253